సాహిత్య
# ప్రస్థానం
జూలై 2016
వెల రూ. 10



సాహితీస్రవంతి



ఫొటో : శ్రీనివాస రెడ్డి

సాహిత్య ప్రస్థానం
జూలై 2016
సంపుటి : 15 సంచిక : 7

# ఈ సంచికలో ...

కవిత .................... 4
పరిష్కారం (కథ) .................... 5
కవిత .................... 9
వర్తమాన సామాజిక దర్పణం'కొత్త గబ్బిలం' .................... 10
కవిత .................... 13
స్త్రీవాద కవిత్వం – బాలికల సమస్యలు .................... 14
కవిత .................... 18
ఇద్దరూ ఇద్దరే (కథ) .................... 19
కవిత .................... 23
ప్రపంచీకరణపై సమరభేరి 'కాలం నది ఒడ్డున .................... 24
కవిత .................... 28
తెలుగు నేలపై కన్నడ శాసనాలు .................... 29
రైతుల సమస్యల చిత్రణ .................... 32
కవిత .................... 36
చెర (కథ) .................... 37
జీవితానుభవాల సమాహారం .................... 43
స్వీకారం .................... 45
డైరీ .................... 47

## భావస్వేచ్ఛకు రక్షణ

**భా**వ ప్రకటనాస్వేచ్ఛపై దాడులు కొనసాగుతూనే వున్నాయి. న్యాయస్థానాల పుణ్యాన చివరకు వాటికి పగ్గాలు పడుతున్నా పాలకుల ధోరణిలో మార్పు వుండటం లేదు. ఎలాటి విమర్శను గాని భిన్నాభిప్రాయాలను గాని సహించలేకపోతున్నారు. ప్రజాస్వామ్యానికి విమర్శ ప్రాణం. సృజనకారులకు భావ ప్రకటనా స్వేచ్ఛ కీలకం. ఈ రెండింటిలో దేన్నీ జీర్ణించుకోలేకపోతున్నారు పాలకులు. తెలుగు రాష్ట్రాలలో ఛానళ్ల నిలిపివేత అందుకు పెద్ద ఉదాహరణ. రెండు మూడేళ్ల ముందు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనపై కార్టూనులు వేసినందుకు ఒక ప్రొఫెసర్‌ను ఇంకా అనేక మందిని వెంటాడి వేధించారు. కర్ణాటకలో కల్బుర్గి, మహారాష్ట్రలో పన్సారే వంటి రచయితల హత్యలు దేశాన్ని అట్టుడికించాయి. హెచ్‌సియు, జెఎన్‌యు ఘటనల్లో కూడా విమర్శనా స్వేచ్ఛకు సంబంధించిన చాలా అంశాలు ముందుకొచ్చాయి. ఇటీవలనే పంజాబ్‌లో మాదక ద్రవ్యాల సమస్యకు సంబంధించి అనురాగ్ కశ్యప్ తదితరులు నిర్మించిన ఉడ్తా పంజాబ్ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ముప్పుతిప్పలు పెట్టి ముప్పయ్యారు షరతులు తొంభైఒక్క కోతలు విధించారు. అసలు చిత్రం టైటిల్‌లో పంజాబ్ అన్న పేరు వుండరాదన్నారు. ఇదంతా కూడా హద్దుమీరిన నియంత్రణే. ఎట్టకేలకు ఉన్నత న్యాయస్థానం ఈ జోక్యాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. అసలు సెన్సార్ బోర్డు పని విడుదలకు అనుమతినివ్వడం తప్ప కథ సన్నివేశాలలో తలదూర్చి ఆదేశాలివ్వడం కాదని స్పష్టం చేసింది. మళ్లీ ఇప్పుడు గుజరాత్‌లో ప్రధాని నరేంద్ర మోడీ వాగ్దానాల అమలులో వైఫల్యాన్ని ఎత్తిచూపే కార్టూన్ల పుస్తకాన్ని నిషేధించాలని వాజ్యం దాఖలైతే అహ్మదాబాద్ సివిల్‌కోర్టు తోసిపుచ్చింది. 'ఫేకూ జీ హోవే ఢిల్లీ మా' ( బూటకపు వాగ్దాత ఢిల్లీలో వున్నారు) పేర జయేష్ షా వెలువరించిన ఈ పుస్తకం రచయిత వ్యక్తిగత అభిప్రాయమే గనక దాన్ని అడ్డుకోవలసిన అవసరం లేదని తేల్చింది. ఫేక్ అన్న ఇంగ్లీషు మాటను ఫేకూ అని మార్చి ఉత్తుత్తి వాగ్దానాలు చేసేవారిని అలా పిలవాలని ప్రచారంలో చెప్పింది మోడీయే! దాన్నే ఆయనపై విమర్శకు ఉపయోగించేసరికి సమస్యగా వీరభక్తులకు మింగుడుపడలేదు. ప్రతిదానికి పరువు నష్టం పేరిట కేసులు వేస్తామని బెదిరిస్తున్న నేతలకూ, ప్రభుత్వాలకూ కూడా ఈ తీర్పులు, నిరసనలు గుణపాఠం కావాలి. భావప్రకటనా స్వేచ్ఛ విమర్శనాతత్వం వర్ధిల్లాలి.

కవర్ డిజైన్ : గిరిధర్

బొమ్మలు : తుంబలి శివాజి, గంగాధర్, మీరా

సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
వీరప్రసాద్
వల్లభాపురం జనార్దన
కె.లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ – 500 020

మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం, డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ – 520 002,
సెల్: 9490099059
ఇ–మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com

## కవిత

# నా మహానగరమేనా ?

- నిఖిలేశ్వర్
9177881201

**నా** ఆనవాళ్లు వెతుక్కుంటూ
జీవితాంతం తిరిగిన
నా మహానగరమేనా ఇది?
మెట్రో పిల్లర్స్ (స్తంభాల) మీది
అంకెల చిరునామాగా మారిన
మిత్రుల జాడ కోసం
దిక్కుతోచక నిలుచున్న–
పరాయివాణ్ణి
నా పక్కనే వేటాడే వేగంతో
దూసుకెళ్ళిపోతున్న
వాహనాల రోదలో
వ్రేళ్లు తెగిన వలస జీవిని!
ఆబిడ్స్‌లోని
దిగంబర కవుల 'కింగ్ సర్కిల్' ఆశ్రయం
అన్యాక్రాంతం,
ఓరియంటల్ హోటల్ ముషాయరాలు
కానరాని కాలగర్భంలోకి,
అక్కడే ఎంతకూ పైకెగరని
చేతిలోని పావురంతో
ఇండియన్ సోషలిస్టుల చిహ్నంగా
నిలుచున్నది నెహ్రూ కంచు విగ్రహం!
పాత గల్లీల్లోనే పైకిలేచిన
కొత్త కొత్త అపార్ట్‌మెంట్ల ఎదుట
ఏమూల తిరిగితే




ఎటు పోతుందో దారి–
అంతా అయోమయంగా,
ఇక అడగాలంటే
పాతముఖాలపై మొలిచిన
కొత్త ముఖాలే ఎటుచూసినా!

హుస్సేన్‌సాగర్ జలకాలుష్యాన్ని
మరింత పెంచిన
వినాయక నిమజ్జనం
అత్మఘోషతో
"బుద్ధం శరణం గచ్ఛామి"!
జనసంద్రంగా మారిన
ఈ మహానగరంలోనే
వొడ్డున పడిన
–చిన్న చిన్న చేపలన్నీ గిలగిలా...!
విశ్వనగరంగా విస్తరిస్తున్న
ఈ మెట్రో నగరంలోనే
దాగిన మరో నగరంలో
అవశేషాల కోసం సమాధుల అన్వేషణ,
అక్కడ కాలాన్ని పాతిపెట్టిన వాళ్లే
ఆ సమాధులపైనే ఎంతో కాలంగా!!



### జూన్ నెల పురస్కారాలు



**చారాణ**
కథకు: **రూ.700/-**
రచయిత : **అబ్దుల్ వహీద్ ఖాన్**

**సాలీడు గూడు**
కవితకు : **రూ .500/-**
రచయిత : **తన్నీరు నాయబ్ రసూల్**



*సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

◆

వ్యాసం : **భగ్వాన్ - పర్యావరణ కవిత్వం** రచయిత : **నీలం వెంకటేశ్వర్లు**
ఈ రచయితకు 'కర్లపాలెం రుక్మిణమ్మ స్మారక పురస్కారం రూ.500/- అందజేయబడుతుంది

◆

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు.
సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.

**- ఎడిటర్**

**కథ**

# పరిష్కారం

- సలీం
09849386327



రైతుల ఆత్మహత్యలు ఆపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇరవై ఐదు కోట్ల బడ్జెట్‌తో ఓ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆత్మహత్యలు చేసుకోబోయే ముందు రైతులు డిప్రెషన్‌కి లోనవుతుంటారనీ సైకియాట్రిస్టుల సాయంతో వాళ్ళ డిప్రెషన్‌ని కౌన్సెలింగ్ వల్లనో మందుల ద్వారానో నయం చేయగలిగితే ఆత్మహత్యలకు పాల్పడరనేది ఈ పథకం ఉద్దేశం. అందుకే ప్రతి జిల్లా కేంద్రంలో ఓ మానసిక వైద్యుడిని నియమించాలని నిర్ణయించుకుని ముగ్గురు వైద్యాధికారులతో ఓ కమిటీని నియమించి ఇంటర్వ్యూ ఏర్పాటు చేసింది.

ఇంటర్వ్యూ ఉదయం పదింటికి...

తొమ్మిదీ నలభైకల్లా నేనా హాల్లోకి ప్రవేశించాను. అక్కడ ఇరవై వరకు కుర్చీలు వేసి ఉన్నాయి. నేను వెళ్ళే సమయానికి అవన్నీ ఖాళీగా ఉన్నాయి. అందరికంటే ముందు వచ్చిన అభ్యర్థిని నేనేనన్మాట అనుకుంటూ ఓ కుర్చీలో కూర్చుని నా చేతిలో ఉన్న ఫైలు తెరిచి మరోసారి నా సర్టిఫికేట్లన్నీ సరిగ్గా ఉన్నాయో లేవో చూసుకునే పనిలో నిమగ్నమైనాను.

ఓ పది నిముషాల తర్వాత తలయెత్తి చూశాను. మిగతా అభ్యర్థులెవ్వరూ వచ్చిన జాడ లేదు. మెల్లగా వస్తారేమో.. ఎంత మంది పోటీ పడ్తారో.. నాకీ ఉద్యోగం వస్తుందో రాదో.. నాకవసరమని కాదు.. ఆదర్శం కోసం.. కొంతమంది రైతుల్నయినా ఆత్మహత్యల బారిన పడకుండా కాపాడానన్న తృప్తి కోసం.. ఈ ఉద్యోగం నాకొస్తే చాలా సంతోషిస్తాను. మా సొంతూరు ఇదే. నా చిన్నప్పుడు ఇది తాలూకా. ఇప్పుడు జిల్లా కేంద్రంగా మారింది. నేను ఇంటర్ వరకు ఇక్కడే చదువుకున్నాను. మెడిసిన్ చదవడానికి హైద్రాబాద్ వెళ్ళాల్సి వచ్చింది.

అమ్మానాన్న ఈ వూళ్లోనే ఉన్నారు. ఈ ఉద్యోగం చేసుకుంటూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల్ని చూసుకునే బాధ్యతని కూడా నిర్వర్తించవచ్చున్న ఆలోచన. జీతం పర్లేదు. నెలకు డెబ్బయ్ వేలు వస్తాయని ప్రకటనలో తెలియచేశారు.

పదింటికి సూటూబూటూ వేసుకున్న ముగ్గురు వ్యక్తులు నా వైపూ ఖాళీగా ఉన్న మిగతా కుర్చీల వైపు కుతూహలంగా చూసుకుంటూ వెళ్ళారు.

మరో పావు గంట గడిచింది. అభ్యర్థులెవ్వరూ రాలేదు. నా ఒక్కడి కోసం ఇంటర్వ్యూలు జరపరేమోనన్న భయం నాలో.. ఈ రోజు జరగాల్సిన ఇంటర్వ్యూని రద్దు చేసి మరో తారీఖున

నిర్వహించాలని నిర్ణయం తీసుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఎవరైనా వస్తే బావుండు.. కనీసం మరో ఇద్దరు ముగ్గురయినా..



అరగంట గడిచింది. బంట్రోతు అనుకుంటాను నిరాసక్తంగా వచ్చి నా ఎదురుగా నిలబడ్డాడు. తల తిప్పి ఖాళీ కుర్చీలవైపు మరోసారి దృష్టి సారించి నా వైపు తిరిగి "మీరు ఇంటర్వ్యూ కోసమే వచ్చారా?" అని అడిగాడు. ఎంత పిచ్చి ప్రశ్న? లేకపోతే ఇక్కడెందుకు పడిగాపులు కాస్తానూ... ఔనని చెప్పాను.

"ఇంకెవ్వరయినా వస్తారా?" అని అడిగాడు.

నాకేం తెలుసు వస్తారో రారో.. తెలియదని చెప్పాను.

అతను ఇంతక్రితం ముగ్గురు అధికారులు వెళ్ళిన గదిలోకి వెళ్ళి రెండు నిముషాల తర్వాత గది బయటికొచ్చి తలుపు దగ్గర ద్వారపాలకుడిలా నిలబడ్డాడు.

ఇక ఇంటర్వ్యూలు ఉండవు అనే నిర్ధారణకు వచ్చాను. బెల్ మోగింది. బంట్రోతు లోపలికెళ్ళి బయటికొచ్చాడు. నా వైపు అనాసక్తంగా నడుచుకుంటూ వస్తున్నాడు. ఇంటర్వ్యూలు లేవని చెప్పడానికే వస్తున్నాడని లేచి నిలబడ్డాను.

నా అంచనా తప్పయింది. ఇంటర్వ్యూ చేయడానికి పిలుస్తున్నారని చెప్పాడు. టై సరిచేసుకుని ఫైల్‌ని ఎడమ చేత్తో పట్టుకుని లోపలికి నడిచాను.

"ఇంటర్వ్యూకి మీరొక్కరే వచ్చారు కాబట్టి ఉద్యోగం మీకే ఇవ్వాలి. ఐనా పద్ధతి ప్రకారం ఇంటర్వ్యూ నిర్వహించాలని నిర్ణయించుకున్నాం" అన్నాడు ఆ ముగ్గురిలో మధ్యలో కూర్చొని ఉన్న వ్యక్తి.

"మీరిచ్చిన సమాచారాన్ని బట్టి ప్రస్తుతం మీరు హైద్రాబాద్‌లో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో నెలకు లక్ష రూపాయల జీతం మీద పన్చేస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వం ఇచ్చేది డెబ్బయ్ వేలు మాత్రమే. దానికి తోడు మీరు హైద్రాబాద్ లాంటి నగర జీవితం వదులుకుని ఈ జిల్లా కేంద్రంలో పని చేయాలి. ఇవన్నీ మీకు సమ్మతమేనా" అని అడిగాడు మరొకతను.

"నాకు జీతం కన్నా సంతృప్తి ముఖ్యం. ఇది నేను పుట్టి పెరిగిన వూరు. మా జిల్లాలో రైతుల ఆత్మహత్యల గురించి పేపర్లలో చదివినప్పుడల్లా గుండె తరుక్కుపోతూ ఉంటుంది. నేనూ రైతు బిడ్డనే. మా నాన్న ఐదెకరాల మెట్ట భూమిని సాగు చేసి మమ్మల్ని పోషించాడు. నన్ను మెడిసిన్ చదివించాడు. అందుకే ఈ రకంగానైనా మా జిల్లాలోని రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా కాపాడగలిగితే నా చదువుకో సార్థకత ఏర్పడుతుంది" అన్నాను.

మరో వారంలో ఉద్యోగంలో చేరిపోయాను. ప్రభుత్వ ఆస్పత్రిలో నా కోసం ఓ గదిని కేటాయించారు.

అంగన్‌వాడి కార్యకర్తలు చుట్టుపక్కల పల్లెటూర్లలో తిరిగి రైతులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలి. ఎవరైనా రైతు డిప్రెషన్లో ఉన్నాడని తెలిస్తే అతన్ని వైద్యం కోసం నా దగ్గరకు పిల్చుకురావాలి.

పది రోజులైనా ఒక్క కేసూ రాలేదు. గోళ్ళు గిల్లుకుంటూ కూచోవాల్సి రావటంతో విసుగ్గా అన్పించింది. కొంతమంది కార్యకర్తల్ని పిలిచి విషయం ఏమిటని ఆరా తీశాను.

"మమ్మల్ని రైతుల ఇళ్ళకెళ్ళి సర్వే చేయమన్నారు సార్. ఒక ప్రశ్నా పత్రం ఇచ్చి దానికిచ్చే సమాధానాల ఆధారంగా రైతులు డిప్రెషన్లో ఉన్నారో లేదో కనుక్కోవచ్చన్నారు. డిప్రెషన్లో ఉన్న రైతు తను డిప్రెషన్లో ఉన్నానని ఎందుకు చెప్తాడు సార్? అతని ప్రవర్తనని రోజూ గమనించే కుటుంబ సభ్యులకో అతనితో సన్నిహితంగా మెలిగే తోటి రైతులకో మాత్రమే తెలిసే విషయమది. బయటినుంచి చూసే మాకెలా తెలుస్తుంది సార్? అందువల్లనే ఇప్పటి వరకూ ఒక్క కేస్ కూడా మీకు రెఫర్ చేయలేకపోయాం" అన్నారు.

వాళ్ళ వాదన సబబుగానే అన్పించింది.

డిప్రెషన్ అనేది చాలా భయంకరమైన జబ్బు. ఆ జబ్బుతో బాధ పడ్తున్నట్టు సదరు రోగికి కూడా తెలియకపోవచ్చు. చీకటి కుహరంలోకి జారిపోయినట్లు మనిషి అందులోకి జారిపోతాడు.

మరో వారానికి ఇద్దరు అంగన్‌వాడి కార్యకర్తలు నా దగ్గరకు ఓ రైతను పిల్చుకుని వచ్చారు. చచ్చిపోతేగానీ తన సమస్యలు తీరవని అతని భార్యతో రెండు మూడు సార్లు అన్నాడట. డిప్రెషనల్లో ఉన్నాడన్న అనుమానంతో పిల్చుకొచ్చారు.

ఆ రైతును లోపలికి పిలిచాను.

"దండాలయ్యా" అన్నాడతను లోపలికి రాగానే.

వయసు యాభైకి దగ్గరగా ఉండొచ్చు. దవడలు పీక్కుపోయి ఉన్నాయి. గడ్డం మాసిపోయి ఉంది. నీరుకాయ పట్టిన చొక్కా ధోవతి మీద ఉన్నాడు.



"నీ పేరేంటి?" అని అడిగాను.

"రాములంటారయ్యా"

"ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నావు?"

"మూడెకరాల పొలం నా సొంతదయ్యా. ఇంకో రెండెకరాలు కౌలుకి తీస్కున్నా"

"ఏం పంట వేశావు?"

"పత్తి ఏశానయ్యా"

"బాగా పండిందా?"

"అంత అదురుష్ట మాకెక్కడిదయ్యా.. నీళ్లకు కరువొచ్చింది కదా. ఆకాశం గొడ్డుబోయిందేమో.. వాన సినుక్కోసం ఎదురుసూసీసూసీ ఇక లాబం లేదని వడ్డీకి డబ్బులు అప్పుగా తెచ్చి రెండు బోరు బావులు ఏయించా"

"ఇంకేం.. నీ పంటకు కావల్సినంత నీరు"

"అయ్యో కర్మ.. ఎక్కడుందోనయ్యా నీటి జల.. పాతాళంలో దాక్కుందో ఏమో.. ఎంత లోతుకు తవ్వినా సుక్క నీరు పడలా. మరో సోట మూడో బావి తవ్వించా. కొద్దిగా పడితే దాంతో పొలాల్ని తడిపాను. ఇప్పుడదీ ఎండిపోయిందయ్యా. పంట దిగుబడి రాలా.. సేసిన అప్పుల్లో సగం కూడా తీరలేదయ్యా. ఇంకా రెండు లచ్చల బాకీ ఉంది. రోజూ అప్పులోళ్ళు యింటిమీదికొచ్చి గొడవ సేస్తున్నారు. శానా అవమానంగా ఉంది. సిగ్గుతో సచ్చిపోవాలనిపిస్తోంది."

"అదే తప్పు. సమస్యలు లేని జీవితాలు ఉంటాయా ఎక్కడైనా? వాటితో ధైర్యంగా పోరాడాలి. చావు దేనికీ పరిష్కార కాదు"

"నాకు ఇద్దరాడపిల్లల తర్వాత ఓ మగపిల్లవాడు. పెద్దమ్మాయి పెళ్ళి సేశాను. రెండోదిపుడు పెళ్ళికి ఎదిగుంది. ఈ అప్పు ఎలా తీర్సాలో దాని పెళ్ళి ఎలా సేయాలో ఏమీ పాలు పోవటం లేదు. నా కొడుకు నాతో పాటు పొలం పనులకు వస్తుంటాడు. వాడి బతుకుని తల్సుకుంటే దిగులేస్తోంది. ఇన్ని సమస్యలు తట్టుకోవడం నా వల్ల కావడం లేదయ్యా"

" ఈరోజు పెద్దగా కన్పించిన సమస్య రేపు చాలా చిన్నదిగా మారిపోవచ్చు. ఎప్పుడూ చీకటే ఉంటుందా చెప్పు? తప్పకుండా వెల్తురు వస్తుంది. సహనంతో ఎదురుచూడాలి. ఓ సంవత్సరం పంట బాగా పండనంత మాత్రాన నిరాశలో కుంగిపోనక్కరలేదు. ఈ సారి పంట బ్రహ్మాండంగా పండొచ్చు. దాంతో నీ అప్పులన్నీ తీరిపోవచ్చు."

"కొన్నేళ్ల ముందు వరకైతే ఇదే ఆశతో బతికేటోడ్ని. కానీ ఏడాదికేడాదికి ఆ ఆశ అడుగంటి పోతుందయ్యా. పతేడూ ఏదో ఓ సమస్యతో నష్టం వస్తోంది. గతేడాది పంట బాగానే పండింది. కోతల సమయానికి ముదనష్టపు తుఫాను వచ్చి పంటంతా తడిసి నేల రాలిపోయింది. దాని ముందటేడాది పంటే పండలేదు. ఇత్తనాలు నాసిరకం అని తేలింది. మాకేం ఎరుకయ్యా ఏవి మంచి ఇత్తనాలో ఏవి నకిలీవో"

అతని డిప్రెషన్ ఏ స్థాయిలో ఉందో కనుక్కోడానికి కొన్ని ప్రశ్నలు వేశాను. అతనికి అన్నం సయించడం లేదట. రాత్రుళ్ళ నిద్ర పట్టదట. "పొలం వైపుకెళ్తే సాలు. దుక్కం పొంగుకొస్తుంది. నేలని వాటేసుకుని పెద్దగా ఏడ్వాలనిపిస్తుంది" అన్నాడు.

డిప్రెషన్ తగ్గడానికి, నిద్ర పట్టడానికి మందులు రాసిచ్చాను. "ఇవి రెండు వారాలు వాడు. ఆరోగ్యం బాగు పడ్తుంది. దాంతోపాటు నీకున్న సమస్యల్ని ఎదుర్కొనే మానసిక శక్తి వస్తుంది. రెండు వారాల తర్వాత వచ్చి కన్పించు" అన్నాను.

అతను నేను రాసిచ్చిన మందుల చీటీ తీసుకుని వెళ్ళిపోయాడు.

ఒక రైతుని ఆత్మహత్య చేసుకోకుండా కాపాడగలిగినందుకు తృప్తిగా అన్పించింది.

ఆ నెలలో మరో ఇద్దరు రైతులకు కూడా కౌన్సెలింగ్ చేసి మందులు రాసిచ్చాను. ఒకతను శివయ్య. నలభై యేళ్ళుంటాయి. మరొకతను చంద్రం. పాతికేళ్ళ వయసు. చంద్రం సమస్య అనువంశికం అన్పించింది. డిప్రెషన్, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంది.

చంద్రం వాళ్ళ నాన్న కూడా రైతే. నాలుగేళ్ళ క్రితం పొలంలోనే పురుగుల మందు తాగి చచ్చి పోయాడు. చంద్రం వాళ్ళ అన్నయ్య తన రెండెకరాల పొలంలో కంది పంట వేశాడు. పంట చేతికి రాబోతున్న సమయంలో అడవి పందులు పడి పంటను నాశనం చేయటంతో మనస్తాపానికి లోనై రెండేళ్ళ

క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇపుడు చంద్రం కూడా ఆత్మహత్య చేసుకోవాలనే తలంపుతో ఉన్నట్టు నాకనిపించింది.



రెండు వారాలకోసారి వాళ్ళు రావడం, నేను మందులు రాసివ్వడం జరుగుతూనే ఉంది. నా మందులు బాగా పని చేస్తున్నాయన్న నమ్మకం నాలో.. వాళ్ళు నా దగ్గరకు మొదటిసారి వచ్చినపుడున్నంత ఉదాసీనంగా వాళ్ళ మొహాలు ఇప్పుడు లేవు. కొద్దికొద్దిగా కాంతి నింపుకొని తేటగా కన్పిస్తున్నాయి.

హమ్మయ్య.. మా జిల్లాలోని ముగ్గురు రైతుల్ని ఆత్మహత్యలు చేసుకోకుండా కాపాడగలిగానని తృప్తి పడుతున్న సమయంలో పిడుగులాంటి వార్త తెలిసింది.. రాములు వురేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని.

నేను దిగ్భ్రాంతికి లోనయ్యాను. ఇదెలా సంభవం? అంటే నా మందులు పని చేయలేదా? సరిగ్గా పని చేస్తున్నాయనీ గుణం కనిపిస్తోందనీ నేను భ్రమ పడ్డానా? అసలు నేను రాసిచ్చిన మందులు కొన్నాడో లేదో? కొంటే వేసుకున్నాడో లేదో? వాటిని వాడకపోతే రెండు వారాలకోసారి క్రమం తప్పకుండా నా దగ్గరకు ఎందుకు వచ్చేవాడు? నేనడిగిన ప్రతిసారి రాత్రుళ్ళు మాత్ర వేసుకునే పడుకుంటున్నానీ నిద్ర బాగా పడ్తోందనీ చెప్పాడు మరి..

ఉండబట్టలేక నిజ నిర్ధారణ కోసం అతని వూరికి ప్రయాణమై అతని కుటుంబ సభ్యుల్ని కల్సుకున్నాను. "నేను రాసిచ్చిన మందులు రోజూ వేసుకునేవాడా?" అని రాములు భార్యని అడిగాను.

"రోజూ ఏసుకునేటోడు సారూ.. అని వాడుతున్నప్పటి నుండీ కడుపునిండా తిని కంటినిండా నిద్ర పోతున్నానని సెప్పేటోడు" అంది ఏడుస్తూ అతని భార్య.

"మరి ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు?" నా ప్రశ్న నాకే వింతగా ధ్వనించింది.

"పరువు కోసం పేనాలిచ్చే మడిసి కదా సారూ. ఆ రోజుదయం అప్పులోళ్ళు ఇంటిమీదికొచ్చారు. ఆ మడిసిని నానా మాటలన్నారు. అప్పు తీర్సలేని వాడివి అప్పెందుకు సేశావని నిలదీశారు. పెల్లి కాని కూతురుందిగా దాన్ని పంపించు.. మా డబ్బులెలా వసూలు సేసుకోవాలో మేము సూస్కుంటాం అన్నారు. ఆ రేత్తిరి మాత్ర ఏసుకుని పడుకుంటే ఉదయానికల్లా మనసు నెమ్మదిస్తుందనుకున్నా. తెల్లారకుండానే లేసి యింటి దూలానికి వురేసుకున్నాడు సారూ" అటూ శోకాలు పెట్టి ఏడ్చింది.

ఇది జరిగిన వారం లోపలే అప్పుల బాధలు భరించలేక శివయ్య, చంద్రం కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

నాకో విషయం బాగా అర్థమైంది. రైతులకు కావాల్సింది డిప్రెషన్ని తగ్గించే డాక్టర్లు కాదు. పంటకోసం చేసిన అప్పులనుంచి విముక్తి.. సైకియాట్రిస్ట్‌గా ఈ జిల్లాలో నా అనుభవాలని పేర్కొంటూ ప్రభుత్వానికో నివేదిక తయారు చేశాను. చివర్లో ప్రభుత్వ యంత్రాంగానికి కింది సూచన్ని కూడా జత పరిచాను.

"రైతులకు కావల్సింది సైకియాట్రిస్టుల కౌన్సెలింగ్‌లూ, డిప్రెషన్ని తగ్గించే మందులూ కాదు. వాళ్ళక్కావల్సింది ఆర్థిక సాయం.. అప్పుల నుంచి విముక్తి. రైతులు మానసికంగా బలహీనులు కాబట్టి ఆత్మహత్యలు చేసుకోవడం లేదు. మాట పడలేని ఆత్మాభిమానం వల్లా, పరువు నిలుపుకోవడం కోసం చివరికి ప్రాణాల్నయినా త్యజించే మనస్తత్వం వల్ల చచ్చిపోతున్నారు. వీళ్లందరూ రెండు మూడెకరాలు సాగు చేసుకునే చిన్నా చితకా రైతులే. వీళ్ళు తీర్చాల్సిన అప్పులు సగటున రెండు మూడు లక్షలకు మించి ఉండదు. ఆ లెక్కన మీరు సైకియాట్రిస్టుల నియామక పథకం కోసం కేటాయించిన పాతిక కోట్లతో కనీసం వేయి మంది రైతుల అప్పుల్ని తీర్చగలరు. తద్వారా వేయి మంది రైతుల ప్రాణాల్ని, వాటితో పాటు వాళ్ళ కుటుంబాల్ని కాపాడిన వాళ్ళవుతారు. రాములు చనిపోయాక ప్రభుత్వం మూడు లక్షల పరిహారం ఆ కుటుంబానికి అందించింది. అదే డబ్బు అతను చనిపోక ముందు ఇచ్చి ఉంటే రాములు ఆత్మహత్య చేసుకునేవాడు కాదు. వాళ్ళు చనిపోయాక మీరిచ్చే పరిహారాన్ని బతికున్నప్పుడు ఇవ్వడమే ఈ సమస్యకు పరిష్కారం. అర్థం లేని పథకాలతో డబ్బు వృథా చేయకుండా రైతుల్ని అప్పుల వూబిలోకి నెడ్తున్న పరిస్థితుల్ని అర్థం చేసుకుని వాటిని అడ్డుకునే మార్గాలు వెతికితే కొన్ని వేల రైతుల ప్రాణాల్ని కాపాడినవాళ్లవుతారు."

ఆ ఉత్తరంతో పాటు నా రాజీనామాని కూడా జతచేసి పంపించాను.

## కవిత



# న్యాయమూర్తి

- డాక్టర్ దేవరాజు మహారాజు
9908633949

కని, పెంచి, విద్యా బుద్ధులు నేర్పి
మెల్లగా, జాగ్రత్తగా ఈ జగత్తులోకి
వదిలేస్తాడు తండ్రి లాంటి కవి తన రచనని
సమాజానికి మేలు జరగాలని

కొడుకు నాగరిక సుగంధమౌతాడా ? దేశభక్తుడవుతాడా ?
దుర్మార్గంతో వ్యభిచరిస్తాడా ? దొంగబాబా అవుతాడా
నక్సలైట్ల లైటరై మంటబెడతాడా ?
తీవ్రవాదిగా మారి చిన్నారుల్ని హతమారుస్తాడా ?
సంఘ సేవకుడవుతాడా ? మతి స్థిమితం కోల్పోతాడా ?

తండ్రి దేం బాధ్యత ?
వాడిప్పుడు తండ్రి చేతిలో లేడు కదా ? ఉండడు కదా?
వాడిప్పుడు కంట్రోల్ రూం పరిధిలో లేని ఉపగ్రహం కదా ?
రచన ఏ మయ్యేది రచనే తేల్చుకోవాలి

నిలదొక్కుకుంటుందా ?
అపరి పక్వంగా నిలువుగా కూలిపోతుందా ?
సాంకేతిక లోపమా ? సామాజిక లోపమా ?
తను దిగజారి, ఇతరుల దిగజార్చనుందా ?
ఏమైనా బాధ్యత దానిదే

ఏ తండ్రీ తన సంతానాన్ని బాంబులుగా మార్చి
లోకం మీదికి విసిరేయడు కానీ,
విమర్శకుడిలా, న్యాయ బద్ధంగా ఉండడం
అవసరం !

# నాదరిరంస

- సాంధ్యశ్రీ
8106897404

తపించి పోతున్న ఆవిరి ఆత్మహత్యగాన్నంది పుచ్చుకొని
మేఘం
నేలమీద చినుకు దోసిలి విప్పటమే
కర్తవ్యోపమ - అప్పుడేకద
ఆకాశం జల ప్రవాహమై ఈ భూగోళాన్ని
కశ్మల రహితంగా కడిగేది
తడిసి మనిషి శరువయ్యేది...

పరుగులు పెడుతున్న పంట కాల్వ గలగలల్లో
ఏరువాక సంగతులు భాషాతీతంగా
హల మంత్ర పరాయణ స్వామి భుజంమీద బహిర్గతమౌతాయి
గమనించావో లేదో జీవితపు రంగుల్ని కలబోసుకొని
ప్రవాహ సుషములో ప్రాభాత సంధ్యని మోస్తూ
ఇదిగో ఇది
ఒక యుగానికి ఆకలి తీర్చే ఆరాటం
జీవన ప్రాయోజితచికీర్షగా ఆదర్శ వరిష్ఠమై
ఎగురుతున్న పైరు "పతాకలు"
పంటపొలాల్లో పసిడి విరజిమ్ముతాయి
నెలవంక కొడవలికి
కేదారశయ్యా సుషిప్తిగరిమలో
పనలు పనలుగా కలలు ఫలిస్తాయి



గంటలు మోగించుకుంటూ ఎడ్లమెడలు
నవతరాన్ని ధ్యానిస్తున్న కాలానికి
ఋతువులు గాలికి కొట్టుకుపోవటం
ఒక చిత్ చైత్రోదయ సాక్షాత్కారం కోసమని తెలుసు
తమస్యంధ్యా ఝుంఝున్ని తారుణ్య నాదంగా భరించి
ఎంత నిత్యనూతనంగా ప్రభాతాన్ని
ఊరెరిగిస్తున్నది ? రాత్రి చీకటి శూన్యాన్ని
వేకువ వెలుతురులో నింపటం నాదరిరంస కదూ.....?

## విశ్లేషణ

# వర్తమాన సామాజిక దర్పణం
# కొత్త గబ్బిలం



- మూడే నాగేంద్ర నాయక్
9704541076

*ఎండ్లూరి సుధాకర్ సామాజిక స్పృహ ఉన్న ఆధునిక కవి. ఆయన వర్తమానం, వర్గీకరణీయం, నల్లద్రాక్షపందిరి వంటి స్వీయ కవితా సంపుటాలను ప్రకటించారు. దళితవాద స్ఫూర్తి ఆయనకు అదనపు బలం. కవిత్వం చిక్కబడ్డ తర్వాత, గురిచూసి పాడడం అలవాటు చేసుకున్న తర్వాత, పదునెక్కిన భావాన్ని ఎండ్లూరి సుధాకర్ దళిత వాద నేపథ్యంలో 'కొత్త గబ్బిలం' సాహిత్య లోకంలో వదలిపెట్టారు. కొత్త గబ్బిలం ఒక సుదీర్ఘ వచన కావ్యం.*

"ఆరు ఆశ్వాసాల గ్రంథంలోనే రసాధి దేవత సాక్షాత్కరిస్తుంది, కాని ఆరు చరణాల గీతంలో వుండదనుకోవడం పొరపాటు. మహాకావ్యానికి క్రైటీరియా సైజు బరువు కావయా, నిన్నటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలే" అని ఆరుద్ర రచించిన 'సినీవాలి' ముందుమాటలో శ్రీశ్రీ అభిప్రాయపడ్డాడు. "నేటి కవిత్వంలో సమకాలీన జీవన చిత్రణ అత్యంత ఆవశ్యకం అంటూ. "సమకాలిక వస్తువే సత్కవితా వస్తువు" అంటాడు శ్రీశ్రీ. ఆధునికాంధ్ర సాహిత్యం ఆరంభమయ్యాక, ప్రాచీన కావ్య సాంప్రదాయాన్ని అనుసరించి అసంఖ్యాకంగా కావ్యాలు వెలువడ్డాయి. అయితే కాలంతోబాటూ ప్రజల జీవన విధానాలలో, కవుల ఆలోచనలలో, పాఠకుల వైవిధ్యంలో మార్పులు సంభవించడం వల్ల ఆధునిక కావ్యాలలో ఈ అధునాతన చాలా వేగంగా చొరబడ్డది. ఒకనాటి కావ్యానికి ప్రత్యామ్నాయంగా గుంటూరు శేషేంద్ర శర్మ "జన వంశం" రాయగా, సి.నారాయణ రెడ్డి "విశ్వంభర" రచించారు. అలాగే అనేక కావ్యాలు వెలువడి ఆధునిక కవిత్వాన్ని సుసంపన్నం చేశాయి.

ఇటీవలి కవితాధోరణుల్లో సామాజిక స్పృహతో వస్తున్న స్త్రీవాద, దళితవాద, మైనారిటీ వాద కవిత్వాలు సమకాలీన వస్తువులకు సంఘర్షణలకు చక్కగా అద్దంపడుతున్నాయి. దళిత స్పృహతో గతంలో కొన్ని దళిత సంఘీభావ కావ్యాలు, కవితలు వెలువడ్డాయి. ఎండ్లూరి సుధాకర్ సామాజిక స్పృహ ఉన్న ఆధునిక కవి. ఆయన వర్తమానం, వర్గీకరణీయం, నల్లద్రాక్షాపందిరి వంటి స్వీయ కవితా సంపుటలను ప్రకటించారు. దళితవాద స్ఫూర్తి ఆయనకు అదనపు బలం. కవిత్వం చిక్కబడ్డ తర్వాత, గురిచూసి పాడడం అలవాటు చేసుకున్న తర్వాత, పదునెక్కిన భావాన్ని ఎండ్లూరి సుధాకర్ దళిత వాద నేపథ్యంలో "కొత్త గబ్బిలం" సాహిత్య లోకంలో వదలిపెట్టారు. కొత్త గబ్బిలం ఒక సుదీర్ఘ వచన కావ్యం. ఆయన తన కావ్యానికి స్ఫూర్తి ఏమిటో బయటకు చెప్పకపోయినా గతంలో ఆయన రచించిన జాషువాపై వ్యాసాలు, సిద్ధాంత గ్రంధాలు, కావ్య శీర్షిక జాషువా "గబ్బిలం" కావడం, ఎండ్లూరికి ప్రేరణ ఇచ్చిన కావ్యం జాషువా గబ్బిలమేనని మనం స్పష్టంగా గమనించవచ్చు.

**వస్తువు:** జాషువా గబ్బిలంలో అరుంధతీయుని

అశృసందేశాన్ని ఈశ్వరునికి నివేదించమని గబ్బిలం ద్వారా సందేశం పంపడం కథా వస్తువైతే, ఎండ్లూరి కొత్త గబ్బిలంలో దళితుల హక్కులను, ఆకాంక్షలను వివరిస్తూ, దళిత వాద స్ఫూర్తితో ప్రభుత్వానికి తమ హక్కుల సాధనేచ్ఛాస్వరంతో సందేశాన్ని పంపడం యిందులో ప్రధానాంశం.


ఎండ్లూరి సుధాకర్

**పాత్రచిత్రణ:** ***"తెల్లని ట్యూబులైటు గదిలోకి***
***నల్ల బ్యాడ్జీలా రెపరెపలాడుతు***
***వచ్చిందో కుర్ర గబ్బిలాయి***
***వాని కన్నుల్లో కవికోకిల వారసత్వం***
***ప్రతిఫలించింది"*** అని ప్రారంభించి

**సంబోధన:** "గబ్బిల పురాణ జాషువ ఖగసన్యాసిని (ఖగరాణి) స్వకర గబ్బిల పురాణ మునిమనుమడా!

**సమైక్యం:** ***"నిన్ను చూస్తే నన్ను చూసినట్టే***
***నిన్ను చూస్తే అమ్మను చూసినట్టే***
***నిన్ను చూస్తే నగరాన్ని చూసినట్టే***
***నిన్ను చూస్తే జాతి భవిష్యత్తును చూసినట్టే"***

అని కవి గబ్బిలం లో సమైక్యం చెందడం గమనిస్తాము.

" పేదరికానికి తెలిసినంత ప్రేమల విలువ పెద్దరికానికి తెలియదు. రా గబ్బిలం....." అంటూ కవి సంభోదించిన తీరు ఒక స్నేహితునితో, ఒక సోదరితో మాట్లాడినట్లు..కొన్ని సార్లు కవి గబ్బిలంతో మమేకం చెందడం కనిపిస్తుంది.

**సందేశం:** జాషువ తన గబ్బిలం కావ్యం లో ఒక అరుంధతీయుని కన్నీటి గాథనే సందేశంగా పంపించారు. కానీ ఎండ్లూరి దళితులతోబాటూ వడ్డెరలు, పిచ్చుకగుంట్లు, నాయిబ్రాహ్మణులు, ముస్లింలు, గిరిజనులు వంటి బడుగు ప్రజానీకాన్ని, శ్రామిక లోకాన్ని కూడా కొత్త గబ్బిలంలో ఆవిష్కరించారు.

**శైలి:** కావ్య నిర్మాణ భారాన్ని వహించేది ప్రధానంగా పాత్రలే! కవి ప్రయోగించిన తీరు తెన్నులను తెలిపేది శైలి. ఇక్కడ కవి ఆధునికుడు, వస్తువూ ఆధునికమే కనుక జనజీవనంలోని వ్యవహారిక పదాలను కవి స్వేచ్ఛగా ఉపయోగించాడు. తెలంగాణా ప్రాంతంలో ఉన్న ఉర్దూ పదాలనే గాక, అక్కడక్కడ మరాఠీ పదాలనూ ఉపయోగించడం కనిపిస్తుంది. దళిత జీవనానికి సంబంధించిన వ ృత్తి సంబంధమైన పదాలను కూడా కవి ప్రయోగించాడు. కావ్యారంభంలోనే దృశ్య కావ్యంగా స్ఫురింపజేసిన కవి సుధాకర్ శైలి చాలా సందర్భాలలో సంభాషణాత్మకంగా ఉ ంది.

**పౌరాణికం:** జాషువా గబ్బిలం కావ్యం లో భారతీయ పురాణేతిహాసాలలోని కొన్ని సందర్భాలను సన్నివేశాలను ప్రస్తావించినట్లే, సుధాకర్ కూడా ఆ ప్రస్తావన చేస్తాడు. అయితే అది స్తుత పాత్రంగా కాక విభిన్న ధోరణుల్లో సాగడం గమనార్హం.

***"గబ్బిలమా!***
***నీ పాదాలకు నా కవిత్వపు కొత్త జోళ్ళను***
***తొడుగుతున్నాను.***
***రామాయణం కాదు నెత్తిన పెట్టుకోడానికి***
***శ్రీవారి సన్నిధి కాదు***
***వెండి చెప్పులతో మాదు మీద కొట్టుకోవడానికి***
***ఇవి కన్నీళ్ళతో కుట్టిన నా గుండె జోళ్ళు"*** అంటాడు.

**నగర వర్ణన:** జాషువా గబ్బిలం లో అనేక పట్టణాలను వర్ణించి, ఆయా పట్టణ వైభవాలను స్తుతించగా సుధాకర్ కావ్యంలోనూ కొన్ని నగరాలను పట్టణాలను వర్ణించడం ఉంది అయితే ఆయా స్థలాలలోని వైభవాన్ని కాక దైన్యాన్ని ఎక్కువగా ఆవిష్కరించాడు. ముఖ్యంగా హైదరాబాదు, రాజమండ్రి నగర వర్ణనలలో కవి కనిపిస్తాడు.

రాజమండ్రిని వర్ణిస్తూ

***"తండ్రీ! ఇది రాజమండ్రి***
***కులం కలుగులోంచి***
***బయటకు రాని యెండ్రి***
***ఇక్కడి నీళ్ళలో***
***రకరకాల జలగుణాలున్నాయి***
***ఈ రక్తంలో***
***శతాబ్దాల మన కణాలున్నాయి" అంటాడు***

***హైదరాబాదును వర్ణిస్తూ...***
***"సాయంకాలపు నగరం***
***నైటీలోకి మారుతూ ఉంటే***
***నకిలీ రంగులు పూసుకుంటున్న***
***రికార్డింగ్ డ్యాన్సర్ లా ఉంటుంది***
***కోడేతాచుల్ని ఆడించే***
***పాములోడి నాగస్వరంలా ఉంటుంది"*** అంటూ వర్ణిస్తాడు కవి.

**దేశీయ మార్మిజం:** దళితవాద సిద్ధాంతానికి దేశీయ

## కవిత

# అదీ లెక్క!




- నూనెల.శ్రీనివాసరావు

9492970231


ఇన్ని
కూడికలు
తీసివేతల మధ్య-
ఇన్ని
గుణకారాలు
మమకారాల మధ్య-
జీవితం
తగులు-మిగులు
అసలు-కొసరుల మధ్య
ఎక్కడో చిక్కుకొని
లెక్కకందకుంది-
అర్థం కాని
లెక్కల మధ్య
అటు-ఇటు
ఉరకలు-పరుగులు

అటు-పోట్లు
ఎగుడు-దిగుడ్లు-
తీరా అన్నీ తట్టుకుని
తేరుకునే సమయం
జీవితం
సుదీర్ఘ విరామానికి పయనం-
శూన్యంలోంచి
శూన్యంలోకే

జీవనయానం
ఇది సత్యం-
దాని మధ్య
గట్టి లెక్కలన్నీ
ఒట్టి లెక్కలే
ఏదీ వెంటరాదు-
చివరకు మిగిలే "లెక్క"
అర్థవంతమైన జీవితం
ఆదర్శమైన జీవనం
ఇదే చరిత్రలో మిగిలే
విషయం-వి"శేషం"!

---

మార్క్సిజం తాత్త్విక భూమికను కలిగిస్తుంది. అంబేద్కర్ సిద్ధాంతాలకు మార్క్సిస్టు భావజాలాన్ని అంటుగడితే వచ్చే వాదం దేశీయ మార్క్సిజం. ఈ కావ్యంలో అంబేద్కర్ ప్రస్తావనలు అనేక సందర్భాల్లో వస్తాయి. మార్క్సిజాన్ని కూడా సుధాకర్ కొన్ని సందర్భాలలో గుర్తు చేసుకున్నాడు. ఆర్థిక సమానత్వం సిద్ధిస్తే కుల సంబంధాలు, పురుషాధిపత్యం లాంటివి వాటంతటవే తొలగిపోతాయని మార్క్సిజం చెప్తుంది. ఈ సిద్ధాంతాన్ని ప్రపంచం లో చాల దేశాలకు అన్వయించవచ్చు. భారత దేశంలో ఆర్థిక సంబంధాలకంటే కుల సంబంధాలే బలీయమైనవి. కులసంబంధాలు ఆర్థిక అంశాలను నియంత్రిస్తాయని అంబేద్కర్ చెప్పాడు. ఈ రెండింటి తాత్త్విక దృక్పథమే దేశీయ మార్క్సిజం.

**వర్తమాన సమాజం:** కవి వర్తమానానికి చెందినవాడు కనుక ప్రతినిత్యం చూస్తున్న సామాజిక అన్యాయాలను, దృశ్యాలను తన కావ్యంలో కథనం చేశాడు. హైదరాబాద్ నగరంలో గబ్బిలం ప్రవేశించినప్పుడు ఎలా ప్రవర్తించాలో కొన్ని సూచనలు చేసాడు కవి.

***"వీడెవడో శివ సేన కార్యకర్త కాబోలని***
***సాయిబులు నీమీద ఫత్వా ప్రకటించి సత్వరం***
***తల్వార్లతో దాడి చేస్తారు.***
***పరవాలేదులే ఈ కబురందగానే***
***యాదవకుమారులు***
***కర్రలతో నీకు అండగా నిలుస్తారు"*** అంటాడు.

ఈనాడు సమాజాన్ని పట్టిపీడిస్తున్న మితవాద్య సంఘటనలను, బూటకపు ఎన్ కౌంటరులను, ప్రభుత్వ హైటెక్ మోసాలను, అణగారిన వర్గాలపట్ల ఇతరులు చేస్తున్న అణచివేతలూ, కావ్యం నిండా ప్రస్తావింపబడ్డాయి.

జాషువా గబ్బిలం స్ఫూర్తితో ఎండ్లూరి సుధాకర్ రచించిన ఈ "కొత్తగబ్బిలం" కేవలం దళిత జీవన కష్టాల్ని మాత్రమే గాక బహుజనుల బాధామయ గాథలను కూడా కరుణ రసాగ్రంగా ఆవిష్కరించిన కావ్యం. అంబేద్కర్ ఆశించిన దళిత రాజ్యాధికారం కోసం కవి ఎదురు చూడడం, అందుకోసం సమాజంలో ఎగసి పడుతున్న ఉద్యమాలకు అదనపు బలానివ్వడం కవి ప్రధాన ఉద్దేశ్యం.

కవిత

# నేత్రభాష

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
9441923172



చల్లగా.. హాయిగా...
వెచ్చగా... నులివెచ్చగా... పలుకరించే కళ్ళు
ప్రశ్నార్థకమై... నిలదీసే నేత్రాలు
ఒంటరి తనాన్ని... తన చూపుల కౌగిలితో
దూరం చేసే కనుపాపలు...
కష్టాల కొలిమిని చిరునవ్వుతో
చల్లారే దృక్కులు...
సమస్యల సుడిగుండాలను చేతి ఆసరాతో
ఎదిరించే కళ్ళు...
ఆ కళ్ళు... మా అమ్మవి.

మూసిన కనురెప్పల సాక్షిగా...
డెబ్బై ఏళ్ళ జ్ఞాపకాలను దాచుకొన్న
కనుపాపలు...
నేడు..
ఏ భావాలూ వ్యక్తం చేయని నిస్తేజాలు
అమ్మ నిస్తేజపు చూపు
అలవాటే... లేని మాకు
వాస్తవం... అంగీకారం కాలేకపోతూ ఉంది.

'అమ్మా...' కళ్ళు తీసుకొంటానికి వచ్చారు'
నర్సు హెచ్చరిక
నలభై ఏళ్ళ నా ప్రయాణంలో...
ఎన్ని వందల వేల లక్షల
మాటల ప్రసారాలు మా చూపులలో...!
'అమ్మ కోరిక...
వాళ్ళు తీసుకొంటారు..
నువ్వు చూడలేవు...
బయటకు రా తల్లీ...'
నాన్న దుఃఖజీర పిలిచింది
చూపులేని ఎవరినో...
భాగ్యవంతుడిని చేయదలచింది
మా వెన్నపూస..

కష్టమయినా, అమ్మ
సుకృత్తులో నేను సాక్షినయ్యాను

అమ్మ...
లేత తమలపాకు సౌకుమార్యం
దూదిపింజె మెత్తదనం.
కరకు కత్తెర్ల కోతలో
కనుపాపల కళాత్మక వెలికితీత
గిలగిలలాడే గుండె చూడలేక
కార్చే భావోద్వేగాల రూపానికి
భాషేది...?
కన్నీటి అద్దాలలో అమ్మరూపం
మసక బారుతుంటే...
పదే పదే...
ఊపిరి ఆడని, దుఃఖం తీరని
గిడస బారిన గుండె...
ఆకులా... అల్లల్లాడింది.

'ఎవరికి...' అర్థాంతరపు నా ప్రశ్న.

నిశ్శబ్దాన్ని మోయలేక...
'చెప్పు'... బయటపడింది
కోటానుకోట్ల మాటలను
పొదవు కొన్న చూపు
మౌనాన్ని ఆశ్రయించటం
ఊహూఁ... అమ్మకు ఇష్టం లేదు.

అందుకే...
మాట్లాడటానికి వెళ్ళింది.
అమ్మ ఇప్పుడు
ఇక్కడో... అక్కడో... ఎక్కడో...
మాట్లాడుతుంది.
కనుపాపల భాష
కొనసాగుతూనే ఉంటుంది
చూపుల భాషతో
శాశ్వతత్వాన్ని పొందిన
అమ్మా... నీకు జోహారు.

విశ్లేషణ

# స్త్రీవాద కవిత్వం - బాలికల సమస్యలు

- చొప్పర శివ కుమారి
9000265222



*బాలికల సమస్య ఎప్పట్నుంచో ఉన్నా వాటికి సాహిత్యంలో స్థానం తక్కువ. స్త్రీవాద సాహిత్యం వచ్చాక స్త్రీ సమస్యల్లో భాగంగా బాలికల సమస్యలను చిత్రించడం ఎక్కువైంది. పిల్లలు పుట్టిన వెంటనే పిల్లలకు ఏదైనా సమస్యలు వస్తే అయ్యో పాపం! అని కనికరం చూపి బాధపడతాం. కానీ అమ్మాయిలకు పుట్టక ముందునుంచే సమస్యలు మొదలవుతాయ్. సమస్యలు సహజంగా మొదలైతే సరే, దాన్ని ఎలాగోలా బాధతోనైనా ఓదార్చుతాం. అలాకాక పనిగట్టుకుని సమస్యలు సృష్టిస్తే – ఘోరం. చాలా ఘోరం. చాలా చాలా ఘోరం.*

బాలల సమస్యల్లో బాలికల సమస్యలు ప్రత్యేకం. కొన్ని బాలుర సమస్యల కంటే భిన్నమైనవి ఉన్నాయ్. బాలికల సమస్య ఎప్పట్నుంచో ఉన్నా వాటికి సాహిత్యంలో స్థానం తక్కువ. స్త్రీవాద సాహిత్యం వచ్చాక స్త్రీ సమస్యల్లో భాగంగా బాలికల సమస్యలను చిత్రించడం ఎక్కువైంది.

పిల్లలు పుట్టిన వెంటనే పిల్లలకు ఏదైనా సమస్యలు వస్తే అయ్యో పాపం! అని కనికరం చూపి బాధపడతాం. కానీ అమ్మాయిలకు పుట్టక ముందునుంచే సమస్యలు మొదలవుతాయ్. సమస్యలు సహజంగా మొదలైతే సరే, దాన్ని ఎలాగోలా బాధతోనైనా ఓదార్చుతాం. అలాకాక పనిగట్టుకుని సమస్యలు సృష్టిస్తే – ఘోరం. చాలా ఘోరం. చాలా చాలా ఘోరం. అలాంటి గర్భస్థ ఆడపిండం పడే వేదనను మందరపు హైమావతి 'నిషిద్ధాక్షరి' అనే కవితలో –

***"లింగ నిర్ధారణ పరీక్షలో/ ఆడపిల్లనని తెలిసాక / సామ్రాజ్యాలు కోల్పోయినట్లు / మూడో ప్రపంచ యుద్ధ మేఘాలు / ముసురుకొన్నట్లు / అలా దిగులు ముఖం/ వేలాడదీస్తారెందుకు...../ నా ఉలిపిరి ప్రాణాన్ని / గాలిలో కలిపేయాలనుకొంటావెందుకు / చూస్తూ చూస్తూ పూల రేకులనైనా / చిదిమి పారేయలేం... / ఓ తామర మొగ్గలా ఉదయించాలనుకుని / రోజుల్ని లెక్కపెడుతున్నదాన్ని / నా రాక నిషేధిస్తావెందుకు"***

అని ప్రశ్నిస్తుంది. గర్భంలోని పిండానికి చేసే లింగ నిర్ధారణ పరీక్షను అమ్నియోసింతెసిస్(amniocentesis) అంటారు. పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అని ముందే తెలిసిపోతుంది. ఇంకేం,ఆడైతే కొంపలు కూలినట్లు, ప్రాణాలు పోయినట్లు భయపడి ముందుగానే అబార్షన్ (గర్భస్రావం) చేయిస్తారు. వాళ్ళ భయాల్ని పోగొట్టుకుంటారు, సామ్రాజ్యాల్ని నిలబెట్టుకుంటారు. భవిష్యత్ లో వచ్చే నరకాన్ని ముందే పోగొట్టుకుంటారు జాగ్రత్తగా. పుట్టబోయే పిండానికి మాటలొచ్చి ఎందుకు నన్ను చంపాలనుకుంటున్నావ్? అని మనల్ని (సమస్యల్ని సృష్టించేవారిని) పుట్టకముందే తీవ్రంగా ప్రశ్నించినట్లుంది ఈ కవితా పంక్తుల్లో. పిండం మాట్లాడదనే మన ధైర్యం. నిజంగా పిండం మాట్లాడితే–తన బాధను ఇలాగే వ్యక్తం చేస్తుంది కాబోలు అనేంత తీవ్రంగా

ఉన్నాయ్ ఈ వాక్యాలు. కవయిత్రి ఇంతటితో ఆగదు. ఇలానే జరిగితే ఓ తల్లి, ఓ చెల్లి, ఓ భార్య ఉండకుండా పోతారంటూ – ***"ఇదే కొనసాగితే / వరకట్నాలు చిరునామా చెరిగిపోయి/ కన్యాశుల్కం పునరావృతమౌతుందేమో / అప్పుడైనా ఇప్పుడైనా / బాధితులం మనమే గదా..!"***

***ఆడపిల్ల అని తెలియగానే ఆ శిశువును ఏదో ఒక రకంగా దూరం చేసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఎక్కువసార్లు ఆ పిల్లల ప్రాణాలు దక్కవు. దీన్నే శ్రీమతి గారు భగవంతుడు కూడా నా మరణానికి మౌనంగా సిగ్నలిచ్చేస్తున్నాడు అంటారు.***

కవయిత్రి ఎంత ముందు చూపుతో అంటుందో ఈ మాటలు. ఒకవేళ ఇలా ఆడపిల్లల సంఖ్య తగ్గిందంటే అప్పుడూ సమస్యలు స్త్రీలకే అనే విషయం నొక్కి చెబుతోంది. ఇలాంటి భ్రూణహత్యల వల్ల సమాజ సమతౌల్యం దెబ్బతింటుందనీ, చివరికి పురుషులు కూడా స్త్రీలు లేక బాధపడాల్సి వస్తుందనీ హెచ్చరిస్తోంది. ఇలాంటి గర్భస్థ స్త్రీశిశు పిండాల ఆర్తనాదాల్ని యుద్ధశిశువు (కొండేపూడి నిర్మల), శిక్షాపత్రం (ఘంటసాల నిర్మల), ఆత్మజ (భవానీ దేవి), ఉమ్మనీటి సరస్సులో (శిలాలోలిత) మొదలైన స్త్రీవాద కవితలెన్నింట్లోనో చూడవచ్చు.

ఐక్యరాజ్య సమితి 1990 సంవత్సరాన్ని బాలికల సంవత్సరాన్ని గానూ, 1991–2000 మధ్య ఉన్న దశాబ్ద కాలాన్ని అంతర్జాతీయ బాలికల దశాబ్దంగా ప్రకటించింది. పుట్టిన ఆడపిల్లలకు మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో కొన్ని ప్రోత్సాహకర పథకాలు ప్రారంభించారు. మనదేశ ప్రధాన మంత్రి బేరీ బచావో (బాలికల్ని కాపాడుదాం) అంటూ ప్రజల్ని చైతన్యపరచే అవసరం వచ్చిందంటే ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది.

ఒకవేళ గర్భంలోని శిశువు ఆడో, మగో తెలియకపోయినా పుట్టిన తర్వాత ఏదో ఒక రూపంలో ఆడపిల్లల్ని వదిలించుకోవాలనుకునే వారూ ఉన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత చెత్తకుప్పలు, ముళ్ళ పొదల్లోకి చేరుతున్న పాపాయిల్లో బాలికల సంఖ్యే ఎక్కువ. మనదేశంలో ఇలాంటి దురాచారాలు ఇంకా ఉన్నాయ్. రాజస్థాన్ లో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని విని శ్రీమతి అనే కవయిత్రి –

***"తొమ్మిది నెలల ప్రయాణం అలసట తప్పు / పదినిముషాల విశ్రాంతి కూడా నాకు నిషిద్ధం"***

బిడ్డ పుట్టడానికి ముందు అమ్మ కడుపులో తొమ్మిది నెలలుంటుంది. కనీసం 9 నెలలైనా అక్కడ రక్షణుంటుంది. కానీ వెంటనే చంపేస్తారిక్కడ అని ఎంత విషాదంగా కవిత్వీకరించింది. ఆడపిల్ల అని తెలియగానే ఆ శిశువును ఏదో ఒక రకంగా దూరం చేసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఎక్కువసార్లు ఆ పిల్లల ప్రాణాలు దక్కవు. దీన్నే శ్రీమతి గారు భగవంతుడు కూడా నా మరణానికి మౌనంగా సిగ్నలిచ్చేస్తున్నాడు అంటారు.

ప్రపంచానికి ఆధ్యాత్మిక కేంద్రం అనే భారతదేశంలో జరుగుతున్న ఈ దారుణాలకి ఆ దేవుడు కూడా మౌనాంగీకారం తెలిపినట్లేనని, ఇలా ఆడశిశువుల దారుణ మరణాల్ని ఆ దేవుడు కూడా కాపాడలేడనే ఎద్దేవా ఈ కవితలో కన్పిస్తోంది.

చదువు–బాలికల్ని బానినత్వ భావాలనుండి కాపాడుతుంది. తన స్వంత కాళ్ళమీద నిలబడేలా చేస్తుంది. కానీ ఆ చదువు విషయంలో కూడా వివక్షతకు గురౌతుంది. కొన్నిచోట్ల కొడుకుల్ని కాన్వెంట్లకు, కూతుళ్లని ప్రభుత్వ బడులకు పంపే తల్లిదండ్రుల్ని చూస్తాం. ఒక్కోసారి ఈ ప్రభుత్వ బడులకుపంపడం కూడా గొప్పే అనుకోవాలి. ఒకవేళ చదువుకోసం పంపినా

***"అందర్లాగా పుస్తకం తెరుస్తానా / తమ్ముడి రాగాలాపన, అన్నగాడి ఘీంకారం / నాన్న నొసటి చిట్లింపు, ఎడతెగని అమ్మ పురమాయింపు"***

ఇలా ఉంటుంది అమ్మాయి చదువు అంటోంది శిలాలోలిత 'పెద్దపులి కవిత'లో. అమ్మాయి చదువుకోడానికి అనువైన వాతావరణం ఉండదు. ఒకవేళ అలా చదువుకోవాలంటే ఇంటి పనులు చేసేసి చదువుకోవచ్చు అన్న స్పృహ ఈ కవితలో ఉంది. బాలికల పాక్షిక చదువుల్ని, అమ్మాయిల చదువుల్లో వచ్చే ఆటంకాలను 'తల్లికాని పిల్లలతల్లి' (బి.అంజన) మొదలైన కవితల్లో చూడొచ్చు.

అమ్మాయిలు చదువులకు దూరమవడానికి, చదువుల్లో వెనకబడ్డానికి ప్రధానకారణం ఇంటిపని. స్త్రీవాద కవిత్వంలో ఇంటిచాకిరీకి సంబంధించిన ఇతర కవయిత్రులకంటే అంజన రాసిన కవిత ప్రత్యేకం. ఎందుకంటే అందరూ యవ్వనం వచ్చిన తర్వాత స్త్రీ ఇంటిచాకిరీ చేసినట్లు రాస్తే "తల్లికాని పిల్లలతల్లి" కవితలో ఏడేళ్ళ బాలికను పిల్లలతల్లిగా చిత్రిస్తూ, ప్రత్యేక పంథాలో సాగుతుంది ఈ కవిత. ఇప్పటికీ చాలా పల్లె ప్రాంతాల్లో అబ్బాయిల్ని బడికి పంపుతూ అమ్మాయిగా పుట్టడం నేరం అయిందా..? అన్నట్లు అమ్మాయిల్ని ఇంటిపనికోసం బడికి పంపరు. ఈ బాల్యంలోని బాలిక ఇంటిచాకిరీనే ఇలా కవిత్వీకరిస్తుంది –

*అప్పుడప్పుడూ అక్షరం దిద్దబోతాను / చంకలో తమ్ముడు చిరాకు పడతాడు... / అన్నం వండి వార్చడానికీ / తమ్ముళ్ని సాకడానికీ / బుజ్జి బుజ్జి చెల్లెల్ని బుజ్జగించడానికీ / శాపవిమోచనలేని ఆడపిల్లనై / ఏడేళ్ళకే పిల్లలతల్లినై / ఈ భూమి మీద / మీ అందరి సాక్షిగా పెరుగుతున్నాను."*

> *అబ్బాయిలను కూడా ఇంటిపనుల్లో – ముఖ్యంగా వంటపనుల్లో భాగస్తులను చేయాలి. చిన్నప్పటినుంచే పురుషులకు కూడా ఆ పనులు నేర్పడం వల్ల స్త్రీలకు గుదిబండలుగా మారిన ఇంటిపని, వంటపని మొదలైన పనులలో ఉన్న ఒత్తిడి తగ్గుతుంది.*

అంటుంది. ఇలా రోజంతా ఇంటిచాకిరీకి, పిల్లల పెంపకానికీ తన బాల్యం బలైపోతే తన బతుకంతా చీకటవుతుందని హృదయ విదారకంగా చెబుతుంది. ఇలా చెప్పడమే కాదు అక్కడితో ఆగిపోదు. సమస్యను గుర్తిస్తూనే, సమస్య పరిష్కారానికి స్త్రీ చైతన్యం కలిగేలా –

***ఐనా – నేనూరుకోను – నేరుస్తాను / ఒక్కొక్క అక్షరమే నేరుస్తాను / ఒక్కొక్క రక్తం బొట్టు తయారు చేసుకుంటున్నట్లు***

అంటుంది. స్త్రీ విద్యావంతురాలైతే ఈ సమస్యల సుడిగుండం నుండి బయట పడతారంటోంది. ఇలాంటిదే వంటిల్లు (విమల), బాధాసంద్రాన (మందరపు హైమావతి) అనే కవితలు. ఈ కవితల వల్ల మనకు తెలిసేదేమంటే చిన్నప్పటినుంచే స్త్రీలు ఇంటిపనికి పరిమితం అన్న భావన కల్పించకూడదు. ఇంటిపని అమ్మాయికే పరిమితం చేయకూడదు. అబ్బాయిలను కూడా ఇంటిపనుల్లో – ముఖ్యంగా వంటపనుల్లో భాగస్తులను చేయాలి. చిన్నప్పటినుంచే పురుషులకు కూడా ఆ పనులు నేర్పడం వల్ల స్త్రీలకు గుదిబండలుగా మారిన ఇంటిపని, వంటపని మొదలైన పనులలో ఉన్న ఒత్తిడి తగ్గుతుంది. వారు ఇతర వ్యాపకాల్లో కూడా ఇంకా ఉత్సాహంగా, ఉన్నతంగా రాణించగలరు.

స్త్రీలపై వివక్షతకు పునాది వాళ్ళు బాలికలుగా ఉన్నప్పుడే మొదలవుతుంది. ఈ విషయాన్ని 'పెద్దవ్వనీ చెప్తా' అన్న కవితలో శ్రీమతి ఇలా చెబుతుంది –

***అమ్మ కట్టుకున్న చీరకున్న అంచుల్లా / అమ్మకి మేమిద్దరం / అమ్మ దృష్టిలో నేను మైనస్, వాడు ప్లస్ / చీర ఒక అంచును గుండెలపై పదిలంగా అమర్చుకున్నట్లు / అమ్మ తమ్ముణ్ణి హృదయానికి హత్తుకుంటుంది / కాళ్ళకు అడ్డుపడే అంచులా / నన్ను మాటల్తో తన్నుతుంది.***

బాలికలు కేవలం ఆడాళ్ళుగా మారిపోవడానికి అమ్మకూడా కారణమేనంటుంది. బాలికలు చిన్నవాళ్ళు కాబట్టి అమ్మను ఎదిరించలేరు. కాబట్టే వాళ్ళతరపున శ్రీమతి ఇలా అంటోంది

*"కానీ ఇప్పుడు నేనేం చేయగలను / పెద్దయ్యాక ఓ ప్రయత్నం చేస్తా / నాకూ ఒకమ్మాయి పుట్టాక / అమ్మకు తన తప్పేమిటో తెలిసేలా చేస్తా"*

ఈ కవితలో ఇంకేంచేయలేని బాలికల నిస్సహాయతను ప్రకటిస్తూ, తను ముందు ముందు దాన్ని సరిదిద్దేలా ప్రవర్తించాలని ఓ సలహా ఇచ్చి సాయం చేస్తుంది. కానీ అప్పటికే తను కావాలనుకున్న జీవితం కోల్పోతారు బాలికలు. తను కోల్పోయినా తన కూతుళ్లకు ఆ బాధలు కల్పించకూడదనే స్పృహ కల్పిస్తోంది. అంతేకాదు, తమ కూతుళ్ళ వివక్షకు అమ్మలు చూపే ఇలాంటి పక్షపాత ప్రేమలే కారణం అని హెచ్చరిస్తోంది. బాలికను వివక్షతతో చూసే అమ్మతో బాటు అన్న, తమ్ముడు, తండ్రులు కూడా ఇలాగే చూస్తారు. సావిత్రి రాసిన 'కాలంతో కదులు' అన్న కవిత చూడండి

***"వాడూ నేనూ ఒక్కలాగే పుట్టేం! / ఒక్కదానికే పుట్టాం! / తర్వాతే వచ్చి పడింది – తంటా! / అన్నయ్యా! ఆ–బంతోసారివ్వరా అంటే / అవతలికి ఫో! పాడుముండా! అన్నాడు / అక్కకైనా, నీకైనా లక్కపిడతలే యిష్టమన్నాడు / కాబోలనుకున్నాను... / అడ్డమైన నీతులూ బోధించాడు / ఆడదాని తరహాయే వేరన్నాడు / పదమూడేళ్ళకే పరిణతి వచ్చేస్తుందన్నాడు / పెళ్ళి పేరెత్తితే సిగ్గు పడ్డావన్నాడు... / సహనం నీ సహజ గుణమన్నాడు"***

ఇలా బాలికల్ని అబలలుగా మార్చడం ఇంటినుంచే మొదలవుతుంది. అమ్మ, అన్న, తమ్ముడు, నాన్న మొదలైనవారంతా బాలికలను అబలలుగానే చూస్తారు. పైగా దానికి సహనశీలి, సహజగుణం, సహజాలంకారాలు (సిగ్గులాంటివి) అనీ పొగడ్తలతోనే ముంచేస్తారు. ఆడదాని తరహానే వేరని వేరు వేరుగానే చూస్తారు. అందరిలో ఆడవారిని వేరు చేస్తారు. ఇలాంటి పని వారే చేస్తారు. ఆటలాడడంలోనే ఆడవారి ఆటలు, మగవారి ఆటలు అని వేరు చేస్తారు. ఒకవేళ కాదని ఆడితే – ఆడదానివి నీకిదేం బుద్ధి అని ఎత్తి పొడుస్తారు. తలెత్తకూడదు, జుట్టు కత్తిరించుకోకూడదు, పరిగెత్తకూడదు, గట్టిగా నవ్వకూడదు, గట్టిగా మాట్లాడకూడదు... ఇలా ఇలా గట్టివైనా ఏపనీ చేయకూడదు. ఇలాంటి వాటిని చెబుతూనే సావిత్రి ఇంకా గట్టిగానే అంటోంది

చూడండి–

''*యింత ఆలస్యంగా లేచి / బూజూలు దులిపితే / అదిరిపడ్డాడు, అరాయించుకోలేక / పోయాడు / వెక్కిరించాడు, గుక్కపట్టి యేడ్చాడు / యేది యేమైనా మరి – సారీ బ్రదర్ / నన్ను నేను తెలుసుకున్నాక – యిక / అయ్ కాంట్ హెల్ప్ యూ!*"

అంటోంది. ఒకవేళ బాలికలు ఆ సమస్యల నుండి బయటపడ్డానికి ప్రయత్నిస్తుంటే భయపడిపోయి నయానో, భయానో వాటిని మాన్పించాలనుకుంటాడు అని, అలాంటి సమయంలోనే బాలికలు స్థిరచిత్తంతో అడుగు ముందుకేయాలన్న భావం పై కవితలో కన్పిస్తోంది. నిజంగా బాలికలు అన్ని పనులూ చేస్తూ, స్వంతంగా తమకాళ్ళమీద తాము నిలబడుతూ, ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే ఎవ్వరికీ తీసిపోరని ఉత్సాహాన్ని కూడా సావిత్రి ఇస్తున్నారు. అలాంటి భావాలు బందిపోట్లు (సావిత్రి), ముఖం ముడిచిన మల్లె పువ్వు (జయ) మొదలైన కవితల్లో కన్పిస్తాయ్.

బాలికల్ని చాలా చిన్న వయసునుంచే వేశ్యా గృహాలకు తరలిస్తున్నారు. బలవంతంగా వేశ్యల్ని చేస్తున్నారు. పేదరికం మొదలైన కారణాల వల్ల కొందరు బాలికల్ని వేశ్యలుగా మారుస్తుంటే, మరోవైపు వేశ్య పిల్లల్ని మళ్ళీ వేశ్యలుగానే మారుస్తున్నారు. భారతదేశంలో బాల వేశ్యలుగా మారుతున్న బాలికల సంఖ్య భయాందోళనలు కలిగించేలా ఉంది. బాలవేశ్యల బాధల్ని సూటిగా చెప్పిన కవిత 'నరమేధ కాష్టంలా రగిలే చిరు రవ్వలు' (శిలాలోలిత). నేను కనిపించే పదం (కల్పనా రెంటాల), వేశ్యాశిశువు (విమల) ఈ సమస్యల్ని చిత్రించిన ఇతర కవితలు. ఈ బాలవేశ్యలుగా తయారుచేయడంలో సమాజం పాలుకూడా ఉందన్నది విస్మరించలేని నిజం.

అంతో ఇంతో ఊహొచ్చి చదువులకో, మరో పనులకో ఇంటి నుండి అడుగు బయటపెట్టిన బాలికలకు ఎదురయ్యే మరో తీవ్ర సమస్య 'ఈవ్ టీజింగ్'. దీని గురించి ఇంట్లో చెబితే చదువాపేస్తారేమోనని, పెళ్ళిచేసేస్తారేమోనని, నీదే తప్పంటారేమోనని బాలికలు బిక్కచచ్చిపోతారు. కానీ ఇప్పుడలా చేసే వారిని కఠినంగా శిక్షించే చట్టాలొచ్చాయ్. కాబట్టి బాలికలు ధైర్యంగా ముందుకొచ్చి ఎదుర్కోవాలి. ఈవ్ టీజింగ్ గురించి బలమైన కవిత 'అవును మరి'(వినోదిని). దాంటో–

*"ఇప్పుడు ఈ క్షణంలో అనిపిస్తోంది*
*ఆరునుంచి అరవైదాకా వున్న*
*మావయ్యల్ని, సైకిల్ కుర్రాళ్ళని, సారీ బాబుల్ని లాకెళ్ళి*
*బలవంతంగానైనా స్వామిమాల వెయ్యాలని"*

అంటోంది. స్వామిమాల వేస్తే ఆడవారిని చూసి వారు దూరందూరంగా వెళ్ళడాన్ని గుర్తించి ఈ మాట చెబుతోంది. ఇలాంటి సందర్భం ఎప్పుడూ ఉండాలంటే స్వామిమాల పరిష్కారమే కదా అంటుంది.

అత్యాచారం–బాలికల మీద క్రూరంగా మారిపోతున్న మరొక ఆటవిక సమస్య. రెండేళ్ళున్నా చాలు అత్యాచారానికి అర్హురాలై పోతోంది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు, స్నేహితులు, కిడ్నాపర్లు, పోలీసులు, ఉన్మాదులు, చివరికి తండ్రుల చేతుల్లో కూడా అత్యాచారాలకు గురవడం బాలికల దయనీయ స్థితిని తెల్పుతోంది. అలాంటి వారిని శిలాలోలిత 'ఇంద్రధనస్సులు' కవితలో –

*"మొగ్గను చిదిమితే మకరందమొస్తుందనుకొని*
*మొగ్గల్ని అనుభవిస్తే వయస్సు పదునెక్కుతుందనుకునే*
*మదగజాల అమానుషాలకు*
*ఈ చిన్న చిన్న దీపాలెన్ని గుప్పున ఆరిపోయాయో"*

అంటోది. ఈ సమస్య రోజురోజుకూ ఎక్కువవుతుందేగానీ తగ్గడంలేదు. ఈ సమాజం ఎంత నాగరికం అవుతున్నా అనాగరికం అలాగే ఉంటోంది,బాలికల కష్టాలు మాత్రం తగ్గడం లేదు. బాలికలుగా అమానుషంగా బలికావడాన్ని నాకో కొత్తభాష కావాలి (హైమావతి), ఉత్తమ ప్రేక్షకులు, గాంధీగారి కోతులు, ప్రశ్నల ప్రహసనం (జ్వలిత), చెయ్యిజారిన మాతృత్వం (సుహాసిని) మొదలైన ఎన్నో కవితలు గుండెల్ని పిండేసే సమస్యల్ని చిత్రించాయి.

అందుకే 'పాపా! నిదురించకే' (జయ) అనే కవితలో పాపల్ని నిదురపోకని చెప్పి ఆ సమయంలో భయంకర సమాజం నుండి ఎదురయ్యే సమస్యలు చెబుతూ, తెలుసుకొని ఎదురొడ్డి పోరాడమని చెబుతోంది. ఇలాంటి ఎన్నో సమస్యలు బాలికల్ని చుట్టుముడుతున్నాయని, ఆ ఎరుకను బాలికలకు కల్గించాలని అందువల్ల ఆ సమస్యల వలయంలో పడకుండా ఉండే అవకాశం ఉంటుందని ఎర్రజాబిళ్ళ ఎరీనా (పాటిబండ్ల రజని) లో పరిష్కార పాఠాలు కనబడుతున్నాయ్ చూడండి –

*"అయ్యా ప్రణాళికా నిర్దేశకులూ!*
*ఆడపిల్లలకోసం మీ సిలబస్ కొంచెం సవరించండి*
*తరతరాల యోధుల కథల్తో పాటు*
*తమను తాము కాపాడుకోవడం కూడా నేర్పండి!*

## కవిత

# గజల్

- ఇందిర ఇల్లందు
7396303552



నరుడు ఎలా దేవుడగును ఎదన గుడే లేనినాడు
మొలకనెలా ఈను నేల లోన తడే లేనినాడు
ఊరు నిదుర పోతున్న ఊహ సద్దు మణుగదులే
సంద్రమెలా ఘోషించును అలల సడే లేనినాడు
ఎంత మథన పడును మనసు దరులు ఏవొ దొరుకు వరకు
కావ్యమవతరించదులే కలల జడే లేనినాడు
నింగి ఎత్తుకెదిగితేమి మట్టిలోనె మన పునాది
ప్రాణికోటికేది నెలవు పుడమి ఒడే లేనినాడు
జ్ఞానదీప్తి పంచినపుడె సార్థకమగు ఓ ఇందిర
ఇలకు సిరుల సొబగులేవి వాన మడే లేనినాడు

---

# మేల్కొండి! మేల్కొండి

-శివకోటినాగరాజు
8374100234



ఎవరు ఎవరిని ప్రశ్నించేది?
ఎవరు ఎవరిని కదిలించేది ?
ఇది తప్పని ఎత్తిచూపేదెవరు ?
కులము చూడక మతం చూడక
మనుషులంతా ఒక్కటే నని
భావితరాలకు మార్గం చూపేదెవరు?
మనిషి మనిషిగా చూడలేని వ్యవస్థ
రేపటికి ఎలా మారుతుందో?
ఎవరు ఎవరిని ప్రశ్నించేది?
నిశితంగా విమర్శించేది ఎవ్వరు?
మూఢత్వంతో మూడాచారంతో
దగా పడిన వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించి
జ్ఞాన విత్తులు నాటే చేతులను నరికేయడం
ఏ నాగరికతకు చిహ్నం?
మేధస్సు విశ్వరహస్యాలు ఛేదిస్తే
మూర్ఖ భావాలు మనిషిని పాతాళంలోకి దిగలాగుతున్నాయ్
విచక్షణ కలిగిన మనుషుల్లారా!
మేల్కొండి!మేల్కొండి!
రేపటి తరాలు జ్ఞాన మార్గంలో నడిచేందుకు
రేపటి ప్రపంచాన్ని రహదారిలో నడిపేందుకు
ప్రశ్నించే వారిని బ్రతకనిద్దాం
హేతుబద్ధంగా జీవిద్దాం!

---

***రాణీ మల్లమ్మ కథ వద్దు - రమీజాబి పాఠం చెప్పండి***
***మాంచాల పద్యాల బదులు - మాయాత్యాగి గాథ చెప్పండి***
***కప్పను కబళించే పాముల్ని గురించేకాక -***
***కను'పాప'ల్నే కాటేసే రెప్పల విపరీతాన్ని కూడా***
***ఒప్పులకుప్ప వయసప్పట్నుంచే హెచ్చరించండి!"***

వీరుల కథలు కాదు, భర్తల్ని వీరుల్లా మలచాలనుకున్న భర్త చాటు భార్యల గూర్చి కాదు, రక్షించాల్సిన రక్షకభటులే భక్షకులైన వేళ అకారణంగా శిక్షనుభవించిన రమీజాబీ గురించీ, మదాంధకారంతో ఉన్మాద పురుషత్వానికి బలైన మాయాత్యాగి గురించి పాఠాలుగా చెబితే బాలికలకు అసలు నిజాలు చిన్న వయసు నుండే తెలిసొస్తాయి. ఈ క్రూర సమాజాన్ని ఎదునర్కోవడానికి ధీటుగా తయారవుతారు. తమని తాము రక్షించుకోవాలంటే - ఇలాంటి శిక్షణ తప్పదు. ఇలా బాలికలెదుర్కొనే సమస్యల్ని కొన్నింటిని స్త్రీవాదం బలంగానే కవిత్వీకరించింది. బాలల సమస్యల్లో బాలికల సమస్యలు అధికంగా ఉంటాయి.

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః' అనేది వొట్టి' మంత్రంగా వల్లె వేసుకునే ఈ కాలంలో పూజించకండ్రా బాబోయ్..... మా బతుకులు మమ్మల్ని బతకనిస్తే చాలు, నన్ను నన్నుగా ఎదగనిస్తే చాలు అని బాలికల తరపున (స్త్రీల తరపున కూడా) అరవాలనిపిస్తోంది.

కథ

# ఇద్దరూ ఇద్దరే



- వి. వెంకట్రావు
9247235401

"నాలుగు జతల బట్టలు" అన్నాడు కస్టమర్ కృష్ణకుమార్.

కొలతలు తీసుకొని, అన్నీ పుస్తకంలో రాసుకున్నాడు జయరాజ్. అన్నిటికీ ముక్కలు కత్తిరించి, డస్కులో నున్న కార్డ్‌తీసి వివరాలన్నీ రాసి ఇచ్చాడు.

కార్డుమీద డెలివరీ డేట్ చూసి."కాస్త ముందుగా కావాలండి". మా బంధువులు పెళ్ళికి వెళ్ళాలి. నాలుగు రోజులు ముందుగా ఇవ్వండి.

"అలాగే" అని అతను చెప్పిన డేట్ మార్చాడు. ఇప్పుడు కొంపలు మునిగిపోయిన పనుల ఏమీ లేవు. నిజానికి ఏదో డేట్ రాయాలి గాబట్టి రాసాడు గానీ, రేపు ఇమ్మన్నా ఇచ్చేస్తాం మనసులోనే అనుకున్నాడు జయరాజ్.

కార్డ్ మీద సాంపిల్ ముక్కలు చూసి, కాస్త కంగార పడ్డాడు. కస్టమర్ చూడండి "జయరాజ్ గారూ! ఈ ప్యాంటుమీద, షర్టు. దీనిమీద ఇది. అంటూ, తనే అన్నీ ప్యాంటు లోని, షర్టులు పెట్టి ఇలాగే వుండాలి" అన్నాడు.

"అవన్నీ, మీరు వేసుకొనే టప్పుడు చూసుకొండి. నాకెందుకు?"

"అలా కాదు, నేను చెప్పిన వరసలోనే వుంచండి. అంటే, ఏ ప్యాంట్ కి, ఆ షర్టు గుర్తుగా లోపల ఎక్కడో ఒక దగ్గర చిన్న ముక్క అయినా కుట్టండి. మళ్ళీ మేం మరచిపోతాం. ఎక్కడో ఒక దగ్గర....పోనీ పాకెట్స్ కి వేసెయ్యండి. ఎందుకంటే తీసుకున్నప్పుడు వున్న గుర్తు. వేసుకున్నపుడు వుండదండి. మళ్ళీ వెతుక్కోవాలి. అలాగని మళ్ళీ మేచింగ్ కాకపోతే బాగుండదు."

''సరే! అలాగేనండి.'' పోకేట్ ముక్కలు వెతుక్కోనక్కరలేదు. కనీసం ఆ మదుపైనా మిగులుతుంది. అని మనసులో అనుకుని, అన్ని బట్టలు మడతలు పెట్టి పక్కనే వున్న చెక్క అరమర లో పెట్టేసాడు.

"చూడండి, ఆ డేట్ మరచిపోకండి. మళ్లీ పెళ్లికి వెళ్లడానికి వేరే బట్టలు లేవు. ముందు రోజు ఒకసారి జ్ఞాపకం చేస్తాలెండి."

'వీడు కొత్త బట్టలూ, మేచింగ్ బట్టలు వేసుకుని వెళ్లకపోతే పెళ్లి ఆగిపోతుంది. కాబోలు. ఏం మనుషులు రా బాబూ.' అనుకున్నాడు.

"చూడండి మరో విషయం. అన్నింటికి మంచి బటన్స్ వేయండి. ఇదిగో మా ఫ్రండ్‌కి వున్నాయే అలాంటివి. సేమ్ అలాంటి లుక్కే రావాలి." ఆ మాత్రం దానికి మాదగ్గరకు

రావడందేనికి, రెడీమేడే తీసుకోక పోయావా? అని బయటకు అనలేదు.

''అలాంటివి దొరకాలంటే కష్టమండి చూస్తాను. మార్కెట్లో దొరికిన వాటిల్లో మంచివి కొని వేస్తాలెండి. అంత నాసిరకం మెటీరియల్ మేం వేస్తామా? మాకు మొదటి నుండి అలవాటు లేదు."

"మీరు వేస్తారని కాదు. ఇలాంటివి అయితే, బాగుంటాయని."

"లేకపోతే ఒక పని చెయ్యండి. కొద్దిదూరంలోనే రెండు టైలరింగ్ మెటీరియల్ షాపులు వున్నాయి. మీరే వెళ్లి ఒకసారి ట్రై చెయ్యండి. మీ కంటితో మీరు చూస్తే ఏ బాధా వుండదు."

"సరే చూస్తాను, చూసి నేనే పట్టుకు వస్తాను" అని వెళ్ళిపోయాడు కృష్ణకుమార్.

''ఏం అనాలో తోచలేదు. పరిస్థితులు మారిపోయాయి. అసలు మంచి మెటీరియల్ రావడం కష్టం అయిపోతుంది. ఇరవై ఏళ్ళక్రితం ఇలా కాదు. దారాలూ, జిప్పులూ, గుండీలూ, ఇతర మెటీరియల్ అమ్మే కంపెనీలు ఊరూరా ఏజెంట్లను పంపేవారు. వారు ప్రతి షాపుకి వచ్చి నచ్చజెప్పేవారు. దానికి ముందయితే జపాన్ నుండి ప్యాంటు జిప్పులు వచ్చేవి. చాలా బాగుండేవి. ప్యాంటు చిరిగిపోయినంత వరకూ మన్నిక ఉండేవి. అప్పటికీ ఇంకా జిప్పులు తయారు మన దేశంలో లేదు. తరువాత, తరువాత మన దేశంలోనే తయారయ్యేవి. వాటి నాణ్యత గురించి ఎంతో నచ్చజెప్పేవారు. జిప్పులను బలంగా లాగి చూపించేవారు. అవును మరి ఎవరి వ్యాపారం వారిది. వ్యాపారం అభివృద్ధి కావాలంటే, లాభాలు కావాలంటే, ఇలాంటి నచ్చజెప్పడాలు తప్పవు. దారాలు గురించి అయితే, ఎన్నేసి పొరలు ఉంటాయో, కుట్టు ఎంత బలంగా వుంటుందో చూపించేవారు. ఇలా ఎన్నో విధాలుగా చెప్పేవారు. దాంతో, మాలాంటి వాళ్ళం మెటీరియల్ షాప్‌కూ ఫలానా కంపెనీ దారాలు కావాలనీ, గుండీలు కావాలని అడగడం. వాళ్ళు తెప్పించడం జరిగేది. ఎప్పటికప్పుడు అమ్మకాలకోసం కొత్తకొత్తరకాలు ఉత్పత్తి చేసేవారు.

పెద్ద హోటల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసేవారు. మధ్యాహ్నం వరకూ వాళ్ళ కంపెనీ ఉత్పత్తులు గురించి చెప్పేవాళ్ళు. ఊర్లో పెద్ద టైలర్స్ కి లంచ్ ఏర్పాటు



చేసేవారు. ఏది ఇప్పుడెక్కడ. మచ్చుకి ఒక ఏజెంట్ కూడా రావడం లేదు. మరి జనాలు బట్టలు తొడగడం లేదా? తొడుగు తున్నారు. ఆనాటికీ, ఈనాటికీ బట్టలమీద మోజు పెరిగింది.

అయినా సరే, పనులు తగ్గిపోతున్నాయి. టైలర్ల సంఖ్య తగ్గిపోతోంది. రడిమేడ్ రాక టైలర్ల నోర్లు కొడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చిన ప్రతి పనీ చెయ్యాల్సివస్తోంది. కొన్నాళ్ళుపోతే, రిపేర్లు చేసుకుని బతకాలేమో, బతకడానికి మరో దారిలేకపోతే, ఇంక అదే దారి, ఆలోచనలను భగ్నం చేస్తూ, మళ్లీ వచ్చాడు కృష్ణకుమార్.

"జయరాజ్ గారూ! వెతికానండీ. మంచిరకం గుండీలు దొరకలేదు. రెండు షాపులకీ వెళ్ళాను."

"సరేలెండి. వీలయినంతవరకు మంచి గుండీలు వేస్తాను". అనడంతో వెళ్లిపోయాడు.

అప్పటికే రాత్రి తొమ్మిది. చేతిలో కటింగ్ అయిపోయి చాలాసేపయింది. పనుంటే ఎంత రాత్రి అయినా పర్వాలేదు. పనీలేదు, పాటులేదు, ఎందుకు కరెంటు దండగ. లేచి, బయటకు వచ్చాడు. బయట రామదాసు వున్నాడు. మాస్టారుగారి మాటలకు వులిక్కిపడ్డాడు. కలుస్తున్న బీడి పక్కన పడేసి షాపులోనికి వెళ్ళాడు.

"రామదాసు ఇస్త్రీ పెట్టె స్విచ్ ఆపుచేసావా?"

"ఆపేసేనండి. అని అంటూ, షర్టర్ దించి, తాళాలు వేసేసాడు. మాస్టర్ గారికి ఇవ్వబోయాడు. ఇంటికి ఇచ్చేయ్ అనడంతో వెళ్లిపోయాడు. రోడ్ బయటకు వచ్చి, కొద్దిదూరంలో వున్న స్వప్నా బార్ కి వెళ్ళాడు. అలవాటైన టేబుల్ దగ్గర కూర్చున్నాడు. బేరర్ దగ్గరకు వచ్చాడు. బేరర్‌కి జయరాజ్ అలవాటే, అతని బ్రాండూ అలవాటే.

"సార్! తెమ్మంటారా?"

"ఆ" అన్నాడు ఏవో ఆలోచనలతో ఎదురుగా వున్న కుర్చీలో ఎవరో కుర్చోబోయి, జయరాజ్ ని చూసి లేచి వెళ్ళిపోబోయాడు. గుర్తు పట్టాడు జయరాజ్.

"కూర్చోరా సత్తి! పరవాలేదు. ఇక్కడ గురువూలేదు. శిష్యుడూ లేదు. అంతా ఒక్కటే. అందర్నీ సమానం చేసేది మందు ఒక్కటే" బిడియంగానే కూర్చున్నాడు అందరూ సత్తి అనిపిలిచే సత్యన్నారాయణ.

"ఎలా వున్నయిరా పనులు".

"ఏం పనులండి మాస్టారు గారు. ఏదో కొట్టుకి దగ్గరలో ఆ పెట్రోల్ బంకూ, హోటల్ ఉండబట్టి వాళ్లతో కాస్త మంచిగా ఉండబట్టి యునిఫారాలు వస్తున్నాయి. దాంతో ఏదో అలా గడచిపోతోంది."



''పోనిలేరా, ఏదో ఒకటి. మజూరు బాగా తగ్గించి ఇస్తారనుకుంటాను."

"ఏం చేస్తాం మాస్టారూ పనులు లేనప్పుడు కూర్చునే కన్నా నయమే కదా".

"అంతేలే, ఏదో ఒకటి చేసుకోకపోతే గడవడం ఎలా? అనుకున్నాడు వాడు గాబట్టి పనుల కోసం అడగగలడు. అది నాలాంటి పెద్ద టైలర్లు అడగగలరా? వాళ్ళ దగ్గర దేహీ అని నిలబడగలరా? బట్టల షాపు వాళ్ళు పిలిస్తేనే పొమ్మన్న రోజులు వున్నాయి. రోజులు ఎలా మారిపోయాయి. వృత్తి కనుమరుగయ్యే పరిస్తితులు దగ్గర్లోనే కనిపిస్తుంది. బేరర్ తెచ్చి బాటిల్, సోడా, తినడానికి ఏదో తెచ్చి పెట్టాడు.

"మాస్టారు గారూ! అక్కడకు వెళ్లిపోతానండి." అనడంతో సరే అన్నాడు.

"నయమే ఆ మాత్రం మర్యాద ఇచ్చాడు. గురువూ, శిష్యుడూ ఎదురెదురుగా కూర్చోని మందు కొట్టే రోజులు వస్తాయి అనేవారు మా గురువుగారు. నిజంగానే అలాగే వచ్చాయి. మనసులో ఏవేవో మాటలు సుడులు తిరుగుతున్నాయి. ఒక గంట తర్వాత బయటకు వచ్చాడు. ఒళ్ళు తెలియనంతగా తాగే అలవాటు ఎప్పుడూ లేదు. నెమ్మదిగా నడచుకుంటూ, బయలుదేరాడు. దారిలో ఎవరో తెలిసినవాళ్ళు పలకరించారు. ఊరికినే పలకరించడం, లేనిపోని పోసుకోలు మాటలూ జయరాజ్‌కు ఎప్పుడూ లేదు. నడకలో నెమ్మదీ, మవునం దగ్గర్లోనే ఉంది ఇల్లు. భర్త ధోరణి తెలుసు భార్య సుజాతకి. ప్యాంటు విప్పి, లుంగీ కట్టుకున్నాడు. భార్య అన్నం వడ్డించడంతో తినేసి వచ్చి, కుర్చీలో కూర్చున్నాడు. టి.వి.లో ఏవో పాటలు వస్తున్నాయి. పిల్లలు చూస్తున్నారు. టి.వి. చూసే అలవాటు ఎపుడూ లేదు. చూడకపోయినా కాసేపు కూర్చుంటాడు. మరి, కాసేపటికే నిద్ర ముంచుకొచ్చింది.

ఉదయం ఎనిమిది గంటల వేళ, ఫోన్.

"హల్లో జయరాజ్ గారా?"

ఎప్పుడూ విన్న గొంతులాగా లేదు." అవునండి మీరెవరు?"

"ఏమీ లేదండి. మీరు ఒకసారి మా ఇంటికి రావాలి. మానాన్న గారికి కొలతలు తీసుకోవలండి. ఆయన పేషంట్ షాపుకి రాలేడు."

''అలాగా సరే, షాపుకి వెళ్లేముందు వస్తాను లెండి. అక్కడకు వచ్చేసరికి తొమ్మిదిన్నర అవుతుంది."

"సరే! మరచిపోకండి. అని అడ్రస్ చెప్పింది. ఫరవాలేదు. మరీ అట్టే దూరం కాదు. షేర్ ఆటోలో వెళ్ళొచ్చు. అనుకున్నట్టుగానే షాపుకి వెళ్లేముందు బయలుదేరాడు. ఇలాంటి అవసరాలు ఉంటాయని, ఒక టేప్ ఇంటి దగ్గర ఉంచుకుంటాడు. ఆలోచనలతోనే ఆ ఇంటికి వెళ్ళాను. అది పెద్ద అపార్ట్‌మెంట్. పదవ అంతస్తులో ఉంది. అసలు ఇల్లు నేల మీద వుందా? గాల్లో వుందా? అనుమానం వచ్చింది. తల గాల్లోనూ, కాళ్ళు నేల మీద ఉన్నట్టుంది. అనుకుని లిఫ్ట్ లోనుండి బయటకు వచ్చాడు. ఇంటి ముందుకు వెళ్లి కాలింగ్ బెల్ నొక్కాను. ఒకామె వచ్చి తలుపు తీసింది. ఆమె వయసు కనీసం అరవై ఏళ్ళుపైబడి వుంటాయి. మీరు ఫోను చేశారు కదా! రాజ్ టైలర్స్" అన్నాడు.

"రండి అని లోపలికి దారితీసి, కూర్చోండి. నాన్నగారిని తీసుకువస్తాను" అని లోపలికి వెళ్ళింది.

ఇల్లు బాగా రిచ్‌గా ఉంది. అధునాతనమైన ఫర్నిచర్, ఒక గదిలోనుండి వీల్ చైర్ మీద తీసుకువచ్చారు. వయసు తొంభైసంవత్సరాలుంటాయి. ముఖం, చేతులూ బాగా ముడుతలు పడి వున్నాయి. ముఖం ఒకపక్కకు వెళ్ళాడేసి ఉంది. నిద్రపోతున్నాడు.

"నాన్నగారూ! నాన్నగారూ! కొంచెం లేవండి. టైలర్ గారు వచ్చారు. కొలతలు తీసుకోవడానికి." అంది కూతురు.

"ఆ...ఆ" అన్నాడు. చిన్న తెలివి వచ్చీ రానట్లు.

కొంచెం లేవండి. ఎంతసేపు. పదినిమిషాలు. సురేషఉ, ఆనందూ కాస్త రండి. నాన్నగారిని కాస్త లేపండి. అంది.

ఇంతలో పనమ్మాయి కాఫీ తెచ్చి, ఇచ్చింది. కొడుకులు ఇద్దరూ వచ్చి ముసలాయనను లేపడానికి ప్రయత్నించారు. వాళ్ళ వల్లకాలేదు. లేవడంలో ముసలాయన సహకారం ఏమీ లేదు. ఇంతలో వాచ్ మెన్ రాంమూర్తిని ఫోన్ చేసి పిలిచింది ఎనభై ఏళ్ళ ముసలాయన భార్య. ఫోన్

## కవిత

# నానీలు

**- బండి ప్రసాదరావు**

వంగి చూస్తే నాడు
నా ప్రతిబింబం
వ్యర్థాల మయం
నేడు జలాశయం!

క్షణం క్రితం వరకు
భూతకాలం
జీవితానికి కద్దు
భవిష్యత్‌కాలం!

వ్యక్తిత్వాన్ని
వదులుకుంటావా...?
నిండుకుంటుంది
మూర్తిమత్వం!

ఇది నావిధని
శ్రమిస్తున్నావా....?
సుసాధ్యమౌతుంది
అసాధ్యం!

ఆకర్షణే కాదు
శ్వేతవర్ణ వస్త్రం.....
మనో నైల్యాన్ని
కప్పేసే అస్త్రం !

ఓదార్చడం
మానవలక్షణం
వేదించడమే
నేటి లక్ష్యం !



కాలకముందే
అగ్నిని గుర్తించాలి.
ఆకుల బరోసా
అందని ద్రాక్ష!

గుండె ఘోష
గోప్యమే మరి!
దయార్ద్ర హృదయానికే
ఎరుక!

చిరుజీవులు
వెదకులాట
ఉన్నత జీవికి
ఉపదేశమే సుమా!

పెనంపై అట్టు
ఆకలంతా కట్టు -
చెట్టు సేవల్లో
అదో నీటిబొట్టు !

చేసిన మరుక్షణం రాం మూర్తి వచ్చాడు. వెనుకనుండి రామ్మూర్తి నడుం పట్టుకున్నాడు. చెరొక భుజం ఇద్దరు కొడుకులూ పట్టుకుని, లేపారు. ముగ్గురు మనుషుల సహకారంతో నిలబడ్డాడు ముసలాయన. తాగిన కాఫీ కప్పు పక్కన పెట్టేసి, కొలతలు తీసుకున్నాడు. జయరాజ్ కొలతలు చెబుతుంటే, కూతురు రాసింది. కొలతలు తీసుకున్న అనంతరం కాగితం జేబులో పెట్టుకున్నాడు.

లోనికి వెళ్ళి, రెండు జతలు బట్టలు తెచ్చింది కూతురు. "వచ్చే శనివారం నాటికీ ఇవ్వాలండి. ఆదివారం నాన్నగారి పుట్టినరోజు. ఈసారి ఘనంగా చెయ్యక పోయినా, ఏదో కేకు కటింగ్ అయినా వుంటుంది కదండీ."

అది సరే ప్యాంటు ఎలా వేసుకుంటాడు. కేకు ఎలా కట్టింగ్ చేస్తాడు. అసలు రోజూ బాత్ రూంకి ఎలా వెళ్తాడు. రోజు ముగ్గురు మనుషులు సాయం వుండాలా? అలాగే అయి వుంటుంది. ఇంతలో ఆ ముసలాయన ఏదో చెబుతున్నాడు. నోటి వెంట గాలే వస్తుంది గానీ, మాటలు రావడం లేదు. అతని భాష ఎవరికీ అర్థం కాదట. కూతురుకే అర్థమవుతుందట. అందుకే ఆమె వచ్చి, తండ్రి మూతి దగ్గర చెవి పెట్టింది. అతను ఏదో అన్నాడు.

"టైలర్ గారు! లేటెస్ట్ ఫ్యాషన్లో కుట్టాలట" అంది ఇప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్లు తొడుక్కొని ఎక్కడికి వూరేగాలని, అని మనసులో అనుకొని "అలాగేనండి" అన్నాడు.

ఇంతలో ముసలాయన భార్య "అసలు ఇప్పుడు ఇలా వున్నారు గానీ, వయసులో వుండగా ఎన్నెన్ని ఫ్యాషన్లు తొడిగేవారో, పూట పూటకి డ్రెస్సు మార్చేవారు. బట్ట నలగనిచ్చేవారు కాదు. ఆ మధ్య సహస్ర చంద్రోదయం కార్య క్రమం చేశాం. అప్పటినుండి ఇలా మూల పడిపోయారు. నలుగురి దృష్టి ఆయనమీదే, నరుడి దృష్టికి నల్లరాయి అయినా బద్ధలై పోతుంది కదా బాబూ!

"అసలు సహస్ర చంద్రోదయం అంటే ఏమిటో తెలుసా?" అన్నాడు కొడుకు ఆనంద్.

"నాకు తెలీదండి."

అంటే....వెయ్యి పౌర్ణములు చూసే వాళ్ళు చేసుకుంటారండి. అంత కాలం వరకూ బతకాలి. బతికేనా, అంత ఘనంగా చేసుకోవాలి. ఇలాంటి వాటికి పిల్లల సహకారం కూడా వుండాలి కదండీ. చాలా ఖర్చు పెట్టాం అండి. పెద్ద హోటల్ తీసుకున్నాం. వెయ్యిమందికి భోజనాలు పళ్ళెం నిండా ఐటమ్స్. పళ్ళెం సరిపోలేదండి. మొత్తం అంతా వీడియో తీసాం లెండి. మీకు ఇస్తాం చూద్దురు గానీ."

"అలాగేనండి" అన్నాడు. ఇంతలో తలుపుతీసుకుని నిన్నటి కస్టమర్ మేచింగ్‌ల కృష్ణ కుమార్ వచ్చాడు.


"హల్లో జయరాజ్ గారూ! ఇంకా మీకే ఫోన్ చేద్దామని అనుకుంటున్నాను. మా నాన్నగారి బట్టల కోసమే. శనివారం ఇచ్చేయండి. నాన్నగారి పుట్టినరోజు సంగతి చెప్పారా?" అన్నాడు. "చెప్పాం"అన్నట్లు తలఊపారు.

ఈయన గారి కొడుకేనా ఈ కృష్ణ కుమార్. అవును మరి ఇలాంటి తండ్రి పెంపకంలో పెరిగిన కొడుకులు ఇంకెలా పెరుగుతారు. మామిడి టెంక పాతితే జామచెట్టు పుడుతుందా? అని మనసులోనే అనుకుని, బట్టల పేకెట్ అందుకుని బయటపడ్డాడు.

## కవిత

### రాజకీయ వ్యభిచారం !

- డా. వుయ్యపు హనుమంతరావు
9849425750




అమ్మకాలు - కొనడాలు వస్తువులకే అనుకున్నాం
ఇప్పుడు ప్రతినిధులకు - పార్టీలకు వర్తిస్తున్నాయ్!
అధికార దాహం ముందు
రాజ్యాంగం ఓ చిత్తు కాగిత మౌతుంది
అందలాలు ఎక్కడానికి
అమ్మనైనా అమ్ముకోడానికి సిద్ధం!
ప్రజాస్వామ్యం కొడికడుతుంది
రాజ్యాంగ వ్యవస్థలు పొగచూరుతున్నాయ్!
అభివృద్ధికి ప్రతిపక్షం అడ్డంకట!

ప్రశ్నలేని పూలబాట పరుచుకొంటున్నారు
పంపకాలు పరాకాష్ట చేరుతాయ్
అంతులేని అధికారం అవినీతికి మార్గం
ప్రజాస్వామ్యాన్ని పళ్ళగంప చేస్తున్నారు
ప్రజలు మేల్కొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి!

### సమ్మానం

- ఎన్.సిహెచ్.చక్రవర్తి
9399958069

మహాగొప్పగా జరుగుతున్న నా సమ్మానం
సంస్కారులనుకున్న వారందరికీ
ఆహ్వానాలు పంపా - వందలకొద్దీ...
సాహిత్యాభిమానులని పేరొందిన అందరికీ
స్వాగత పత్రాలు పంచా...
మేధావులనిపించుకుంటే చాలు
సంక్షిప్త సందేశాలు పంపా...
కళాకారులం అనుకున్న వారందరినీ
పేరంటంలా పిలిచా...
అయినా హాలు చాలా పల్చగా ఉంది
నన్ను చూడగానే లేచి నిలబడి
దండం పెట్టిన లక్ష్మి కుటుంబాన్ని
చూసి నివ్వెరపోయా !



"పేపర్లో చూసి వచ్చాం సార్"
లక్ష్మి మగని మాటలు ములుకుల్లా గుచ్చుకున్నై !
నా ఇంట పనిచేసే లక్ష్మి
నా బట్టలు దినమూ చలువచేసే ఆమె భర్తా...
నేను పిలవదగిన గుణగణాలు
వారిలో లేవనుకున్న నా సంస్కారానికి
సిగ్గయింది...
అమాంతం నా మెడలో దండ
వారి మెడలో వేసా !

### కరువు

బెంగాలీ మూలం : శంఖాఘోష్
తెలుగు: ఘట్టమరాజు
9964082076


అన్నీ ఎండిపోయ్యాయి
నదీనదాలూ చెరువులూ బావులూ
నీళ్లకోసం వచ్చిన వాళ్లు కూడా
వాడివత్తలై పొయ్యారు
ఎండుమాకుల్లాగా
మెరుస్తూంది తళతళా మిలమిలా
కనుచూపు మేరా
ఇసుక పాతరా
అంతం కాదిది ఆరంభం మాత్రమే
చూపానినంత దాకా ఇసుకే



తవ్వే కొద్దీ ఇసుకే ఇసుకే
మరో ప్రపంచం !
అదెప్పటి కథ ?
ఇంత బోసిగా మున్నెప్పుడూ చూళ్లేదు
ఇదిప్పటి వ్యథ !

విశ్లేషణ

# ప్రపంచీకరణపై సమరభేరి
## కాలం నది ఒడ్డున




- డా॥ రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
9440222117

***చరమగీతం (1991), వేకువ పిట్టలు (2008), ప్రేమాంజలి(2014), కాలం నది ఒడ్డున(2016), ఇవి ఆయన రచించిన పంచ మహాకావ్యాలు. వేరే రచనలు అనేకం ఉన్నాయి. ఈ అయిదు కావ్యాలను జాగ్రత్తగా పరిశీలిస్తే, కవిగా కృష్ణ ఎదిగొచ్చిన దారి కనిపిస్తుంది. ఈ దారిని సాహిత్య పరిశోధకులు గుర్తించాలి. 'చరమగీతం' నాటికి కృష్ణ వస్తుప్రాధాన్య కవిగా పరిణమించాడు. 'చరమగీతం'తో వస్తువును చిత్రించడానికి తగిన రూపం కోసం ఆయన అన్వేషిస్తూ కనిపిస్తాడు. ఆ అన్వేషణ సఫలం అయినట్లు 'కాలంనది ఒడ్డున' చాటి చెడుతున్నది.***

### *లోకహితం కోసం కలం ఖడ్గం ఝుళిపించే కవిని నేను*

ముసలమ్మ మరణం (కట్టమంచి, 1899) నుండి కాలం నది ఒడ్డున (బిక్కి కృష్ణ, 2016) దాకా రాయలసీమ నుండి వచ్చిన ఆధునిక కవిత్వం భారతదేశ సామాజిక పరిణామాలను ఆవిష్కరించడంలో వెనుక బడలేదు. రాయల సీమలో కూటికి, నీటికి కరువేగాని సంస్కృతికి కరువు లేదు. ఇతర ప్రాంతాలతో పోల్చి చూచినపుడు రాయల సీమ ఆధునిక కవిత్వం రాశిలో పరిమితంగా కనిపించినా వాసిలో తీసి పోయేది కాదు. రాయలసీమ నుండి వచ్చిన ఆధునిక కావ్యాలన్నీ గిట్టి గింజలే ! 'కాలం నది ఒడ్డున' ఈ వాస్తవానికి నేటి ఉదాహరణ.

బిక్కికృష్ణకు ఇప్పుడు 52 ఏళ్ళ వయసు. ఈయన ఇప్పటికే మూడు దశాబ్దాల సాహిత్య జీవితం సంపాదించాడు. ఈ చరిత్ర కృష్ణ పుట్టుక వృథాకాలేదు అని చాటుతున్నది. వైవిధ్య భరితమైన వృత్తి అనుభవం, విభిన్న మాధ్యమాలలో క్రీయాశీల శ్రమానుభవం, అనేక బాధ్యతల నిర్వహణానుభవం కృష్ణకళా శక్తికి పదును బెట్టాయి. చరమగీతం (1991), వేకువ పిట్టలు (2008), ప్రేమాంజలి(2014), కాలం నది ఒడ్డున(2016), ఇవి ఆయన రచించిన పంచ మహాకావ్యాలు. వేరే రచనలు అనేకం ఉన్నాయి. ఈ అయిదు కావ్యాలను జాగ్రత్తగా పరిశీలిస్తే, కవిగా కృష్ణ ఎదిగొచ్చిన దారి కనిపిస్తుంది. ఈ దారిని సాహిత్య పరిశోధకులు గుర్తించాలి. 'చరమగీతం' నాటికి కృష్ణ వస్తుప్రాధాన్య కవిగా పరిణమించాడు. 'చరమగీతం'తో వస్తువును చిత్రించడానికి తగిన రూపం కోసం ఆయన అన్వేషిస్తూ కనిపిస్తాడు. ఆ అన్వేషణ సఫలం అయినట్లు 'కాలంనది ఒడ్డున' చాటి చెడుతున్నది. అయితే 'చరమగీతం' నుండి నేటి దాకా కృష్ణలో నిరాఘాటంగా కనిపిస్తున్నది తీవ్రమైన ఆవేశం. ఆవేశం కవిత్వానికి ఉండవలసిన లక్షణమే అయినా అది కృష్ణలో కట్టలు తెంచుకుంటుంది. అయితే ఆయనను ఈ తీవ్రావేశానికి గురిచేసింది. మాత్రం వర్తమాన సామాజిక రుగ్మతలే.

'కాలం నది ఒడ్డున' కావ్యంలో వస్తువు ఒక్కటే. అది వర్తమాన భారతదేశ వాస్తవికత అంటే ప్రపంచీకరణ. రెండున్నర దశాబ్దాల నుంచి భారతీయ రచయితలను కలవర పరుస్తూ తానే సాహిత్య మై కూర్చుంది ప్రపంచీకరణ. అభ్యుదయ, ప్రగతిశీల దృక్పథంగల ఏ భారతీయ రచయితా ప్రపంచీకరణను సమర్థించరు. కారణం ప్రపంచీకరణ భారత ప్రజలకు శత్రువు కావడమే. అది కొంత మందికి వైభవాన్ని, అత్యధికులకు దు:ఖాన్ని మిగిలిస్తూంది. అది మన దేశ మూలుగులను పీల్చేసి సరికొత్త పరాయీ కరణను సృష్టిస్తున్నది. మనం రాజ్యాంగంలో రానుకున్న సర్వసత్తాక

సార్వభౌమాధికారం వంటి మాటల్ని అభావం చేసేస్తున్నది. ఏ పార్టీ అధికారం లోకి వచ్చినా వాళ్లంతా ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటిఓ, ఐ.ఎం.ఎఫ్ వంటి ప్రపంచీకరణ విభాగాలకు ఒదిగి ఉండేట్టు చేసేస్తున్నది. ప్రజలకు, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు దూరాన్ని పెంచేస్తున్నదీ ప్రపంచీకరణే. ప్రజాక్షేమం నామజపం చేస్తూ పాలకులు విదేశీ కంపెనీల క్షేమం పట్ల ఆసక్తి చూపేట్లు చేస్తున్నది ప్రపంచీకరణ. శతాబ్దాలుగా ప్రజలు నిర్మించుకున్న మానవ సంబంధాలను, మానవ విలువల్ని ధ్వంసం చేసి ప్రపంచీకరణ కృత్రిమ మానవుణ్ణి తయారు చేస్తున్నది. కృష్ణ కవిత్వంలో ఈ పరిణామాలన్నీ వస్తువైనాయి. అభ్యుదయ కవి అయిన కృష్ణ ప్రపంచీకరణను, దానిని కాపాడే పాలక వర్గాన్ని శత్రువుగా గుర్తించడంలో శాస్త్రీయంగానే ఆలోచించాడు. వర్తమాన భారతీయ సమాజసమస్య, దానికి మూలం, దానికి బాధ్యులు, దానికి పరిష్కారం.. ఈ నాలుగాంశాలు కృష్ణ కవిత్వంలో సామాన్య పాఠకులకు సైతం స్పష్టంగా తెలుస్తాయి.



బిక్కి కృష్ణ

ప్రపంచీకరణే వర్తమాన భారతీయ సమాజానికి శత్రువు అనే అంశాన్ని కవి ఎన్ని రకాలుగా అభివ్యక్తం చేశారో గమనిస్తే ఆయన సామాజిక దృక్పథంలో, తాత్విక చింతనలో ఎంత తాజాగా ఉన్నాడో అర్థమౌతుంది. ప్రపంచీకరణ రాబందులు, ప్రపంచీకరణ చెదలు, ప్రపంచీకరణ పెనుభూతం, ప్రపంచీకరణ కరెంటు తీగ, ప్రపంచీకరణ పెనుతుఫాను, ప్రపంచీకరణ వేటగాడు, ప్రపంచీకరణ ప్రియురాలు, ప్రపంచీకరణ కబేళా, ప్రపంచీకరణ విష సంస్కృతి, ప్రపంచీకరణ తిమింగలం, గ్లోబల్ కొండచిలువ, గ్లోబల్ సుందరి వ్యభిచారం, గ్లోబల్ మార్కెట్ రక్కసి, ప్రపంచబ్యాంకు కబేళా, సామ్రాజ్యవాద ముష్కరులు, తెల్లదెయ్యాల పాలన, కార్పొరేట్ గద్దలు, సెజ్‌ల మహమ్మారి, కార్పొరేట్ రాబందులు, డంకెల్ వేటగాడు, జి.దేశాల రాబందులు, సామ్రాజ్యవాద కొండ చిలువ, సెజ్ ల అడవి పందులు, విదేశీ కంపెనీల ఇనుపడేగలు, డంకెల్ డేగ 'కాలం నది ఒడ్డున' కావ్యం నిండా పరుచుకున్న ఈ అధిక్షేపాలు కవి ఏ పక్షం వహిస్తున్నాడో చెప్పకనే చెబుతున్నాయి. ఇన్ని రకాలుగా ప్రపంచీకరణను, దాని అనుబంధ సంస్థలను, వాటి సృష్టి కర్తలను గుర్తించిన కవి ప్రపంచీకరణ భారతీయ సామాజిక రంగం మీద చూపిన అనేక రకాల దుష్ప్రభావాలను నిస్సంకోచంగా ఉతికి ఆరేశాడు. ప్రపంచీకరణ భారత దేశంలోకి ప్రవేశించగానే అది మొదట మూడు రంగాల మీద పడింది. అవి 1. వ్యవసాయ రంగం, 2. చేనేత రంగం, 3. విద్యారంగం, వ్యవసాయరంగ సంక్షోభం, దానికి కారణాలను కవి గుర్తించాడు.

***మట్టి మనిషి/ మట్టిలో కలసి పోవడం సహజ మరణం కాదు/ అది గ్లోబల్ కుట్ర/ .../ ప్రపంచీకరణ పెను తుఫాను దెబ్బకు/ పచ్చని చెట్టులా నేల కొరిగాడు రైతన్న***

సాంస్కృతికంగా గత మూడు దశాబ్దాలలో మన సమాజం బాగా దిగజారి పోయింది. ఇది ప్రపంచీకరణ ప్రభావమే. నీతికి బూతుకు తేడా చెదిరిపోయింది. సినిమాలలోంచి కార్మికులు కర్షకులు సారాంశంలో ప్రజలు అదృశ్యమై క్రైం, సెక్స్, పోర్నోగ్రఫీలే సంస్కృతిగా చెలామణిలోకి వచ్చాయి. అందుకే కవి ఇలా అన్నాడు.

***పచ్చని పొలాలను కానుకగా ఇచ్చిన పల్లెలపై/ ప్రపంచీకరణ విషసంస్కృతి నీలిఛానళ్లను విసిరేసింది***

ప్రపంచీకరణ భారతదేశంలో విలువల పరంగా కూడా విపరీతమైన పరిణామాలను బాటలు వేసింది. మనుషుల మధ్య, మానవ సంబంధాలుగా స్థిరపడ్డాయి. డాలర్ సంబంధాలే నిలబడ్డాయి. అందుకే కవి ఇలా అన్నాడు.

***సరికొత్త విలువలతో గ్లోబల్ మార్కెట్/ నీ ఇంటి గుమ్మంలోకి చాపకింద నీరులా ప్రవేశించి/ నిన్ను నీ కుటుంబాన్ని నీ ప్రేమల్ని స్నేహాల్ని/ నీ అనుభూతుల్ని చివరకు నీ జీవితం మొత్తాన్ని/ నేటి మార్కెట్ విలువలతో అంచనా వేస్తుంది.*** ఈ నిజాన్నే మరింత అర్థమయ్యేట్టు ***చిక్కుల్లో చిక్కుకున్న/ చిక్కుముడి కదా జీవితం*** అని నిర్వచించాడు.

ప్రపంచీకరణ సృష్టించిన కృత్రిమ విలువల్ని కవి 'ఏ ఉలి చెక్కిన విలువల శిలువలివి' అని నిలదీశాడు.

***ఏ యుగంలో నైనా ఏ దేశంలో నైనా/ విలువలతో జీవించేవాడే నిజమైన మనిషి*** అన్న అవగాహనగల కవి లాల్ బహుద్దూర్ శాస్త్రి, మాణిక్ సర్కార్, పుచ్చలపల్లి సుందరయ్య, వంటివాళ్లను వర్తమానంలో అన్వేషిస్తే శూన్యం దర్శనమిచ్చింది. అందుకే కవి రైతునే విలువలున్న మనిషిగా కీర్తించాడు.

***పాలకులు, ప్రకృతి వంచిస్తేనేం రైతన్నా/ విలువల కోసమే తన బతుకును శిలువ వేసుకున్న/ నిజమైన కరుణామయుడు కదా!*** ప్రపంచీకరణ ప్రతి జీవన రంగాన్నీ కార్పొరేటీకరించింది. ఆఖరికి అయిదేళ్లకోసం మనం నిర్వహించుకునే ఎన్నికల్ని కూడా. పుట్టుక,

పెళ్లి, చావు అన్నీ కార్పొరేటీకరించబడ్డాయి. రాజకీయం దానికి బాగా దోహదం చేస్తున్నది. కార్పొరేటీకరణ అంటే ప్రతి దానికి రేటు పెట్టడం. ఆఖరికి రాజకీయం మీద వ్యాపారం కావడం, ఎన్నికలలో గెలవడానికి పార్టీలు వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఓట్లను కొంటున్నాయి. ప్రజల్ని కరప్ట్ చేస్తున్నాయి. కార్పొరేట్ ఎన్నికలు. అందుకే కవి... ***రాజకీయం వ్యాపారమై పోయాక/ రాజ్యాలు బడా కంపెనీల షాపింగ్ మాల్స్ గా మారి పోయాక/ ఇక్కడ ప్రజలతో పాటు ప్రభుత్వాలు కూడా/ అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముడవుతున్న వస్తువులే...***

పెట్టుబడీదారీ వ్యవస్థ పరిపక్వ రూపమే ప్రపంచీకరణ. దాని ఆర్థిక రాజకీయ రూపం మార్కెట్ ఎకానమీ, దానికి కంజ్యూమరిజం అన్నది ముద్దుపేరు. మార్కెట్ ఎకానమీ ముందు ఇంకే విలువా నిలువదు. స్వార్థం, అవకాశవాదం దానికి రెండు కళ్ళు. కవి ఈ వాస్తవాన్ని గుర్తించాడు. ***నీకు సుఖాన్నిచ్చే వ్యక్తులనే ఇష్టపడతావు/ వారినే ప్రేమిస్తావు, వారితోనే జీవిస్తావు/ అవసరం తీరాక ఆవలకు నెట్టేస్తావు.***

గత రెండున్నర దశాబ్దాలలో అనేక ఆర్థిక కుంభకోణాలు వెలుగు చూశాయి. హవాలా, 2జి–స్పెక్ట్రం, ఎంపీల గొనుగోలు నుండి కాల్‌మనీ సెక్స్ రాకెట్ దాకా.... ఇవన్నీ ప్రపంచీకరణ ముద్దు బిడ్డలే. పెట్టుబడీదారీ వ్యవస్థ అంటే అమ్ముకొను వ్యవస్థ. ఈ వ్యవస్థ వేగవంతం కావడానికి అవినీతి సులభసాధనం. భారత దేశంలో అన్నా హజారేవంటి పెద్దాయన అవినీతి వ్యతిరేక ఉద్యమం నడపాల్సి వచ్చింది. ప్రపంచీకరణ అవినీతి పరులను ఆలింగనం చేసుకుంటుంది. స్వచ్ఛతలేని మురికి పాలన ఒకవైపు కొనసాగిస్తూ స్వచ్ఛ భారత నినాదాన్ని ప్రజలలోకి ఇంజెక్టు చేస్తున్నారు పాలకులు. కవి అవినీతి భారతాన్ని గురించి ఇలా మాట్లాడారు.. ***ఇప్పుడు/ శుభ్రపరచాల్సింది స్వచ్ఛ భారత్ లోని వీధులను కాదు/ అవినీతి హృదయాలను/ చెదలు పట్టిన చట్టాలను***

ప్రపంచీకరణను ప్రధాన శత్రువుగా గుర్తించిన కవి, దీనికి బాధ్యులుగా ఖచ్చితంగా దేశ పాలకులనీ నిర్ణయించాడు. 'నేరస్తులు నాయకులే' అని స్పష్టంగా పేర్కొన్నాడు కవి.

***నీ హృదయాన్ని మాయ చేసిందీ/ నీ దేహాన్ని మార్కెట్ చేసిందీ/ నిన్నో పని ముట్టును చేసిందీ/ ఎవరను కుంటున్నావు?/ కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్న/ నాయకుడూ....../ రైతుల చావుకు కారణమయిన/ ప్రభుత్వాలు పార్టీలు సిగ్గు పడడం లేదు...*** అని స్పష్టంగా చెప్పాడు కవి. అందువల్ల కవికి సమస్య, దానికి కారణం రెండూ తెలుసు. ఈ రెండూ తెలిసినవాళ్లే చక్కని సామాజిక కవితలు రాయగలరు. అయితే దీనికి పరిష్కారమేమిటి? ప్రశ్న వేయడం గొప్పకాదు. సమాధానం కూడా కవి దగ్గర ఉండాలి. కృష్ణ పెట్టుబడిదారీ వ్యవస్థ, ప్రపంచీకరణ వ్యవస్థ చంపేసిన మానవత్వాన్ని ప్రధానమైన విలువగా ప్రతిపాదించాడు. ***మనిషికూడా మరో మనిషికోసం / మేఘం లా మానవత్వమై వర్షించాలి./ ధనమే ఇంధనమై/ బతుకులను శాసిస్తుంటే/ ప్రేమకు స్నేహానికి/ మానవత్వానికి విలువేముంటుంది?/ చితికిన బతుకుల్లో ఎప్పటికైనా/ చిరునవ్వులు పూయించేది మానవత్వమే కదా!***

మానవత్వాన్ని ఒక గొప్ప విలువగా కీర్తించినా ప్రపంచీకరణకు విరుగుడు మార్క్సిజమే నన్నది కృష్ణకుగల గట్టి నమ్మకం. సోవియట్ రష్యాలో, తూర్పు యూరప్‌లో, జర్మనీలో వచ్చిన మార్పుల తర్వాత మార్క్సిజానికి కాలం చెల్లిందని పెట్టుబడీదారి సమాజం ప్రచారం చేస్తున్నది. దానినే భారతదేశ పాలకులు చిలుక పలుకుల్లా వల్లిస్తున్నారు. చాలా వాటికి నేటి పాలకులు మార్క్సిస్టులనే శత్రువులుగా పరిగణిస్తున్నారు. మార్క్సిజం భారతీయ సమాజానికి పనికిరాదనేవాళ్లు కొందరు, మార్క్సిజానికి కాలం చెల్లిందనే వాళ్లు కొందరు, కాని కృష్ణకు ఇప్పటికీ మార్క్సిజంపై మొక్కవోని విశ్వాసం ఉంది. ప్రపంచీకరణ సృష్టిస్తున్న విధ్వంసానికి మార్క్సిజమే విరుగుడని ఆయన గట్టిగా చెప్పారు. మార్క్సిస్టు కవికి ఉండవలసింది వర్గ దృష్టి. అది కృష్ణకుంది....

***ప్రజలు నా కన్నీళ్లు/ పాలకులు నా కంట్లో ముళ్లు/.../ పేదవాడు సెలయేరు/ ఉన్నవాడు సముద్రం/ .../ కష్టజీవి సెలయేరు/ క్యాప్టలిస్టు సముద్రం/ నాకు సముద్రమంటే కోపం/ నది అంటే ఇష్టం*** అని సమాజంలోని రెండు వర్గాలను గుర్తించి తను ఏ పక్షమో కవి స్పష్టంగా చెప్పాడు. మార్క్సిస్టు కవికి

పోరుబాట, ఉద్యమం ఆ కవికి జీవనాడి. ప్రజాశక్తిమీద ఆ కవికి అపారమైన విశ్వాసం. ఎర్రజెండాపై గౌరవం ఆ కవి విధానం. ఇవన్నీ కృష్ణ కవిత్వంలో పొడసూపుతున్నాయి. 'భూగోళం కనుగ్రుడ్డుపై అరుణోదయం' కవిత కృష్ణ మార్క్సిస్టు చింతనను ప్రతిబింబిస్తుంది. ప్రపంచీకరణ సంక్షోభానికి మార్క్సిజమే వైద్యంగా ఈ కవితలో ప్రతిపాదించాడు కవి.

***కృష్ణ కవిత్వంలో శ్రీశ్రీ వేగం, తిలక్ వచనం, కె. శివారెడ్డి వచన విన్యాసం, తనదైన ఆవేశం, తనదైన అనుభూతి, తనదైన భావ విన్యాసం కనిపిస్తాయి. కవిత్వం పలచబడిపోయిందని పెదవి విరిచే వాళ్లకు ఈ కావ్యం కొంతైనా ఊరటనిస్తుంది.***

***పేద దేశాల సహజవనరులను/ దేహాల అవయవాలను/ నిలువుదోపిడీ చేస్తున్నారు/ దేశాన్ని ప్రజలను/ తాకట్టు పెట్టిన నాయక నేరగాళ్లను నమ్మకండి../ మీ పిల్లలను బతికించుకోడానికైనా/ ఎర్రజెండాలు ఎత్తుకోండి....***

ఒక వైపు పెట్టుబడీదారీ శక్తులు, మరో వైపు అస్తిత్వ వాదులు మార్క్సిస్టులపై ఒంటికాలు మీద లేస్తున్న సమయంలో ఒక కవి ఇంత నమ్మకంగా భూగోళం కనుగ్రుడ్డు మీద అరుణోదయం కావాలని కోరుకోవడం మొక్కవోని ఆయన నిబద్ధతకు నిదర్శనం. కృష్ణ రాజకీయ నాయకుల అవినీతిని ప్రస్తావించి, పరిస్థితులు ఇలాగే కొనసాగితే 'ఎప్పుడో ఒకప్పుడు ఆఖరి విప్లవం వస్తుంది' అని హెచ్చరించడానికి కూడా వెనుకాడలేదు. మార్క్సిస్టు కవులెవరైనా ప్రజాచైతన్యం మీద విశ్వాసం కలిగుండాలి. లోక్‌పాల్ బిల్లు చట్టసభలలో ఆమోదం పొందిన సమయంలో కవి చట్టాలు చేసినంత మాత్రాన అవినీతి నిర్మూలన కాదంటూ...

***ఏ దేశంలోనైనా/ప్రజలు పిడికిళ్లు బిగించి/ పోరుబిడ్డలు కానంత వరకు/ఆ దేశ జెండాల్లో సూర్యబింబాలు కనిపించవు*** అని ఖచ్చితంగా చెప్పాడు. ప్రజాశక్తుల మీద, వాటి పోరాట పటిమ మీదా, విశ్వాసం ఉన్న కవే మార్క్సిస్టు కవి ప్రజా పోరాటంలోంచే మార్పు సంభవిస్తుందని నమ్మే కవి మార్క్సిస్టు కవి. అదే సమయంలో ఆ కవికి మార్పు ఆకాశంలోంచి ఊడిపడదని, యజ్ఞయాగాదులు మార్పు తీసుకొని రావని తెలుసు. అందుకే కృష్ణ ఇలా తీర్పు నిచ్చాడు.

***లోకంలో/ చీకటి దోపిడి ఆకలి చావులున్నంత కాలం/ ఉద్యమాలు పోరాటాలు/ధర్నాలు నిరసనలు అనివార్యం/కదం తొక్కిన జన సమూహాల నుండి/ ఎర్రజెండాల రెప రెపల నుండి/ పోరాటవీరులు పుడుతూనే ఉంటారు*** ఇక్కడే ఆయన భౌతికవాదిగా, శాస్త్రీయ దృక్పథం గల కవిగా...

***ఇప్పుడు రాతి యుగాల/ గీతలు పూజలు యజ్ఞాలు కాదు కావలసింది/ నీతిలేని ఏలికల/ అవినీతి పురుగుల ఏరివేతల రణహోమాలు*** అని కూడా నిష్కర్షగా చెప్పాడు. మార్క్సిస్టు కవి తన కవిత్వాన్ని సామాజిక పరివర్తనకు ఆయుధం చెయ్యడం బాగా తెలుసు. కవిత్వం మీద ప్రజాదృక్పథం గల కవికి మమకారం, గౌరవం ఉంటాయి. నిజానికి మార్క్సిస్టు కవులు కవిత్వాన్ని నమ్ముకుంటారు. అవధానులు, దర్బారు కవులు కవిత్వాన్ని అమ్ముకుంటారు. కృష్ణ మార్క్సిస్టు కవిగా కవిత్వాన్ని ప్రేమిస్తాడు.

***నీ కవిత్వం చదివితే/ ఎవడికైనా వెన్నులో వణుకు పుట్టాలి/ 'ఆకలి కేకల గుడిసెల్లో/గెరిల్లా యుద్ధవీరులకు/ ఊపిరి పోసేదే నిజమైన కవిత్వం'/ 'ఏ దేశపు కవులైనా/ ఆ దేశం దేహం నిండా ప్రవహించే జీవనదులు'***

సమాజంలో రెండు వర్గాలున్నట్లే కవులలోనూ రెండు వర్గాలుండడం సహజం. వర్గాతీత జీవితం లేనట్లే వర్గాతీత కవిత్వం కూడా ఉండదు. ప్రతి కవీ చేయవలసింది తాను ఏ వర్గానికి చెందిన కవిని కాను అని మభ్యపెట్టడం కాదు. తానే వర్గానికి చెందిన కవో ప్రకటించడమే... కృష్ణకు ఇవన్నీ తెలుసు.

***కడుపు నిండినవాడు రాసే కవిత్వం పగటి కల/ కడుపు మండేవాడు రాసే కవిత్వం రగిలే జ్వాల*** అన్న స్పష్టమైన మార్క్సీయ అవగాహన ఈ కవికుంది.

***దగా పడిన ప్రతి గుండెలో హఠాత్తుగా పేలిపోయే/ ఆవేశపు అణువిస్ఫోటనం నా కవిత్వం*** అని కవి తన వర్గ పక్షపాతాన్ని చాటుకున్నాడు. 'కాలం నది ఒడ్డున' కావ్యంలో స్త్రీ పురుష సంబంధాల మీదా, స్త్రీల మీదా, ప్రేమల మీదా, బిక్షగత్తెల మీదా, గ్రామాల మీదా, కల్తీల మీదా, అమ్మా నాన్నల మీదా, మరణించిన మిత్రుల మీదా, అరుదుగా కనిపించే మానవత్వ సన్నివేశాల మీదా కవితలున్నాయి. కృష్ణ కవిత్వంలో శ్రీశ్రీ వేగం, తిలక్ వచనం, కె. శివారెడ్డి వచన విన్యాసం, తనదైన ఆవేశం, తనదైన అనుభూతి, తనదైన భావ విన్యాసం కనిపిస్తాయి. కవిత్వం పలచబడిపోయిందని పెదవి విరిచే వాళ్లకు ఈ కావ్యం కొంతైనా ఊరటనిస్తుంది.

## కవిత

# అరచేతిలో స్వర్గం

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

ప్రాజెక్టు నిర్మాణానికి
ప్రపంచ బ్యాంకు తలూపింది
అనుమతులన్నీ యిస్తే గాని
అర్డరు యివ్వనంటూంది !
సీతమ్మోరి ప్రాజెక్టు
శరవేగాన నిర్మించాలి
రాములోరి గూడెం
ముంపు ప్రాంతమైంది!
అదిగదిగో ఆకనపడేదే
పునరావాస కేంద్రం
అర్జంటుగా కదలండి
నివాసాలు మార్చండి !
పునరావాసం
పుట్టలు మిట్టలు అనుకోవద్దు
ముందు ముందు కాలంలో
నందనవనం కాబోతుంది !
కరెంటు కష్టాలు తీరేరోజు
కనుచూపు దూరంలో వుంది
ఇంటింటా అప్పుడు



విద్యుత్ వెలుగు జిలుగులు !
గ్యాసు బండల కోసం
కేంద్రం కోట్లు కేటాయించింది
వార్షిక బడ్జెట్ అనుమతించాక
వద్దన్నా గ్యాసు యింటికి వస్తుంది !
మరుగుదొడ్ల నిర్మాణం
ఉద్యమంగా కొనసాగుతుంది
దొడ్డిలేని యిళ్ళులేక
గిన్నీస్ బుక్కు కెక్కుతుంది !
కౌలిదారులన్నీ
సిమెంటు దారులౌతాయి
పర్యావరణ అనుమతి పొంది
పనులు ప్రారంభించబడతాయి !
ముంపు ప్రాంతాలు
లెక్కల కెక్కుతున్నాయి
పరిహారాలు పైసల్తో సహా
నిర్వాసితులకు ముట్టుతాయి !
బృహత్ కార్యానికి
ప్రజలంతా సహకరించాలి
ప్రపంచం నివ్వెర పోయేలా
మన శక్తిని చాటాలి !

# శ్వాసించు

- కళ్యాణదుర్గం స్వర్ణలత
98486 26114

పూవు నేలరాలినపుడు
పరిమళం గాయ పడటం చూశావా!

కాల్లో విరిగిన తుమ్మముల్లు
సలపరించడాన్ని భరించావా!

గాలి కూడా మౌనంగా
మనసుల్ని దాటిపోవడం విన్నావా!

కొడవలిని చూసి వులిక్కిపడ్డ
కంకి బెదురు చూపులు కన్నావా!

శిథిలమైన దుఃఖపు శిలాజాల
కాలాన్ని గుర్తించగలిగావా!



దిగులు బరువుతో
మనశ్శయ్య కుంగడం గమనించావా!

మౌనాన్ని వీడే క్షణం కోసం
వేచిన సందర్భంలోని సాంద్రతలో మునిగావా!


తనపై వున్న ఆకాశాన్ని
హఠాత్తుగా కోల్పోయిన భూమి బాధను మోశావా!

లేదుకదూ...
కనీసం ఇప్పుడైన జీవించు
జీవితాన్ని శ్వాసించు...

**పరిశీలన**

**తవ్వినకొద్దీ చరిత్ర - 1**

# తెలుగు నేలపై కన్నడ శాసనాలు


**- ఈమని శివనాగిరెడ్డి**
**9848598446**


*ఒడిషా సరిహద్దులో ఉన్న శ్రీకాకుళం జిల్లాలో కూడా కన్నడ శాసనం ఉండటం గమనించదగ్గ విషయం. తెలుగునేలపై కన్నడ శాసనాలను పరిశీలిస్తే, కర్ణాటకలోని ద్వార సముద్రం నుంచి పాలించిన హోయసల రాజుల శాసనాలు అనంతపురం జిల్లాలో కూడా దొరికినందువల్ల వారి పాలన తెలుగునేల దాకా విస్తరించిందని చెప్పొచ్చు.*

క్రీ. శ. 7వ శతాబ్దంలో రెండో పులకేశి, ఆంధ్రదేశాన్ని స్వాధీనం చేసుకొన్న తర్వాత, ఇప్పటి తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిసిన భూభాగాలు బాదామీ లేక తొలి పశ్చిమ చాళుక్యుల వశమైనాయి. అటు తరువాత రాష్ట్రకూటులు, కళ్యాణ చాళుక్యులు, కలచూరి రాజులు, నొలంబ పల్లవులు, హోయసలులు తెలుగు నేలలోని పశ్చిమ, పశ్చిమ – నైరుతీ భాగాలను ఏలారు. వీరంతా సంస్కృతంతో పాటు కన్నడ భాషలో తమ శాసనాలు విడుదల చేశారు. వీరేకాక, రేనాటి చోళులు, తూర్పు చాళుక్యులు, చోళులు, వేములవాడ చాళుక్యులు, తెలుగు చోళులు, తెలుగు పల్లవులు, వైదుంబులు, బాణ రాజులు, కాకతీయులు, విజయనగర రాజులు కూడా కన్నడ శాసనాలను విడుదల చేశారు.

రాజులవారీగా చూస్తే బాదామీ చాళుక్యులు 9, చోళులు 55, తూర్పు చాళుక్యులు 1, రాష్ట్రకూటులు 25, రేనాటి చోళులు 3, చెఱకు రెడ్లు 1, చోళులు 4, వేములవాడ చాళుక్యులు 3, కళ్యాణ చాళుక్యులు 319, కలచూరులు 11, నొలంబ పల్లవులు 32, తెలుగు చోళులు 4, తెలగు పల్లవులు 1, వైదుంబులు 11, హోయసలులు 9, కాకతీయులు 3, విజయనగర రాజులు 170 శాసనాలు. మొత్తం కలిపి 948 కన్నడ శాసనాలను తెలుగు నేలపై విడుదల చేశారు.

జిల్లాల వారీగా చూస్తే తెలంగాణా రాష్ట్రంలో ఆదిలాబాద్ 15, హైదరాబాదు 53, కరీంనగర్ 37, ఖమ్మం 1, మహబూబ్‌నగర్ 166, మెదక్ 35, నల్లగొండ 85, నిజామాబాద్ 13, వరంగల్ జిల్లాల్లో 35 ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం 242, చిత్తూరు 62, కడప 38, తూర్పు గోదావరి 2, గుంటూరు 10, కృష్ణా 1, కర్నూలు 147, నెల్లూరు 4, విశాఖపట్నం 1, శ్రీకాకుళం జిల్లాలో1 ఉన్నాయి. అత్యధికంగా అనంతపురంలో 242, తరువాత మహబూబ్‌నగర్‌లో 166, కర్నూల్‌లో 147 ఉండగా, ఖమ్మం, విశాఖ, శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఒడిషా సరిహద్దులో ఉన్న శ్రీకాకుళం జిల్లాలో కూడా కన్నడ శాసనం ఉండటం గమనించదగ్గ విషయం. తెలుగునేలపై కన్నడ శాసనాలను పరిశీలిస్తే, కర్ణాటకలోని ద్వార సముద్రం నుంచి పాలించిన హోయసల రాజుల శాసనాలు అనంతపురం జిల్లాలో కూడా దొరికినందువల్ల వారి పాలన తెలుగునేల దాకా విస్తరించిందని చెప్పొచ్చు.

బాదామీ చాళుక్య ప్రభువైన ఎఱెయటియడిల్ అని పిలువబడిన రెండో పులకేశి శాసనాలు అనంతపురం జిల్లా పెదవడుగూరులో ఉన్నాయి. అతడు బాణరాజైన రణవిక్రముని జయించిన తరువాత, సొంతం చేసుకొన్న ఎల్పట్టుసింభిగ అనే ఊరును పన్నులేని అగ్రహారంగా ప్రకటించినట్లు శాసనాల్లో చెప్పబడింది విజయాదిత్య సత్యాశ్రయుని బెట్టపల్లి

శాసనంలో అతని కొడుకైన విక్రమాదిత్యునికి **తరుణవసంతన్, సామంత కేసరి** అనే బిరుదులున్నట్లునూ, అతడు అయిరాడిని పాలిస్తున్నట్లూ ఉంది. హరెసముద్రం శాసనంలో, రాష్ట్ర కూటరాజైన అమోఘవర్షుని సర్వసైన్యాధక్షుని కొడుకు కుందితె, 30 రోజుల సన్యాసదీక్ష తీసుకొని మరణించగా, మైలమ్మ అను అతని సేవకుడు అగ్నికి ఆహుతి అయినట్లు చెప్పబడింది. సన్యాసన అనేది జైనమతంలో ఒక వ్రతం, దీని ప్రకారం ఆమరణాంతం ఆహారం తీసుకోకుండా ఉండటం.

అనంతపురం జిల్లాలో కొంతభాగం కర్ణాటక రాజులైన హోయసలుల పాలనలో నున్నట్లు, హిందూపురం మండలంలోని పరిగిలో నున్న రెండో వీరభల్లాలుని (క్రీ.శ. 1178-79) శాసనంలో పేర్కొనబడింది. అలాగే, అదే మండలంలోని సిరవార శాసనంలో మూడో వీరభల్లాలుని కాలంలో (క్రీ.శ. 1184వ సంవత్సరం) అతని ప్రధాని అళియ మాచయ దన్నాయకుడు తుంబెయకల్లును పాలిస్తున్న రాచెయ నాయకుని పై విజయం సాధించాడనీ ఈ సందర్భంగా జరిగిన యుద్ధంలో సిరివారకు చెందిన ధీమగౌడ కొడుకు అజపురణ మరణించాడని కూడా ఉంది. ఈ రెండు శాసనాలూ, తెలుగునేలపై హోయసులుల ఆధిపత్యాన్ని సూచిస్తున్నాయి. ఈ విషయానికి చరిత్ర పాఠ్యాంశంలో చోటు దక్కాలి.

హైదరాబాదు (గోల్కొండ)లోని ఖజానా బిల్డింగ్ మ్యూజియంలోనున్న కళ్యాణ చాళుక్య రాజైన త్రిభువనమల్ల ఐదో విక్రమాదిత్యుని శాసనంలో, లొంబళిక -70 (వేములవాడ) ను పాలిస్తున్న దండనాయక పద్మనాభుడు రాజు, ఉత్తర దిగ్విజయ యాత్రలో మాళ్వాధిపతి అయిన భోజదేవుని ఓడించి తిరిగివచ్చేప్పుడు, చిలుకూరులోని ఇంద్రజినాలయానికి 100 మరుతురుల భూమిని 3, మరుతూరుల తోట భూమిని దానం చేసినట్లు పేర్కొనబడింది. ఇందులో త్రిభువనమల్ల విక్రమాదిత్యుడు భోజరాజును జయించిన విషయం చారిత్రకాంశం. అక్కడే ఉన్న మరో శాసనంలో, త్రిభువనమల్ల ఆరో విక్రమాదిత్యుడు మహా పరాక్రమవంతుడనీ, అతడు పరిపాలనలోనున్న సోమేశ్వరుని సింహాసనాన్ని బలవంతంగా ఆక్రమించుకొన్నట్లు చెప్పబడింది. నల్లగొండ జిల్లా బూరుగుగడ్డలోని శాసనంలో కళ్యాణ చాళుక్య రాజైన త్రిభువనమల్ల దేవుడు, వేంగి - 10000 విమ్మెదలె (ఎనుమదల) - అంతను పాలిస్తున్న మహా ప్రధాన బాణపవెర్గడి, మానెవెర్గడె దండనాయక అనంతపాలుని పేర్కొంటుంది. ఇందులో అనంతపాలుని మేనల్లుడైన దండనాయక గోవిందరస, వేంగిపై దాడిచేసి, దహనం చేసి, చోళరాజును ఓడించి, జననాథపురాన్ని జయించాడని చెప్పబడింది. కళ్యాణ చాళుక్యుల తరువాత తెలంగాణాలోని కొంతభాగం, కిలచూరి రాజుల పాలనలోనున్నట్లు, ఆ వంశానికి చెందిన భుజబల ఆహవమల్ల, బిజ్జల, రాయమురారి సోవిదేవ, సంవేమ, సోమేశ్వర దేవుల శాసనాలు రుజువు చేస్తున్నాయి.

శ్రీకృష్ణదేవరాయని తిరుపతి, తిరుమల శాసనాల్లో అతని దిగ్విజయ యాత్రలో, తిరుమల సందర్శనం, అనేక కోటల్ని జయించటం, చేసిన దానాల గురించిన వివరాలున్నాయి. శ్రీశైలంలోని మల్లికార్జునుని దర్శించుకొన్నప్పుడు (క్రీ.శ.1515) రథం వీధిలో రాతిమండపాన్ని కట్టించి, దేవునికి అనేక గ్రామాలను దానం చేశాడని శ్రీశైలంలోని కన్నడ శాసనం వల్ల తెలుస్తుంది.


కొన్ని కన్నడ శాసనాల్లో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరమైన విషయాలున్నాయి. కర్నూలు జిల్లా ఆలూరు తాలూకా హలెబీడులోని 8వ శతాబ్దపు శాసనంలో స్థానికుడైన సిరిగుప్ప, రాష్ట్రకూట రాజైన దంతిదుర్గుని రట్ట సైన్యం చికురంబావి గ్రామంపై దాడి చేసినప్పుడు, ఎదురొడ్డి ప్రాణాలు పోగొట్టు కొనగా ఆయనకు ఒక స్మారక శిలను ఎత్తించారు. ఆ శిలపై గల శాసనంలో సిరిగుప్ప యోధుడనీ, భీష్మునితో పోల్చదగినవాడని, మూసల, గద, శూల, పరిఘ, బండలి మొదలైన ఆయుధములను వాడటంలో నిపుణుడని చెప్పబడింది. అనంతపురం జిల్లా హిందూపురం తాలూకా ఫలారం గొల్లరహట్టి లోని నోలంబ పల్లవరాజు , నొలిబంధి రాజు పాలనా కాలపు శాసనంలో గ్రామంలో ఒక ఎలుగుబంటితో పోరాడి చనిపోయిన పునిగ అనే కుక్క చనిపోగా దానికి ఒక స్మారక శిలను ఎత్తించినట్లు పేర్కొనబడింది.

మహబూబ్‌నగర్ జిల్లా రాజోలి గ్రామంలోని కళ్యాణ చాళుక్య రాజైన భూలోకమల్లుని క్రీ.శ. 1136వ సంవత్సర శాసనంలో పన్నుల రాబడిని అయిజనాడులోని పొలపనూరులో గల సహస్ర లింగేశ్వర దేవనకు అయిజనాడు అధికారి అయిన సూరపయ్య పెర్గడా చేసిన దానాలు, రాజవోలాల గ్రామంలో 300 విలాసినులు (నాట్యగత్తెలు) నివాసమున్న వివరాలు ఉన్నాయి. విలాసినుల గురించి పేర్కొంటున్న తొలి శాసనం

## కవిత

# విశ్వ విజేత నాన్న

- బండి. ఉష
9676377462




కోడి మా నాన్నను నిద్రలేపేదో
మానాన్నను చూసి కోడి కూసేదో కాని
నేను లేచేసరికి మట్టిని సవరిస్తూ
తడిసిన చెట్టోలే పొలంలో ఉండేవాడు
ఎండకు బెరడు కట్టిన ఒళ్ళుతో
నెర్రెలు విచ్చిన పొలంపై నాలుగు చినుకుల కోసం
మబ్బులతో ముచ్చట్లాడే వాడు
పండుగయినా, పబ్బమయినా పొలంలోనే
కలలో కూడా అపకారమెరుగని నాన్న
కష్టాల్ని కడుపులో దాచి
చిరునవ్వుల్ని చిందించేవాడు
నేను ఎదుగుతుంటే నాన్న కళ్ళు దివిటీలే
నన్ను ముద్దాడుతుంటే శ్రమను మరిచిపోయేవాడు
అనుబంధాల్ని, అనురాగాల్ని శ్వాసిస్తూ
నలుగురి కోసమే బ్రతుకుతున్న నాన్న
ఇప్పుడు విద్యుత్ ప్రమాదంలో
పత్రహరితం కోల్పోయిన తరువులా
రక్తముడిగిన జీవచ్ఛవమయ్యాడు
భూగోళాన్ని మోసిన ఆ భూజాలు
ఒక చోట నిలవని పాదాలు
సాయం చేసిన ఆ చేతులు
నీరు విడిచిన తామర తూళ్ళూలా అచేతనమయ్యాయి.
అయితేనేం మళ్లె సౌరభాన్ని పంచినట్లు
ఆకాశమంత ఎదిగిన ఆ శిఖరం
ఆఖరి ఘడియల్లో అవయవ దానం చేసి
అన్నదాత - ప్రాణదాతగ నిలిచాడు
విశ్వవేదికపై మరోసారి విజేత అయ్యాడు
నీడ నివ్వటమే కాదు
ప్రాణం పోసే తరువు నాన్న

---

ఇదొక్కటే. ఇదే జిల్లాలోని ఆవంచ గ్రామంలోని క్రీ.శ. 1113 నాటి త్రిభువనమల్ల ఆరో విక్రమాదిత్యుని శాసనంలో అతని కుమారుడైన కుమార తైలపదేవుని గొప్పతనాలతోపాటు, అతని రాజధాని అయిన ఆవంచలో ఆచరణలో నున్న సాంఘిక దురాచారాలను రూపుమాపటానికి తీసుకొన్న చర్యల గురించి ప్రస్తావించబడింది.

అనంతపురం జిల్లా, హిందూపురం తాలూకా గౌనివారిపల్లిలోని క్రీ.శ. 1418వ సంవత్సరపు హరిహర రాయలి శాసనంలో, తనకు హజార సింహాసనం చేసి ఇచ్చిన పాంచాలులు ప్రంచానం వారికి, ఎద్దులు, ఎనుములు, బళ్ళు, నగలపై నున్న పన్నులను మినహాయించినట్లు చెప్పబడింది. రాజుకు సింహాసనం తయారు చేసిన విషయాన్ని పేర్కొంటున్న శాసనం కూడా ఇదొక్కటే.

అదే జిల్లా గుత్తి తాలూకాలోని వేల్పుమదుగు గ్రామంలోని శ్రీకృష్ణదేవరాయలు విడుదల చేసిన క్రీ.శ. 1525 నాటి శాసనంలో, వేలుపడిగె (కృష్ణరాయపురం)లో ఒక కొత్త బజారును కృష్ణదేవరాయని పేరు మీద ప్రారంభించిన శెట్లకు, వారు అమ్మకాలు సాగించే దుకాణాలపై మొదటి మూడు సంవత్సరాలు ఎలాంటి పన్ను లేకుండా (టాక్స్ హాలిడే) ఇచ్చిన ఆదేశాలు ఉన్నాయి.

కొన్ని కన్నడ శాసనాల్లో (గడికల్లు) మంగళ్ళపైగల కానికె, బిట్టె, బిరాడ, కప్పం మొదలైన పన్నుల్ని, చేపలు పట్టే బెస్తవారిపై (కేశవాపురం) గల బిట్టి, బిరాడ పన్నుల్ని మినహాయించటంతో పాటు క్రీ.శ. 1547వ సంవత్సరం ఇదే శాసనంలో, కోళ్లను, పందుల్ని పట్టటాన్ని, వేటాడటాన్ని నిషేధించడం గమనించాల్సిన అంశం. ఆనాడే వన్యప్రాణ సంరక్షణ చేపట్టినట్లు ఈ శాసనం వల్ల తెలుస్తుంది.


కడపజిల్లా, దానవుల పాడులోని రాష్ట్రకూట రాజైన ఇంద్రుని (క్రీ.శ. 965-674) కాలం నాటి శాసనంలో ఈ శాసనాల్ని రాసిన పేనబోవ గుణవర్మ కన్నడ ఆదికవి పంపని కంటె ముందు వాడనీ, అతడు హరివంశం, శూద్రక, భువనైకవీర అనే కావ్యాలను రాశాడని ఉంది.

ఇలా తెలుగు నేలపై ఉన్న కన్నడ శాసనాల్లోని ఎన్నో ముఖ్యమైన విషయాలు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చోటు చేసుకోనందున, ఒక్కొక్క జిల్లాలోని కన్నడ శాసనాలను క్షుణ్ణంగా చర్చించి, తద్వారా తెలుగునేల చరిత్రను సుసంపన్నం చేసుకోవచ్చు.

## పరిశీలన

# 'చిత్తూరు కథ' సంకలనం - రైతుల సమస్యల చిత్రణ

**పి. జయచంద్రుడు**
**9703758519**




***రైతులు ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక పరిజ్ఞానలేమితో సతమతమౌతుంటే మరోవైపు అధిక వ్యయభారం, దళారుల దోపిడి కారణంగా రైతుల జీవితాలు చితికిపోతున్నాయి. అలా భారతదేశంలో వ్యవసాయ ఆధారితులైన రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ 'చిత్తూరు కథ'ను తిరుపతికి చెందిన పేరూరు బాలసుబ్రమణ్యం సంకలనంగా వెలుగులోకి తెచ్చారు.***

ప్రపంచంలో వ్యవసాయ ఆధారిత దేశాలలో అత్యంత ప్రధానమైన దేశం భారతదేశం. సువిశాలమైన భారతదేశంలో అత్యంత సారవంతమైన భూములలో భారతదేశ రైతులు ఎన్నోరకాల ఆహారపంటలు, వాణిజ్య పంటలను పండిస్తున్నారు. భారతదేశానికి ధాన్యాగారమైన గంగా మైదానం ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన అత్యంత సారవంతమైన క్షేత్రం. సారవంతమైన భూములకు కావాల్సిన నీటివనరులు కూడా భారతదేశంలో వున్నాయి. కాని గత దశాబ్దకాలంగా పర్యావరణ వైపరీత్యాల కారణంగా, రైతులకు సాంకేతిక పరిజ్ఞానలేమి కారణంగా రోజురోజుకు వ్యవసాయం కుంటుపడుతుంది. వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతులు తలకు మించి అప్పులు చేయడం కారణంగా పంట వల్ల లాభాలు రాకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. బ్రతికే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 'జైజవాన్ జైకిసాన్' అన్న నినాదంతో ప్రభుత్వాలు కొంతమేరకు సహాయమందిస్తున్నా రైతులను ఆత్మహత్యలనుండి రక్షించలేకపోతున్నాయి. కొద్దిపాటి లాభాలను ఆర్జిస్తున్న రైతులు జీవితం మీద ఆశతో, లాభోద్దేశంతో పంటలు పండిస్తున్నా మధ్యవర్తులైన దళారుల దోపిడి వల్ల రైతులు మోసపోతున్నారు. నేడు వ్యవసాయానికి అయ్యే ఖర్చుకూడా విపరీతంగా పెరిగిపోతూంది. ఇలా రైతులు ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక పరిజ్ఞానలేమితో సతమతమౌతుంటే మరోవైపు అధిక వ్యయభారం, దళారుల దోపిడి కారణంగా రైతుల జీవితాలు చితికిపోతున్నాయి. అలా భారతదేశంలో వ్యవసాయ ఆధారితులైన రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ 'చిత్తూరు కథ'ను తిరుపతికి చెందిన పేరూరు బాలసుబ్రమణ్యం సంకలనంగా వెలుగులోకి తెచ్చారు.

'చిత్తూరు కథ' సంకలనంలో ప్రధానంగా డా॥ లంకిపల్లి కన్నయ్య నాయుడి 'జీవనం', గోపినికరుణాకర్ రచించిన 'దేవరెద్దు', పలమనేరు బాలాజి రచించిన 'తపన' వీరపల్లి వీణావాణి 'మూలాధారచక్రం', బడబాగ్ని శంకరరాజు 'ఆఖరితడి' వంటి కథలు రైతు సమస్యలను కళ్ళకు కట్టేట్లు చిత్రించాయి. డా॥ లంకిపల్లి కన్నయ్య నాయుదు రైతు కథకుడిగా సుప్రసిద్ధుడు. ఈ కథలో చిత్తూరు ప్రాంతంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కదు దయనీయంగా చిత్రించారు. భారతదేశం, ఆంధ్రప్రదేశ్‌లా చిత్తూరు జిల్లా కూడా వ్యవసాయ ఆధారిత ప్రాంతమే. ఇక్కడి ప్రజల ప్రధాన జీవనం వ్యవసాయమే. చిత్తూరు జిల్లా తూర్పు నుండి పడమర వెళ్ళేకొలది వర్షాభావ ప్రాంతం ఎక్కువ. ఈ సంకలనంలో రైతుల సమస్యలను చిత్రించిన కథకులు దాదాపు అందరూ పడమటి ప్రాంతానికి చెందినవారు కావడం విశేషం. అలాగని తూర్పు

ప్రాంత రైతులకు ఎలాంటి సమస్యలు లేవని కాదు. వారు కూడా వర్షాభావ పరిస్థితికి, అధిక వ్యయభారానికి, అప్పులబాధలకు గురౌతున్నవారే. చిత్తూరు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సంకలనంలోని కథల్లో రచయితలు చర్చించారు.

'జీవనం' కథలో డా॥ లంకిపల్లి కన్నయ్య నాయుడు రైతులు ఒకవైపు వ్యక్తిగతంగా అధికారుల నిర్లక్ష్యంవల్ల ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటారో చిత్రిస్తూ, మరోవైపు ప్రకృతిపరంగా రైతుకు ఎలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందో చక్కగా వివరించారు. 'జీవనం' కథలో నలభైఏళ్ళ 'రైతు' జీవయ్యకు వ్యవసాయమంటే అమితమైన ప్రేమ. మార్పుకనుగుణంగా వ్యవసాయంలో ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులకోసం క్రాంతిపథంలో పయనించే రైతు జీవయ్య. పెళ్ళీడువచ్చిన ఒక కుమార్తె, డిగ్రీ చదువుకొనే ఒక కుమారుడు, భర్తకు చేదోడువాదోడుగా ఉండే సహధర్మచారిణి జీవయ్య కుటుంబం. జీవయ్యకు వ్యవసాయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా మట్టిని నమ్ముకునే బతకాలనే తపన కలవాడు. మట్టిని పంటగా మార్చగల శక్తి సంపన్నుడు జీవయ్య. కొడుకు చదువులకోసం, కుమార్తె పెళ్ళికోసం పంటపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నాడు. అటువంటి జీవయ్య ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కరెంటు సమస్య. తగినంత కరెంటు లేకపోవడం, సరైన సమయానికి కరెంటు రాకపోవడంవల్ల ఒకవైపు మడిపైరు, చెరుకుతోట ఎండిపోతుంటే, మరోవైపు తమలపాకుతోట, మిరపతోట ఎండిపోతున్నాయి.

ఎప్పుడో ఒకప్పుడు వచ్చిపోయే కరెంటు వల్ల ఇలా నీరు లేక పంటలు ఎండిపోతుంటే మరోవైపు మోటార్లు కాయిల్స్ కాలిపోతే దానిని పట్టణానికి తీసుకెళ్ళి కట్టించుకోడానికి మరికొన్ని రోజులుకావడం – ఇలా జీవయ్య సరైన సమయానికి కరెంటు లేకపోవడం, ఉన్నా మోటారు కాలిపోవడం వంటి సమస్యల వల్ల పంటలకు నీరు అందకపోవడం చేత పంటలు ఎండిపోతున్నాయి. వాటిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జీవయ్య జీవచ్ఛవంలా తయారవుతున్నాడు. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని కరెంటుకోసం ఎదురుచూడాల్సివస్తోంది. దీనికితోడు అప్పుడప్పుడు ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే ఇక రైతుల బాధలు వర్ణనాతీతం. వీటన్నింటికి కారణం

**అధికారుల నిర్లక్ష్యం, స్వార్థం కారణంగా పంట ఒకవైపు నీరు లేక ఎండిపోయి జీవయ్య అవస్థ పడుతుంటే, మరోవైపు సకాలంలో శిస్తుకట్టాలని నిర్బంధించేవాళ్ళు.**

అధికారులేనని, కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించని మనుషులు, డబ్బుకు అమ్ముడుబోయిన మనుషులు, అధికారదర్పంతో దాబుసరిగా బ్రతకటం నేర్చుకున్న మనుషులు, ఈ మనుషుల చేతులమీదుగా తిరిగే యంత్రాలు, డబ్బుకు దాసోహమని 'లోడ్'కు మించి కనెక్షన్లు ఇవ్వడంవల్ల మోటారుకాయిల్స్ కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు మండిపోతున్నాయని, దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని బాధపడేవాడు. వారానికి యాభై కట్టకు కోసే తమలపాకు తోట సకాలంలో కరెంటు రాక నీరులేకపోవడంతో తోట ఎండిపోవడంతో వ్యాపారి బేరం పోయిందని తన దురదృష్టాన్ని తిట్టుకుంటాడు. కర్పూరం లాంటి బెల్లం పదిబండ్లు కావాల్సిన చెరకు నీరు లేకపోవడంతో వాడిపోయిందని, బెల్లం ఆడితే, ఆడిన ఖర్చు కూడా రాదని, శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైందని ఎంతగానో దిగులు చెందాడు. ఇలా అధికారుల నిర్లక్ష్యం, స్వార్థం కారణంగా పంట ఒకవైపు నీరు లేక ఎండిపోయి జీవయ్య అవస్థ పడుతుంటే, మరోవైపు సకాలంలో శిస్తుకట్టాలని నిర్బంధించేవాళ్ళు.

అధికారుల వల్ల జీవయ్య నీరులేక పంటలను కోల్పోతుంటే మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు అతన్ని వెంటాడుతున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, కరువుకాటకాలు సంభవించడం జరుగుతున్నాయి. వీటికితోడు ఎలుకలు, చీడ పురుగులు, మిడతలు, నక్కలు, పక్షులు దయలేని శత్రువుల్లా అందివచ్చిన కాస్త పంటను దోచుకుంటున్నాయి. అందుకే వ్యవసాయదారులకు మిత్రులకంటే శత్రువులే ఎక్కువని, ఒకవైపు దయలేని అధికారులు, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలవల్ల సామాన్యరైతాంగజీవితం అడ్డకత్తెరలో పోకచెక్కలా తయారైందని రచయిత వాపోయాడు. జీవయ్య కంటే చదువులో వెనుకబడే మణీగారి కొడుకు ఎలాగో డిగ్రీ పూర్తి చేసుకొని పొలం అమ్మి పట్టణంలో లక్షలు సంపాదించి లక్షాధికారవుతుంటే, పొలాన్ని నమ్ముకున్న జీవయ్య అధికారుల నిర్లక్ష్యానికి, ప్రకృతి వైపరీత్యాలకు జీవనాన్ని గడపటానికి నానావస్థలు పడుతూ, నీరులేక ఎండిపోతున్న పంటలతో తమ శ్రమంతా వృథా అయిందని ఎండిపోతున్న పంటను చూడలేక మిక్కిలి బాధతో గుండె ఆగి పొలంలోనే కూలబడ్డాడు.

రైతుసమస్యలను చిత్రించే మరో కథ గోపిని కరుణాకర్ రచించిన 'దేవరెద్దు' కథ. ఈ కథ చిత్తూరు పడమటి ప్రాంతంలో సకాలంలో వర్షాలు లేకపోవడం వల్ల రైతులు ఎలా అప్పులపాలైపోతున్నారో, ఎటువంటి కడు దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారో, అప్పులు తీర్చలేక ఎలా ప్రాణాలను కోల్పోతున్నారో, తగిన ఆర్థిక స్తోమత లేని కారణంగా బంధాలు ఎలా తెగిపోతున్నాయో చిత్రించిన అద్భుతమైన కథ.

**ఈ కథలో రచయిత వర్షాభావ ప్రాంతాల్లో రైతు దయనీయమైన జీవిత విధానాన్ని చిత్రిస్తూ, రైతులు ఎలా అప్పులపాలౌతున్నారో, ఆత్మహత్యలకు ఎలా పాల్పడుతున్నారో, చివరకు లేమికారణంగా అనుబంధాలు ఎలా తెగిపోతున్నాయో చక్కగా వివరించాడు.**

'దేవరెద్దు' కథలో ఎంగట్రవణ పీలేరు ప్రాంతానికి చెందిన ఒక యువరైతు. సకాలంలో వర్షాలులేక పోవడంతో చేసిన అప్పులు తీర్చలేక తండ్రి మరణిస్తే, బ్రతుకుతెరువుకోసం ఎంగట్రవణ వ్యవసాయాన్నే నమ్ముకున్నాడు. ఎంగట్రవణ చిన్నప్పటి నుండే వ్యవసాయపనుల్లో ఆరితేరినవాడు. మేనమామ చేత సెబాష్ అనిపించుకొన్నవాడు. తన కూతుర్ని ఎంగట్రవణకు ఇవ్వడానికి చిన్నప్పుడే మామచేత మాట పొందినవాడు. కాని వర్షాభావం వల్ల ఎంగట్రవణకు వ్యవసాయం కలసిరాలేదు. తండ్రి లేని ఎంగట్రవణ పశువుల్ని నమ్ముకుని జీవిస్తున్నాడు.

ఎంగట్రవణ తల్లి తన కుమారునికి అన్న కూతుర్నిస్తాడనే నమ్మకంతో కాలం గడుపుతూవుంది. ఒకరోజు ఎంగట్రవణ మేనమామ కిష్టడు తన కుమార్తెకు తిరుమలకొండమీద పనిచేసే వ్యక్తితో పెళ్ళి కుదిరిందని, తాను మాట తప్పినందుకు క్షమించమని కోరగా, ఎంగట్రవణ తల్లి తన అన్న కిష్టడితో పిల్లలిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారని, తన బిడ్డ కష్టపడి భార్యను పోషించుకోగలడని, ఇచ్చిన మాటను తప్పి తన బిడ్డకు అన్యాయం చేయవద్దని ప్రాధేయపడింది. కాని కిష్టడు వ్యవసాయాన్నే నమ్ముకున్న ఎంగట్రవణకు కూతుర్నిస్తే, ఎర్రటి ఎండలో కష్టపడాలని, పస్తులతో అల్లాడాలని, దరిద్రంతో కాపురం చెయ్యాలని, అదే ఉద్యోగం ఉన్నవాడికి ఇస్తే నెలనెలా జీతంతో హాయిగా కాపురం చేసుకుంటుందని అన్నాడు. తన అన్న మాటలు విని ఎంగట్రవణ తల్లి తన అన్నను నానావిధాలుగా శపించింది.

కాని కిష్టడు తన చెల్లితో "చెల్లె... నిన్ను ఎన్నుమింద గువ్వను సాకినట్టు సాకితిమే. ఏ పొద్దన్నా ఇట్టుండే పుల్లతీసి అట్టేసి ఎరుగుదువా? చిన్న వగిసిలో ఎన్ని అగసాట్లు పడితివి. ఎన్ని అగమానాలు పడితివి. ఈడ్ని సాకేదానికి ఎన్ని తిప్పలు పడితివి. తాళి బొట్టుతో సహా కుదువ పెట్టి పంట పండిస్తే ఏం మిగిలింది? అప్పులే కదా మిగిలింది. చేసిన అప్పులు తీర్చలేక, నీ మొగుడు పురుగులు మందు తాగి సచ్చె. సేద్దిం జూదం గదా! వద్దు చెల్లే చూసిచూసి నా బిడ్డగొంతుకొయ్యలేను. నువ్వు ఎన్నైనా తిట్టు నాకు బాధ లేదు. నా బిడ్డ సుఖమే నాకు ముక్కెం" అని వెళ్ళిపోయాడు. ఈ కథలో రచయిత వర్షాభావ ప్రాంతాల్లో రైతు దయనీయమైన జీవిత విధానాన్ని చిత్రిస్తూ, రైతులు ఎలా అప్పులపాలౌతున్నారో, ఆత్మహత్యలకు ఎలా పాల్పడుతున్నారో, చివరకు లేమికారణంగా అనుబంధాలు ఎలా తెగిపోతున్నాయో చక్కగా వివరించాడు.

డా॥లంకిపల్లి కన్నయ్య నాయుడు రచించిన 'జీవనం', గోపిని కరుణాకర్ రచించిన 'దేవరెద్దు' కథలు రైతులు ఎదుర్కొంటున్న ప్రకృతి వైపరీత్యాలను, అధికారుల నిర్లక్షంవల్ల ఏర్పడే కరెంటు సమస్యలను చిత్రిస్తే, పలమనేరు బాలాజి రచించిన 'తపన', బడబాగ్ని శంకరరాజు రచించిన 'ఆఖరితడి' కథలు సన్నకారు రైతులపై పెద్దరైతులు ప్రదర్శిస్తున్న దౌర్జన్యాకాండను విశదీకరిస్తుంది. అంతేగాకుండా 'తపన' కథలో నీటికోసం బోర్లేసినా ఫలితం లేకపోవడంతో అప్పులబాధలతో రైతుల ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలను రచయిత చిత్రించాడు. 'తపన' కథలో చిన్నరైతైన గోవిందయ్యపై ఈర్ష్యతో మునివెంకటరెడ్డి గోవిందయ్య బోరు ఎండిపోవాలనే దురుద్దేశంతో పదమూడు బోర్లు వేసినా నీరు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటాడు. మునివెంకటరెడ్డి బోర్లు వేయడం కారణంగా గోవిందయ్య బోరు ఎండిపోవడంతో గోవిందయ్య మరో బోరు వేయడం ప్రారంభిస్తాడు.

కాని ఆ వేస్తున్న బోరు బండిని మునివెంకటరెడ్డి తన పలుకుబడిని ఉపయోగించి మధ్యలోనే ఆపివేయిస్తాడు. ఆ కారణంగా అప్పులు చేసి బోరు వేస్తున్న గోవిందయ్య అప్పులు తీర్చలేననే దిగులుతో బోరుబావి వద్దే గుండెపగిలి మరణిస్తాడు. ఇలా అప్పుల బాధతో క్రుంగి ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతుల జీవితాన్ని రచయిత పలమనేరు బాలాజీ చక్కగా చిత్రించారు. అదేవిధంగా బడబాగ్ని శంకరరాజు 'ఆఖరి తడి' కథలో చెరువుల నీటిపై ఆధారపడి జీవించే రైతుల్లో సన్నకారు రైతైన చంద్రన్న, పెద్ద రైతైన నరసింహారెడ్డిలకు వంతుల విషయంలో వ్యక్తిగత

## కవిత

# ఓ అనిద్రిత శ్లోకం

**- భవాణిఫణి**



*ఎదురు చూడటం కొత్తేమీ కాదు నీకూ నాకూ*
*నిరర్గళమూ నిరూఢమూ అయిన ఓ స్వీయ సుషుప్తావస్థ కోసం*

*రెక్కలక్కరకి రాని వెన్నెలెంత బాగుంటే ఏం లాభం*
*స్వప్నోద్భవ సమయాల్లేని సైకత వనాల్లోకి జాగృతమవడం అలవాటేగా మనకి*

*సౌందర్య జనకాలనిపించే  నక్షత్ర సమూహపు నిజస్వరూపాల్ని*
*పారదర్శకమై ప్రసరించే జ్ఞానపు తెరల అజ్ఞానపు రంగుని తొలగించుకోవడం మాటల పని కాదే*

*హృదయంలోకి తొంగి చూడటం తెలీకపోవడం ఎంత గొప్ప వరమో కదా*
*అచంచల విశ్వాసపు విడంబనాన శైశవానంద ప్రాప్త్య విలసితమై వర్ధిల్లాలని ఎవరికుండదు*

*కన్నులతో మాత్రమే చూడగలగడం ఎప్పుడు తెలుసు గనక మనకి*
*రెప్పల్లేని మనోనేత్రానికి ప్రాకృతిక వికృతాకృత్య దాస్య విలాపన తప్పేది కాదుగా*

*ఇప్పుడిక చెయ్యగలిగింది మాత్రం ఏముందని...*
*అక్షరాల్లో తలదాచుకోవడం, అక్షయ పాత్రవంటి మనసుని ఎప్పటికీ అర్ధాకలితో ఉంచుకోవడం తప్ప !!*

---

కక్ష్యలకు, ఆధిపత్యపు పోరుల కారణంగా నిరంతరం రైతుల పరిస్థితి నిప్పుల కొలిమిలా వుంటుంది. ఆ శత్రుత్వకారణంగా చంద్రన్నను నరసింహారెడ్డి హత్యగావిస్తాడు. ఇలా అప్పులబాధలతో, అంతర్గత కలహాలతో రైతులు ఎలా జీవితాన్ని గడుపుతున్నారో 'తపన', 'ఆఖరి తడి' కథలలో చిత్తూరు కథకులు చిత్రించారు.

రైతుల సమస్యలను చిత్రించిన మరో కథ వీరపల్లి వీణావాణి రచించిన 'మూలాధార చక్రం'. ఈ కథ నేటి రైతులు ఎదుర్కొంటున్న అధికమైన వ్యవసాయ సమస్యను చిత్రించింది. పొలాన్నమ్మి తన కొడుకుకి ఉద్యోగం కొనివ్వాలని వచ్చిన వీరపల్లి వీర్రాఘవులను పాతికేళ్ళ ఉద్యోగ జీవితంలో 8 రెట్లు జీతం పెరిగితే తన యాభై సంవత్సరాల క్రితం తనకొచ్చిన రాబడిలో సగానికి పడిపోయిందని బాధపడతాడు. పొలం మీద పెట్టె ఖర్చు నాలుగు రెట్లు పెరిగిపోయాయని, ఎరువుల దగ్గరనుండి ప్రతి వస్తువు రేటు పెరిగిపోయాయని బాధపడ్డాడు.ధరల రేటు పెరిగిపోతే ప్రతి 6 నెలలకు ఒక సారి కరువు భత్యం అందించే ప్రభుత్వం, మాకు మాత్రం ఎలాంటి భత్యాలను అందివ్వదని వీరపల్లి వీర్రాఘవులు తండ్రి నాగన్న బాధపడలేదు. ప్రభుత్వం ఇచ్చే సబ్సీడీలు ఏమాత్రం రైతులను ఆదుకోవడం లేదని, నేడు వ్యవసాయానికి, లాటరీకి పెద్ద తేడా లేదని నిట్టూర్చుతాడు. ఈ మూలాధార చక్రం కథలో రైతులపై పడే వ్యవసాయపు ఖర్చులు ఎలా పెరిగిపోతున్నాయో, వాటిని భరించడానికి ప్రభుత్వాలు ఎలా దోహదం పడలేకపోతున్నాయో రచయిత వీరపల్లి వీణావాణి చక్కగా వివరించాడు.

ఇలా చిత్తూరు రైతులు అధికారుల కారణంగా ప్రకృతి వైపరీత్యాలు, పెద్దరైతుల ఆధిపత్యపు పోరు, ప్రభుత్వపు నిరాదరణ మొదలైన కారణాలచేత ఎంతటి దయనీయ జీవితాన్ని గడుపుతున్నారో "చిత్తూరు కథ"సంకలనంలో చిత్తూరు కథకులు రైతుల సమస్యలను సమాజానికి తెలియపరచారు.

## కవిత

# నగరం నిద్రించదు

- గరికపాటి మణీందర్
99 483 26 270



సుదీర్ఘంగా
ప్రయాణం చేసి
అలా నగర శివార్లను సమీపిస్తుంటే
అల్లంత దూరాన ఆకాశం నక్షత్రాల మెరుపులతో
వాలిందా అన్నట్లు విద్యుత్ బల్బులు కాంతి.
పుట్టపగిలిన గాజు పురుగుల్లా
సికింద్రాబాద్ రైలు స్టేషన్ కు
వరుసలు కట్టే రైళ్ళు.
దిగీ దిగగానే ఎటు వెళ్ళాలో తెలియని
బేలతనపు చూపులు.

కేస్ట్రాల్ రేసులా
అడ్డదిడ్డంగా పరుగులు పెట్టే
వాహనాల రణగొణలు.
తలపై మూటలతో తలోదిక్కూ
బస్సు నెంబర్లకోసం గాబరాగా
పరుగులు తీసే ప్రయాణీకులు.

ట్యాంకు బండ్ పైనించి బస్సుపోతుంటే
నీటికాళ్ళపై నిలబడి
చిద్విలాసం చేస్తున్నట్టు తథాగతుడు.
రవీంద్ర భారతిలో
ఏదో సన్మాన కార్యక్రమం జరుతున్నట్టుంది.
ఖద్దరు వాహనాలచుట్టూ
ఖాకీ బారికేడ్లు.
ఇటు ఆంధ్రసారస్వత పరిషత్తులో
కవిసమ్మేళనం జరుగుతుంది
కవులు అక్షర ఫిరంగులై మోగుతున్నారు.
అటు సిటీ సెంట్రల్ లైబ్రరీలో
పుస్తకావిష్కరణ పరిచయ వాక్యాలు
మేఘాల పల్లకీలో కవిని మోస్తున్నారు
త్యాగరాయ గాన సభలో
బహుమతి కార్యక్రమ సందడి.

విశ్వవిద్యాలయాలు
పోటీ పరీక్షల సన్నద్ధతతో
భవిష్యత్తు కలలు కంటున్నాయి.
నాంపల్లిలో సంగీత విభావరి
శ్రోతలను రసైకపారవశ్యంలో
ముంచెత్తుతుంది.
కృష్ణానగర్ రంగుల కలలో
మునిగి తేలుతుంది.
ఫిలింనగర్ బాక్సాఫీస్
లెక్కలు వేస్తుంది.
లోహవిహంగాలు పారిశ్రామిక హడావుడిని
రవాణా చేస్తుంటాయి.

ఇందిరా పార్కు
ధర్నాల నినాదాల్లో చిక్కుబడుతుంది.
అర్ధరాత్రి వేళ అభాగ్యులకు
ఆశ్రయమవుతుంది.

నగరం
తెల్లవార్లూ మెలకువ కెరటాలపై తేలుతుంది
నిద్రపట్టని సిగ్నళ్ళలైట్లయి
చింతనిప్పుల్లా కళ్ళెర్రజేస్తుంది

కథ

# చెర




- మొలకలపల్లి కోటేశ్వరరావు
4086468720

**చా**లా అసహనంగా, చిరాకుగా ఉన్నాడు సాంబయ్య.

ఆయన 11 ఎకరాల రైతు. అందులో 7 ఎకరాలు మంచి పొలం, 4 ఎకరాలు వాగులూ, వంకలూ, ఛౌళ్ళతో కూడిన సవ్వనేల.

ఆ పొలానికి సాంబయ్యకి పట్టాదారు పాస్ పుస్తకం లేదు. ఆ పుస్తకం కోసం ఆరేళ్ళ నించీ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఎంఆర్వో ఆఫీసు చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.

ఆరోజు కూడా ఎంఆర్వో ఆఫీస్‌కి వెళ్ళాడు. ఐదువేలు తీసుకుపోయాడు. అయినా పని కాలేదు.

వాళ్ళు అడిగినంత తను ఇవ్వలేదు. తను ఇచ్చేడబ్బుకి వాళ్ళు పనిచేయరు.

ఇక మాటల్తో పుస్తకం ఇస్తారనే నమ్మకం పోయింది. తేల్చుకోవాలి. ఎలా తేల్చుకోవాలి అనే విషయమే మథనపడుతున్నాడు.

ఆ విషయమే ఆలోచిస్తూ అసహనంగా, చిరాకుగా, కసికసిగా ఉన్నాడు.

"విజయమ్మకి పాస్ పుస్తకం వచ్చిందంట! నిన్న పొలం కండింపు కూడా అయిందంట కదయ్యా!" గడప మీద కూర్చున్న భార్య లక్ష్మి అంది.

"ఏందీ?" ఆశ్చర్యంగా అడిగాడు సాంబయ్య.

"పాస్ పుస్తకం రమేష్ తెచ్చి ఇచ్చాడంట! రమేష్ తీసుకొని, ఆఫీస్‌లో ఇయ్యనీ 15 వేలు ఖర్చు అయిందంట!"

"15 వేలా? ఎంత అన్యాయం! పొలం అమ్మింది. తనకి పుస్తకం కావాలి! అవసరం! ఎంత అడిగినా ఇవ్వక తప్పదనే ధీమాతో కాజేసారన్నమాట!" బాగా కోపంగా అన్నాడు సాంబయ్య.

"పాపం, బాగా బాధపడుతుంది! ఎంతకాలం కూలీనాలీ చేసుకుంటే ఆ డబ్బులు వస్తాయి వదినా అంది! పొద్దున కొట్టుకి పోయి వస్తుంటే తనే పిలిచి మాట్లాడింది!"

"ఆ ఆఫీసు వాళ్ళకి భర్త లేని మనిషనీ, ఆడకూతురనీ జాలీ, దయాకూడా లేదు. కర్కోటకులు!" అని బూతులు తిట్టాడు సాంబయ్య.

విజయమ్మ భర్త నారాయణ, ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మరణించాడు.

ఆయనకి మూడు ఎకరాలు పొలం ఉంది. చిన్న రైతు.

పద్ధతి కలిగిన మనిషి. తినడం, తిరగడం, తాగడం లాంటి చెడు అలవాట్లు కూడా లేవు

వ్యవసాయంలో కలిసి రాలేదు. వడ్డీలకి వడ్డీలు పెరిగి చాలా అప్పులు అయ్యాయి.

ఆయన పోవడంతో బాకీల వాళ్ళందరూ విజయమ్మ ఇంటి చుట్టూ తిరగడం మొదలుపెట్టారు.




విజయమ్మ మంచి మనిషి. కష్టజీవి. ఒకరి సొమ్ము కావాలనుకునే రకంకాదు.

ఇద్దరు ఆడపిల్లలు. నాగా లేకుండా కూలికి పోతుంది. తనకష్టంతో బాకీలు తీరాలంటే జరిగేపనికాదు.

ఒక ఎకరం అమ్మి రుణ విముక్తురాలు కావాలనుకుంది. ఎకరం పొలం బేరంపెట్టింది. అమ్మింది. కొన్నవాళ్ళు లక్ష బయానా కూడా ఇచ్చారు.

ఫలానా రోజు రిజిస్ట్రేషన్‌కి వెళ్దామనుకున్నారు.

రిజిస్ట్రేషన్ జరగాలంటే విజయమ్మ పేరుతో పాస్ పుస్తకం ఉండాలి. అది లేదు. భర్త పేరుతో ఉంది. తన పేరుతో మారాలి.

తమ్ముడ్ని వెంట పెట్టుకుని ఎంఆర్వో కార్యాలయానికి వెళ్ళింది. ఒకసారి కాదు.

''నువ్వు నారాయణ భార్యవని రుజువేమిటి?'' మొదటిసారి వెళ్ళినప్పుడు అడిగారు.

రేషన్ కార్డు చూపెట్టింది.

"ఆ పొలం మీదే అని నమ్మకం ఏమిటి?" రెండోసారి వెళ్ళినప్పుడు అడిగారు.

భర్త పేరుతో ఉన్న పాస్ పుస్తకం చూపెట్టింది.

"ఆ పొలం మీకు ఎక్కడ నించి వచ్చింది? ఎలా వచ్చింది? స్వార్జితమా, పిత్రార్జితమా, దానరూపేణా వచ్చిందా, దత్తత రూపేణా వచ్చిందా? పొలం మీకు ఎక్కడ నించి వచ్చిందో ఆధారాలు కావాలి?"

ఆధారాలు కాదు కావాల్సింది, లంచాలు! ఆ మాట చెప్పకుండా రకరకాల కొర్రీలూ, వంకలూ పెట్టి ఆమెని తిప్పించుకున్నారు. ఆమెకి విసుగూ, విరక్తీ పుట్టిపోయింది.

చివరికి, ఊళ్ళో ఎంఆర్వో ఆఫీసులో పనులు చేసిపెట్టే రమేష్ అనే దళారిని ఆశ్రయించింది. మొదటే వాడి దగ్గరికి వెళ్ళేది కానీ, వాడి ఆశ పెద్దది! నమ్మకం లేని మనిషి! వాళ్ళకి రూపాయి ఇచ్చి, వీడు రెండు రూపాయలు తింటాడు. తిప్పించు కుంటాడు. డబ్బు చాలా తీసుకుంటాడు. ఈ భయాలతో వాడి దగ్గరకు వెళ్ళలేదు. చివరికి వాడ్నే ఆశ్రయించాల్సి వచ్చింది.

ఎలాగైతేనేం, 15 వేలు వదిలినా విజయమ్మ గండం గడిచి గట్టెక్కిపోయింది.

మరి తను ఈ గండం నించి ఎలా బయటపడాలో? ఎప్పుడు బయటపడాలో?

సాంబయ్య, వాళ్ళ అన్న పొలం పంచుకుని తొమ్మిదేళ్ళు అవుతోంది. పొలం పంచుకున్న ఏడాదే, సాంబయ్య పత్తి, మిరప పంటలు వేద్దామని బళ్ళారి వెళ్ళాడు.

ఊళ్ళో అంతకు ముందు చాలా మంది బళ్ళారి వెళ్ళారు. వాళ్ళు బాగా సంపాదించారు.

తను ఈడులో ఉన్నాడు. బండ చాకిరీ చేయగలడు. ముందు వెళ్ళిన వాళ్ళని చూసి, సంపాదించకుందామనే ఆశతో వెళ్ళాడు.

మూడేళ్ళు బళ్ళారిలో పొలాలు మగతాకి తీసుకుని సాగు చేసాడు. ఒక ఏడు కొద్దీ గొప్పా మిగిల్నా చివరి రెండేళ్ళూ దండగలే! చివరికి ఉన్న డబ్బు పోగొట్టుకోవడంతో పాటు, మూడు లక్షల అప్పుతో తిరుగుముఖం పట్టాడు.

రైతు బతుకు ఎక్కడైనా ఒకటే!

వేర్లు పడిన కొత్తలోనే అన్న ఎలాగో తంటాలు పడి, పట్టాదారు పాస్ పుస్తకం తెచ్చుకున్నాడు.

తను బళ్ళారి వెళ్ళడంతో పాస్ పుస్తకం అవసరం లేకపోయింది. పుస్తకం అవసరము అప్పుడు అంతగా తనకి తెలియలేదు.

ఇక్కడికి వచ్చిన తరువాత పాస్‌పుస్తకం కావాల్సి వచ్చింది.

గవర్నమెంటు అప్పుడప్పుడూ ఇచ్చే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు వాటి కోసం పాస్ పుస్తకం కావాలి. పుస్తకం ఉంటేనే అవి ఇస్తారు.

బళ్ళారి నించి వచ్చిన కొత్తలో ఎంఆర్వో ఆఫీస్‌కి వెళ్ళాడు. పాస్‌పుస్తకం అడిగాడు.

"ఎకరానికి వేయి అవుతుంది. నీకు ఎన్ని ఎకరాలుంటే అన్ని వేలవుతుంది."

"నాకు సవుడూ సంకల్తో 11 ఎకరాలు ఉంది సారూ!"

"నీ 11 ఎకరాలకీ 11 వేలవుతుంది. పోనీ, వేయి తీసివేసి 10వేలు ఇవ్వు. రెండు రోజుల్లో పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ రెండూ ఇస్తాం!" అన్నారు అక్కడి ఉజ్జోగస్తులు.

10వేలు! మాటలా? అప్పుడు తన చేతిలో నిజంగా 10 రూపాయలు కూడా లేవు. బళ్ళారిలో దండగలపాలై అప్పుల్తో

తిరిగి రావాల్సి వచ్చింది. గవర్నమెంటు ఇచ్చే వందా, రెండొందలు సబ్సిడీ విత్తనాల కోసం పదివేలు వాళ్ళ ముఖాన ఎక్కడ తగలెయ్యాలి? అంత ఇవ్వలేనని తిరిగి వచ్చాడు.




అప్పుడు అలా అయింది.

నాలుగేళ్ళ నాడు ఎంఆర్వో మారిపోయాడు. ఆడామె ఎంఆర్వోగా వచ్చింది.

ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ అని పెడతారు. ఆ రోజు ప్రజలు వెళ్ళి, తమ సమస్యల్ని చెప్పుకుంటారు.

ఆడామె! మగవాళ్ళంత కఠినంగా ఉండరనే ఉద్దేశ్యం తో ఒక సోమవారం గ్రీవెన్స్ సెల్‌కి వెళ్ళాడు. ఎంఆర్వోని కలిసి తన సమస్య చెప్పుకున్నాడు.

"అర్జీ రాసి ఇవ్వండి" అందామె.

బయటికి వచ్చి, అర్జీ రాసి తీసుకుపోయి ఇచ్చాడు.

అర్జీ ఇమ్మని అడగటంతో, పని అవుతుందనీ, పాస్ పుస్తకం వస్తుందనీ చాలా ఆశించాడు.

తరువాత రెండు సోమవారాలు ఆగి, మూడో సోమవారం వెళ్ళి అడిగాడు.

"పుస్తకం ఇంకా రాలేదు." ఆర్రై చెప్పాడు.

మళ్ళీ రెండు సోమవారాలు ఆగి వెళ్ళాడు. ఎంఆర్వోని కలిసాడు.

"ఆర్డీవో ఆఫీస్‌కి రాసాం. అక్కణ్ణించి రావాలి."

"ఎప్పుడు వస్తుందండీ?"

"వాళ్ళు పంపించినప్పుడు వస్తుంది?"

"వాళ్ళు ఎప్పుడు పంపిస్తారండీ?"

"అది ఆ భగవంతుడికి తెలియాలి!" అందామె చేతులు పైకి చూపిస్తూ.

నిరాశగా బయటికి వచ్చాడు. బయట గానుగు చెట్టు కింద రెండు సిమెంటు బల్లలు ఉన్నాయి.

తమ పొరుగూరి మాజీ సర్పంచ్ ఒక బల్ల మీద కూర్చుని సిగరెట్ తాగుతున్నాడు. ఆయన తనకి మంచి పరిచయం. వెళ్ళి పక్కన కూర్చున్నాడు సాంబయ్య.

వాళ్ళ పొలాలూ, సాంబయ్య పొలాలూ కలిసే ఉంటాయి. ఆయనా, ఆయన భార్యా 13 సంవత్సరాలు సర్పంచ్‌లుగా పనిచేశారు. పేరుకే భార్య సర్పంచ్. పాలన ఈయనే చేసాడు ఆమె హయాంలో కూడా.

''ఏం వని మీద వచ్చావు సాంబయ్యా?" అడిగాడు ఆయన.

చెప్పాడు ఈయన, వివరంగా, బాధగా.

"పిచ్చోడా.. అర్జీ ఇస్తేనే పని అయితే ఇక కావాల్సిం దేంవుంది? అంత సింపుల్‌గా పనైపోతే ఇది ఎంఆర్వో ఆఫీస్ ఎందుకవుతుంది? నువ్వు ఇచ్చిన అర్జీ నువ్వు గడప దాటిన వెంటనే చెత్తబుట్టలో పడుతుంది. నీదే కాదు, ఎవరి అర్జీ అయినా చెత్తబుట్టకే! గ్రీవెన్స్‌సెల్ అంటే ఇది అంతా ఒక పెద్ద ఫార్స్. ఒక చిన్న సమస్య కూడా పరిష్కారం కాదు. కనీసం రేషన్ కార్డ్లూ, ఫింఛన్ లాంటివి కూడా రావు. అంతా నాటకం, బూటకమే!"

"అంతేనా?"

"అంతేమరి! నువ్వు బతికినంత కాలం తిరుగు, వాళ్ళకి డబ్బులు ముట్టకపోతే నీ పని కాదు. ఇవి రాతి విగ్రహాలు! చలించవు! కరెన్సీ చేతిలో పడితేనే కదలిక వచ్చేది!"

ఆయన మాటలతో, ఉసూరుమని ఊగులాడుతూ ఇంటికి చేరుకున్నాడు సాంబయ్య.

నిరుడు రాష్ట్రం విడిపోయి కొత్త ప్రభుత్వం వచ్చింది. చాలామంది ఉజ్జోగస్తుల్ని మార్చింది.

మండలానికి కొత్త ఎంఆర్వో, గుమస్తాలు వచ్చారు. ఆర్రై ఒక్కడే మారలేదు.

కొత్త ఎంఆర్వో వచ్చిన రెండు నెలలకి మండలానికి వెళ్ళాడు.

మండల కేంద్రానికీ, తమ ఊరికీ మధ్య 16 కిలోమీటర్ల దూరం. మండల కేంద్రానికి ఉత్తరం వైపు గ్రామాలు కొన్ని టౌన్ లో కలిసిపోగా, కొన్ని చేరువయ్యాయి. తమ ఊరు కేంద్రానికి దక్షిణ దిశలో ఒక చివర ఉంది.

ఎంఆర్వోని కలిసి పాస్ పుస్తకం అడిగాడు.

"ఆర్రైతో మాట్లాడండి. ఆయన చెప్పినట్లు చేయండి" అన్నాడు ఎంఆర్వో.

పక్క గదిలో ఉన్న ఆర్రై దగ్గరకి వెళ్ళాడు.

"డబ్బు లేనిదే పాస్ పుస్తకం రాదు. ఎందుకు వృధాగా తిరగటం? ఎకరానికి రెండు వేలవుతుంది!" నిర్మొహమాటంగా అన్నాడు ఆర్రై.

రైతులు కొనే విత్తనాలు, ఎరువులు, మందులు ఇలాంటి వాటి ధరలు ఏటికేడూ పెంచుతున్నట్లు వీళ్ళు లంచాల రేట్లు

కూడా ఏటికేడూ పెంచుతున్నారు కాబోలు అనుకున్నాడు సాంబయ్య.

నిరుడు 15 వేలు, ఇప్పుడు 20 వేలు! ఎక్కడ తెచ్చివ్వాలి? పంటలు అంత బాగా పండుతున్నాయా?




ఇక ఈ జన్మకి పాస్‌బుక్ రాదు అనుకుని, ఎదురుగా రోడ్ పక్కన ఉన్న గుడిసె హోటల్లోనికి వెళ్ళాడు టీ తాగుదామని. బస్‌కి ఇంకా టైముంది.

టీ తాగి, అక్కడ బల్లమీద కూర్చుని ఉంటే, తమ వూరి నించి టౌన్‌కి చేరిన బ్రహ్మం, ఆర్‌ై నవ్వుకుంటూ వచ్చారు.

"ఏం సాంబయ్యా.. ఏం చేస్తున్నావు? ఊళ్ళో అందరూ బాగున్నారా?" బ్రహ్మం పలకరించాడు.

ఆయన బంగారపు పని చేస్తుంటాడు. ఊళ్ళో పెద్దగా పనులు సాగటం లేదని చాలాకాలం క్రితం టౌన్‌కి చేరుకున్నాడు. కలివిడి మనిషి.

మాటల సందర్భంలో సాంబయ్య తను వచ్చిన పని చెప్పాడు.

"ఏమండీ ఆర్‌ై గారూ. ఈయన విషయం ఏమిటి?" బ్రహ్మం అడిగాడు.

"ఏముందండీ.. మామూలే కదా డబ్బులేకుండా పాస్ పుస్తకం కావాలంటే ఎలా వస్తుందండీ? అంతకాదు, ఇంత ఇస్తాననే మాట ఆయన నోటి నించి రాకపోయా!"

"మీరు ఎంత అడిగారేమిటి?"

"మీరు రెండున్నర ఎకరాలకీ ఎంత ఇస్తున్నారు చెప్పండి?"

"నేను వేరు. నాది టౌన్ పక్క పొలం. నేను ఇచ్చినట్లు ఇవ్వమంటే రైతులు ఏం ఇవ్వ గలరు? వానల్లేకా, పంటలు పండకా వాళ్ళు నానా బాధలు పడుతుంటే!"

"ఎవరి బాధలు వాళ్ళకి ఉంటాయి! పీత కష్టాలు పీతవి! సిటీకి దగ్గరగా ఉన్న మండలం అనీ, ఇక్కడ భూములు రేట్లు పెరుగుతున్నాయనీ, మారుమూల మండలం నించి ఇక్కడికి ట్రాన్సఫర్ చేయించుకోవడానికి సార్‌కి పది లక్షలు ఖర్చు అయ్యాయి. ఎమ్మెల్యేకే చాలా ఇచ్చాడు. ఆ డబ్బు అంతా ఇప్పుడు రావాలి కదా! ఆ డబ్బే కాదు, అంత ఖర్చు పెట్టాడంటే ఎంత రావాలి!" బ్రహ్మంతో చెప్పి, తిరిగి సాంబయ్యతో అన్నాడు.

"మీది 11ఎకరాలు కదా! 18 వేలు ఇవ్వండి. చాలు! రెండు రోజుల్లోనే పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ రెండూ మీ ఇంటికి తెచ్చి ఇస్తాను."

18 వేలు! ఆయనకి చాలు! అంత డబ్బు ఇవ్వగలిగితే ఇన్ని తిప్పలు ఎందుకు?

"నేను బళ్ళారి వెళ్ళి చాలా నష్టపోయాను సార్! మూడేళ్ళనించీ ఇక్కడా పంటలు పండకపోయా! ఉంటే ఇవ్వనా? మీ ఆఫీసు చుట్టూ పనిమాలా ఎందుకు తిరుగుతాను?"

"మేం చేయగలిగేది ఏముంది? వస్తాను బ్రహ్మం గారూ.." ఆర్‌ై టీ తాగి, సిగరెట్ ముట్టించుకుని, ఆఫీస్‌లోనికి వెళ్ళిపోయాడు.

"నేను పాతికేళ్ళ క్రితం వల్లూరు దగ్గర 50వేలు పెట్టి రెండున్నర ఎకరాలు కొన్నాను సాంబయ్యా! రోజురోజుకీ టౌన్ పెరిగిపోతంది కదా! నేను కొన్న పొలం టౌన్‌కి దగ్గరైపోయింది. ఇప్పుడు ఎకరం అరవై లక్షలకి అడుగుతు న్నారు. రెండున్నరలో ఒక ఎకరం అమ్ముదామనుకుంటున్నా! ఇప్పటి దాకా పాస్‌బుక్ లేదు. పాస్ పుస్తకం అడిగితే ఎంత ఇస్తావు అని అడిగారు. లక్ష రూపాయలు ఇస్తాను, నన్ను తిప్పించు కోకుండా పుస్తకం ఇమ్మని అడిగా! సంతోషంగా వప్పుకున్నారు. అప్పుడు నేను మొత్తం పొలమే 50 వేలకి కొన్నా! ఇప్పుడు ఎకరమే 60 లక్షలకి అడుగుతున్నారు. నాకు డబ్బు అవసరం. పోనీయ్! వెధవలు! వీళ్ళతో బేరం ఎందుకు? వీళ్ళ చుట్టూ ఎక్కడ తిరగ్గలం?"

"మరీ లక్షా? డబ్బులు అంత ఎక్కువగా ఉన్నాయా బెమ్మం? 50 వేలు ఇస్తాను అనొచ్చు కదా?"

"అనొచ్చు! వీళ్ళు తెలివి తక్కువ వాళ్ళా? పోయిన ఎంఆర్వో 70 వేలు అడిగింది. అప్పుడు నాసైటుకి ఇంత రేటు కూడా లేదు. అంతకంటే ఎందుకు తగ్గుతాడు ఈ ఘనుడు? అవసరం మనది! పని కావాలి. తప్పదు మరి!"

"మిమ్మల్ని చూసి మమ్మల్ని కూడా అంత ఇయ్యా, ఇంత ఇయ్యా అని అడుగుతుండే! మేం ఎక్కడ తెచ్చియ్యాలీ?"

"ప్రతి ఘటన ఉండాలి సాంబయ్యా! ఒక్కరైనా ఎందుకు ఇవ్వాలీ, ఈ లంచాలు ఏమిటీ అని నిలదియ్యాలి. అలా నిలదీస్తే కొద్దిగా అయినా జంకుతారు. అసలు నలుగురూ కలిసి గట్టిగా అడిగితే చాలు, చచ్చినట్టు కుక్కిని పేనుల్లా చేస్తా రు. ఎవరికి వాళ్ళే ఇబ్బంది పడుతున్నారూ, మళ్ళీ వాళ్ళు

అడిగినంత ఇస్తున్నారూ! మనల్ని మన అవసరాలు తరుము తున్నాయి. వీళ్ళకి లంచాలు మనమే అలవాటు చేస్తున్నాం."

"ఇంత మిడిమేలం నేను ఎక్కడా చూడలేదు బెమ్మం! నాలుగు పేజీల పుస్తకానికి వేలువేలు లంచాలా? రైతులు ఉంటానికా, పోటానికా? లంచం అడిగేదానికైనా హద్దూపద్దూ ఉండాల్సిన పనిలేదా?"

"వాళ్ళ పని అలా ఉంది. ఈ మధ్య సిఎం ఒక సర్వే చేయించాడంట! లంచాల విషయంలో ఏశాఖ ఎలా ఉందనేది! అన్నిటికంటే రెవిన్యూశాఖ లంచాల విషయంలో మొదటి వరుసలో ఉందంట! ఇది సిఎం మంత్రి మండలిలో చెప్పిన మాట. పేపర్లలో వచ్చింది. పోలీసులే లంచగొండులు అనుకుంటాం మనం. వాళ్ళని వీళ్ళు మించిపోయారు!"

మాటల్లో బస్ రావడంతో, అది ఎక్కి ఇంటికి చేరుకున్నాడు సాంబయ్య.

ఇది జరిగి 8 నెలలు అవుతోంది.

పది రోజుల క్రితం గ్యాస్ బండకి పడిన సబ్సిడీ డబ్బు తెచ్చుకుందామని బ్యాంక్‌కి వెళ్ళాడు.

గ్రామీణ బ్యాంక్. మధ్యాహ్నం జనం ఎవరూ లేరు.

మేనేజర్ చాలా మంచివాడని ఊళ్ళో జనం అంటున్నారు.

అడిగి చూద్దామని, డబ్బు తీసుకుని, మేనేజర్ని అడిగాడు సాంబయ్య.

"నాకు క్రాప్ లోన్ కావాలి సార్. ఇస్తారా?"

"నీకు పొలం ఎంత ఉంది?"

"11 ఎకరాలు వుంది సార్."

"మరి ఇంతకాలం లోన్ ఎందుకు తీసుకోలేదు."

"లోన్ పెట్టుకుందామనుకుటున్నానూ, అలాగే కాలం గడిచిపోయిందిసార్"

"మంచి వాడివే! వ్యవసాయ రుణం అంటే అర్ధరూపాయి కంటే తక్కువ వడ్డీనే పడుతుంది. వెంటనే లోన్ తీసుకో!"

"లోన్ కావాలంటే ఏం కావాలి సార్?"

"ఏమీ పన్లేదు. పొలం పాస్‌పుస్తకం తీసుకుని, బ్యాంక్‌లో ఎకౌంట్ ఉన్నవాళ్ళని ఎవరైనా ష్యూరిటీ సంతకం కోసం తీసకురా! రెండు రోజుల్లోనే ఇస్తా లోను."

"నాకు పాస్ పుస్తకం లేదు సార్. అది లేకుండా వీలు కాదా?"




"పాస్ పుస్తకం వుండాలి. అది లేకపోతే లోన్ ఎలా ఇస్తాం? పుస్తకం తెచ్చుకో!"

"పుస్తకం తెచ్చుకుంటే ఇస్తారా సార్ లోనూ?" అనుమానం తీరక మళ్ళీ అడిగాడు.

"తప్పకుండా ఇస్తాం. ఎందుకు ఇవ్వం? ఇస్తాననే కదా చెప్పేది?"

ఒకింత ఉత్సాహంగానూ, ఆనందంగానూ ఇంటికి వచ్చాడు సాంబయ్య.

ఎంఆర్వోని బతిమాలో, భంగపడో, కాళ్ళా వేళ్ళా పడో పదివేలు ఇచ్చా అంతకంటే ఇవ్వలేనని చెప్పి ఎలాగైనా పాస్‌పుస్తకం తెచ్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

ముందు పదివేలు కావాలి కదా?

అప్పుకోసం అన్వేషణ మొదలుపెట్టాడు.

ఒక గవర్నమెంటు స్కూల్ టీచర్ని పట్టుకున్నాడు సాంబయ్య. ఆయన తనకి కొంచెం బంధువు కూడా!

విషయం వివరంగా చెప్పాడు. బతిమాలాడు. రెండు గంటల పాటు మొండికి పడి కూర్చున్నాడు.

తప్పదనుకుని ఆయన ఐదువేలు ఇచ్చాడు అతి కష్టంతో.

సాంబయ్యకి తొందరగా ఉంది.

ముందు ఎడ్వాన్స్‌గా ఐదువేలు ఇచ్చి, పాస్‌పుస్తకం ఇచ్చినప్పుడు మిగతా ఐదువేలు ఇద్దామని ఎంఆర్వో ఆఫీస్‌కి వెళ్ళాడు.

ఆర్ఐ రూంలో ఎవరో ముగ్గురు ఉన్నారు. వాళ్ళు వెళ్ళిన తరువాత, ఎవరూలేని సమయంలో ఆర్ఐ దగ్గరికి వెళ్ళాడు.

"పది వేలు ఇస్తాను సార్! అంతకంటే ఇవ్వలేను సార్! పాస్ పుస్తకం అవసరం సార్! ఐదు వేలు తెచ్చాను సార్! ముందు ఇవి తీసుకోండి సార్! రేపు మిగతా ఐదు ఇచ్చి పుస్తకం తీసుకుపోతాను సార్!" అంటూ, సాంబయ్య ఐదు వేలు టేబుల్ మీద పెట్టాడు.

"ఏంటిది? ముందా డబ్బు తీసుకో! డబ్బు ముఖం ఎప్పుడూ చూడలేదనుకుంటున్నావేమిటి? ఐదు వేలకీ, పదివేలకీ పుస్తకం వస్తుందా? 11 ఎకరాల ఆసామివీ, పందులాంటి రైతువీ, నేను వప్పుకున్నా సార్ వప్పుకోడు. ఇవ్వలేను అంటున్నావు కాబట్టి ఆరేడు వేలు తగ్గించుకుని 15 తీసుకురా! అంతకంటే తగ్గేది లేదు!" అన్నాడు ఆయన

కరాఖండిగా.

సాంబయ్య ఎంత బతిమాలినా కనికరం చూపలేదు.

దిగాలుగా ఇంటికి వచ్చాడు సాంబయ్య.

ఏంచేయాలా అని మనసంతా అదే ఆలోచన!

మరుసటి రోజు వేకువనే లేచి, గొడ్ల దగ్గర బాగు చేసుకుని, నాలుగు జోళ్ళు నీళ్ళు తీసుకొచ్చి పోసాడు. తిరిగి రావడం ఆలస్యం అవుతుందని కడుపు నిండా అన్నం తిన్నాడు.

'ఇవ్వాళ తేల్చుకోవాలి!'' మనసులో దృఢంగా నిర్ణయించుకున్నాడు సాంబయ్య.

బస్‌లో కూర్చున్నా ఇదే ఆలోచన.

ఏవో పనుల మీద ఆ రోజు ఎమ్మార్వో కార్యాలయానికి చాలామంది జనం వచ్చారు.

ఆర్ఐ దగ్గరకు వెళ్ళాడు సాంబయ్య.

"ఏం సార్.. పదివేలు ఇస్తాను. పాస్‌బుక్ ఇస్తారా, ఇవ్వరా?" సీరియస్‌గా అడిగాడు.

"ఏంటయ్యా నీ గోల? నిన్న చెప్పాను కదా? మళ్ళీ ఎందుకు అడుగుతున్నావు? తమాషాగా ఉందా?" కోపంగా అన్నాడు ఆర్ఐ.

"తమాషా ఏంది? నేను చేస్తున్నానా తమాషా, నువ్వు చేస్తున్నావా తమాషా? ఎవరు చేస్తున్నారు తమాషా? తమాషా అంటనే తమాషా! రైతులు అంటే మీకు తమాషాగా ఉంది!" మరింత కోపంగా పెద్ద కంఠంతో అన్నాడు సాంబయ్య.

ఆర్ఐ తగ్గాడు.

"నేను కాదు బుక్ ఇచ్చేది. ఎంఆర్వో. వెళ్ళి ఎంఆర్వోతో మాట్లాడుకో. నాకు సంబంధం లేదు."

ఎంఆర్వో గదిలోనికి వెళ్ళాలని చూసాడు సాంబయ్య. బిళ్ళ బంట్రోతు వాకిలికి అడ్డంగా నిలబడి ఎవర్నీ లోపలికి పంపించడం లేదు.

బిల్డింగ్‌లో ఒక గంటసేపు అసహనంగా ఆ చివరి నించి ఈ చివరికీ, ఈ చివర నించి ఆ చివరికీ తిరిగాడు.

బయటకి వచ్చాడు.

ఎంఆర్వో కార్యాలయం పక్కనే సెల్ టవర్ ఉంది. టవర్ దగ్గరికి వెళ్ళాడు

తలగుడ్డ చుట్టి చకచకా టవర్ పై భాగానికి ఎక్కాడు.

"టవర్ ఎక్కుతున్నావు ఎందుకూ, ఏమిటీ?" అంటూ నలుగురు వచ్చారు.




"నేను రైతు బిడ్డని. ఆరేళ్ళ నించీ నా పొలానికి పట్టాదార్ పాస్ పుస్తకం ఇమ్మని ఎంఆర్వో ఆఫీస్‌లో అడుగుతున్నా. వాళ్ళు ఇవ్వడం లేదు. వేలు వేలు లంచాలు అడుగుతున్నారు. నన్ను చాలా ఇబ్బంది పెట్టారు. వాళ్ళ మీద కోపంతో ఇక్కడ నించి దూకి చచ్చిపోతున్నాను. నా చావుకి ఎంఆర్వో, ఆర్ఐ కారణం. ఈ విషయం ఉత్తరం రాసి జేబులో పెట్టుకున్నాను!" పెద్దగా చెప్పాడు సాంబయ్య.

కొద్ది సేపటికే గుంపులు గుంపులు జనం చేరారు.

విషయం తెల్సిన ఎంఆర్వో ఆందోళనతో పోలీసులకి ఫోన్ చేసి టవర్ దగ్గరకి వచ్చాడు.

సాంబయ్య చెప్పిన మాటనే మళ్ళీ మళ్ళీ చెపుతున్నాడు.

"దూకితే చచ్చిపోతావు. దిగవయ్యా బాబూ! వాళ్ళ మీద కోపంతో నీ ప్రాణం ఎందుకు తీసుకుంటావు?" అని కింద జనం కేకలు పెడుతున్నారు.

''నేను చచ్చిపోతే నా భార్యా బిడ్డలు దిక్కులేని వాళ్ళు అవుతారు. అయినా పర్లేదు. ఈ అధికారుల మీద చర్య తీసుకోవాలి!"

"నీకు పాస్ పుస్తకం ఇవ్వాళే ఇస్తా. దిగు" ఎంఆర్వో అరిచి చెప్పాడు.

"నీ మాటలు నమ్మను. పుస్తకం ఇస్తానని కాగితం రాసి ఇవ్వు. దిగుతా!"

"కాగితం కాదు. ఇప్పుడే పుస్తకం ఇస్తా. దిగు!"

పోలీసులు వచ్చారు. మైకులో దిగమని చెపుతున్నారు.

సాయంత్రానికి సాంబయ్య టవర్ దిగాడు.

టవర్ దిగిన వెంటనే, ఇద్దరు పోలీసులు చెరొక రెక్క పట్టుకున్నారు.

"పాస్ పుస్తకం విషయం తరువాత. అది మాకు సంబంధం లేదు. నీ మీద ఎటెంప్ట్‌టు సూసైడ్ కేసు బుక్ చేయాలి. స్టేషన్‌కి పద" అంటూ ఈడ్చుకుంటూ తీసుకుపోయి వ్యాన్‌లో కుదేశారు.

రెవిన్యూ వాళ్ల చెరనించి తప్పించుకోవాలని చూసాడు సాంబయ్య. చివరికి పోలీస్ చెరలో చిక్కుకున్నాడు.

ఈ చెర నించి బయట పడాలంటే ఎంత కాలం పడుతుందో, ఎంత ఖర్చు అవుతుందో!

ఈ దేశంలో రైతుకి ఎంతటి దుస్థితి దాపురించింది.

## నచ్చిన రచన




# జీవితానుభవాల సమాహారం


- పప్పుల రాజిరెడ్డి
9652215043


**అ**సమ సమాజంలో అందరి బతుకులు ఒకే తీరుగ ఉండవు. అందుకే సమ సమాజ స్థాపన ఆశయం ముందుకొచ్చింది. బతుకు దుర్భరమైనపుడు వేదన తీవ్రమై అనేక రూపాలు మార్చుకుంటది.ఆ రూపం మనిషిని మహోన్నతంగా నిలబెట్ట గలిగేదై ఉండాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా గుణపాఠంగా తీసుకొని ముందుకు సాగాలి. జీవితంలోని విభిన్న కోణాలను, మనస్తత్వాలను కాలానుగుణంగా మారుతున్న విలువలను పలుపార్శ్వాలను బతుకు తీరుతెన్నులను తన అనుభవంలోకి తెచ్చుకొని కవిత్వం రాస్తున్న వర్థమాన కవి సిద్దెంకి యాదగిరి. తమ అనుభవించింది దళితజీవితం ముఖ్యంగా వూరు జీవితం కావటం వలన తను పుట్టి పెరిగిన ఊరు, మనుషులు, పనిసంస్కృతి, హెచ్చుతగ్గులు, కాయకష్టం చేసుకొని బతికే సగటు జీవి కుటుంబ వెతలు. అనుమానాలు, ధిక్కారాలు ఒకటేమిటి అనేక ఆటుపోట్ల కష్టాల కడలిని ఈదుతూనే మారుతున్న కాలపరిస్థితులకు అనుగుణంగా మార్పులను పసిగడుతూనే ముందుకు సాగుతున్న కవి యాదగిరి.

అవ్వకొంగు పట్టుకొని తిరిగిన కవి. అవ్వకొంగును దర్శించిన తీరు హృద్యంగా ఉంటుంది. తినుబండారాలు మొదలుకొని బాధితుల ఓదార్చే అవ్వకొంగు సుట్టబట్టైన తీరు – ఉడకపోసినపుడు విసనకర్రైన విధం. ఎండలో మర్రినీడ లాంటి కొంగు. తగినంత బలంలేని అవ్వకు పిడిసుట్టు కావటం. జీవితం కన్నీళ్ళకు ఓదార్పు కావటం అవ్వకొంగు మహిమనే ***“మారీతి రివాయి/మా బతుకు తీరు అంతా / మా అవ్వ కొంగుతోనే మొదలు”*** అంటూ కవిత్వం రాస్తాడు సిద్దెంకి. ఒత్తిడిని జయించి అవమానాల్ని గెలువాలనీ – ఎంచుకున్న లక్ష్యం కోసం తెగించికొటాడాలని, ఆత్మహత్యలు సరికావని ఆదర్శజీవితం కవిత వివరిస్తుంది.

***“కవనంలో జనం బాధ నా మానిపెస్టో***
***ఎప్పటికీ నాకు జనమే జండా ఎజెండా”***

అని సూటిగా చెప్పిన కవి ఆత్మీయతా అక్షరాలై చదువు రానోల్లను అల్లుకొని ముందుకు సాగుతానంటాడు. ప్రజల మనిషి బాలగోపాల్ గురించి వివరిస్తూ ఆయన అంకితభావం భావితరాలకు మార్గదర్శనం అని ఆశిస్తాడు.

బడిపిల్లగాడు ‘పవీన్’తో సారు జరిపిన సంభాషణ ‘బతుకుపాఠం’ గా రూపుదిద్దుకుంది. ఊరుబడులలో ఇటువంటి బతుకు పాఠాలు అనేకం వినిపిస్తుంటాయి. ఈ పాఠాలు సర్కారుకు వినపడాల్సి అవసరం ఉంది. తెలంగాణ సంస్కృతి. యాసభాష “దేవులాట” కవిత వివరిస్తుంది. ‘చెప్పగ వినని రాజకీయం! చెంగోబిల్లయితది’ రాజకీయ నాయకులను హెచ్చరించే కవిత. పునాదులు గోపురాలు నిర్మించినా పూజలు చేయనివ్వకపోవటం, తంతెల నాటి నుండి గుడితంతెలు ఎక్కనివ్వపోవటానికి కారణమైన సంస్కృతిని కవి నిలదీస్తడు. ‘శెక్కిల్లుపట్టి శేరుగుద్ది గుణానికి’ తెచ్చేందుకు సవాలు విసిరి ముందుకు సాగుతుంది. గిరికలం గురి అంతరాల అంతంకోసం ప్రయత్నిస్తుంటది. కిరాయి గది కోసం కులం పేరును దాచుకోవలసిన దుస్థితి నుంచి, అవమానాల నుంచి బాధలనుంచి అక్షరాలను ఎక్కుపెడుతూ ప్రవాహ ఉధృతితో వాక్యం వెంబడి వాక్యం అల్లుతూ కవితను కరితో, పురితో బలమైన పగ్గంలా నిర్మిస్తాడు. తెలంగాణా ఎత చెప్పినా – ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష అవసరాన్ని నొక్కి చెబుతూ నిధులు, నీళ్ళు, ఉద్యోగాలు, వనరులు మనకు గాకుండా పోతున్న

## కవిత

# ముఖచిత్రం

- డా.వి. గీతానాగరాణి



గొప్ప సంస్కృతికి చిరునామా ఒకనాడు
ఇప్పుడు ఎంత వెదికినా చిక్కని ఆనవాలు
అన్నార్తులకు అక్షయపాత్ర ఒకనాడు
నేడు అన్నదాతల ఆత్మహత్యలతో వల్లకాడు
వస్త్రహీన కాబోతూ ద్రౌపది అక్రోశిస్తే
ఆదుకున్నాడట కృష్ణుడు
ఆడది కన్పిస్తే చాలు
అమానుషంగా చిదిమేసే
అత్యారాల పర్వం నేడు
మాతృదేవోభవ అంటూ పూజించిన దేశంలో
పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న వృద్ధాశ్రమాలు
ముసలి తల్లిదండ్రుల చివరి మజిలీలు
కుల వృత్తులు వదిలేసి
అందరూ వలస కూలీలు
పచ్చగా కళకళలాడిన పంటపొలాలు
ప్లాట్లుగా ముక్కలైపోయిన బంజరు చెక్కలు
అన్నపూర్ణగా వెలిగిన పల్లెటూర్లు
పట్టెడన్నం కోసం పరితపిస్తున్న
ఎండిన డొక్కలు

ఏ మూల చూసినా
కాచుకుని కూచున్న
కాటేసే అవినీతి విషసర్పం
పబ్ లూ, డ్రగ్ లూ
విదేశీ మద్యాలు, విపణిలో అందాలు
లివింగ్ టుగెదర్లు, లవింగ్ ఒన్ నైట్
స్టాండ్‌లూ
హిమవన్నగం మీది మంచు
నల్లబడ్తున్న ఆనవాళ్ళు
తల ఎత్తుకుని నిలబడిన జాతి
హృదయ స్పందనల్లో అపశృతులు...

---

తీరును పలుకవితల్లో వివరించాడు. 'తెగారం', 'దోఖాభిప్రాయం' 'తెలంగాణ మార్చ్', 'లైఫ్‌లాంగ్ మార్చ్', 'తెగించె తెలంగాణ', 'మరునున్నతల్లి' 'మమ్మల్ని వేం ఏలుకుంటాం', శరీరాస్త్రం', హైద్రాబాద్ మాది, కవితలు ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను చిత్రించిన దుందుబీలు.




సిద్దెంకి యాదగిరి

***"నా అక్షరాల లక్ష్యం / వివక్షా రహిత ప్రజాపక్షం / నాఅక్షరాల గురి అపరిమిత పరిధి"***
అని కవి తన కవిత్వం ఏ లక్ష్యంతో వుందో వివరించే ప్రభుత్వమే అపరిమిత పరిధి" అని కవి తన కవిత్వం ఏలక్ష్యంతో వుందో వివరించే ప్రయత్నమే పై పంక్తుల సారం. బాగా చెప్పాలంటే ఉద్దేశ్యంతో పాటు విషయ వివరణకోసం పద్యపాదాలను విరివిగా వాడుకోవటం వలన కవిత నిడివి పెరిగింది. క్లుప్తత, సంక్షిప్తత, ముగింపు విషయాలలో మెలుకువలు విస్తృత అధ్యయనం, పరిశీలన వల్ల సాధించవచ్చు. సిద్దెంకి యాదగిరికి ఇవ్వన్నీ తెలియనివి కావు. 'మాతౌవ్వ' మొదట కవితా సంపుటికి 'బతుకుపాఠం' రెండో కవిత సంపుటికి కవిత్వంతో పోల్చినపుడు కవి పరిణితి స్పష్టంగా కనబడుతుంది. ఏది ఏమైనా తెలంగాణా పలుకుబడిని, యాసను, భాషను, తన కవిత్వంలో విరివిగా ఉపయోగించుకొని 'బతుకుపాఠం' కవిత్వానికి సొబగులు అద్దాడు. బతుకు అనుభవాల పడుగుపేకల కలనేతగా 'బతుకుపాఠం' సాహిత్య ప్రస్థానంలో ముందుండడం తథ్యం.

రీతిరివాయి, బంతి, జమిడిక, ఇషారలు, బాడుగబండి, బత్తీసపేర్లు, తప్కు లందబత్కు, ఇసిరెలు, చెంగోబిల్ల, మారుమనం, శెక్కిల్లు పట్టి శేరుగుద్దే యిద్దే' ముద్దెర. కుక్కిన పేన్లయి కుములటం, అట్లెల్లు అని అరికెలు పట్టలే, కుదురు, ఆరె, కరిపేనిన తాడు,...లాంటి తెలంగాణ భాషాపదాల వాడకం అద్భుతం. పదబంధాలు తొలకరివాన మట్టి పరిమళాలు వృత్తి సంస్కృతి పారిభాషిక పదాల ఆనవాలుగ సిద్దెంకి యాదగిరి కవిత్వం రూపుదిద్దుకుంది. చిద్రమైన బతుకుల్ని ఆర్ద్రంగా, అంగ సౌష్టవంగా, సాహిత్యంలో బలమైన ముద్రను మరింత బలంగా వేయాలని మనమూ ఆశిద్దాం.

# స్వీకారం

## కాలం నది ఒడ్డున కవిత్వం




**బిక్కి కృష్ణ**

**వెల : 100/- పేజీలు: 180**

**ప్రతులకు : 9912738815**

రైతులు, మహిళలు, గ్లోబలైజేషన్, పల్లెలు, సమాజంలో జరిగే సంఘటనలకు ఎప్పటికప్పుడు స్పందించి బిక్కి కృష్ణ కవిత్వం రాస్తున్నారు. ఆయన కవిత్వంలో భావావేశం, ధర్మాగ్రహం, ప్రతీకలు, పోలికలు, వర్ణనలు, అభివ్యక్తి కొత్తగా అనిపిస్తాయి. రసానుభూతితో పాటు మనల్ని తీవ్రంగా ఆలోచింపజేస్తాయి.

– జస్టిస్ బి. చంద్రకుమార్

## గాలి అద్దం




**ఎం ఎస్ నాయుడు**

**వెల : 120/- పేజీలు: 182**

**ప్రతులకు : 9000528717**

**దాటాలి**

ఏది చూస్తామో/ అది/ అదే రాయలేని వాళ్ళం/ ఏ స్వరమూ లేని పదాలతో / అక్షరాలు శబ్దిస్తే సరిపోతుందా/ ప్రతి అక్షరం లోపల/ శూన్యజ్వాల/ తిరగేసినా / తిరగరాసినా/ అక్షరంతో ఏదీ చూడలేము/ దాచుకునే కంటికి/ పదాలు ఉండవు/ వాక్యాల మధ్య నడవటానికి/ కొన్ని మాటల దారులు సరిపోవు/ నిద్రలోకి దారి చేసి/ నిద్రకీ దారి చూపి/ ఎవరు నిద్రిస్తారు/ దాటాలి/ పదాలలోంచి.

– ఎం ఎస్ నాయుడు

## చెరుగ్గడ రెక్కలు-4





**యం.కె. సుగమ్‌బాబు**

**వెల : 100/- పేజీలు: 120**

శ్రీ సుగమ్‌బాబు ఈ ప్రక్రియలో నాలుగవ భాగంగా – 'చెరుగ్గడ' వెలువరిస్తున్నారు. ఈ శీర్షిక వినగానే 'అపాతమధురం' అనే పదబంధం గుర్తుకు వస్తోంది. అంటే; తాగేకొద్దీ తీయగా ఉండేదని– మరే, చెరుకురసంలో మిరియపు పొడి ఘాటు కూడా ఉంటే, చెప్పేదేముంది.

– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

## నైవేద్యం కవిత్వం




**ఎస్. సుమిత్రాదేవి**


**వెల : 80/- పేజీలు: 104**

**ప్రతులకు : 7207550867**

తన చుట్టూ జరుగుతున్న అన్ని మార్పులకీ, ఘర్షణలకీ ఆమె చలించారు. ఒక సంక్షోభ సందర్భాన్ని పట్టుకుంటానికి ప్రయత్నం చేసారు. 'జ్ఞానోద్దీపన దిశలో/ చిరుదివ్వెగా భావం అక్షరమైంది.' అధ్యాపకురాలు గాబట్టి మాతృమూర్తి గాబట్టి జ్ఞానోద్దీపన అనగలిగారు. బహుశ ఆమె కవిత్వ ధ్యేయం ఈ జ్ఞానోద్దీపనమేమో.

– కె. శివారెడ్డి

## నా లక్ష్యం - నా గమ్యం




**కవిత్వం**

**గులాబీల మల్లారెడ్డి**

**వెల : 100/- పేజీలు: 86**

**ప్రతులకు : 9440041351**

వివిధ సందర్భాలలో నేను వ్రాసిన వెలువరించిన మాటలు కవిత్వం లాగానే ఉంటాయని అనటం మూలాన నేను కాలేజి చదవిన రోజుల నుండి పత్రికలకు కవితలను పంపటం జరుగుతున్నది. అవి పత్రికలు ప్రచురించటం వలన నాలో ఆసక్తి పెరిగింది. ఆ ఉత్సాహంతో, ఉద్వేగముతో వ్రాసినవే ఈ కవితలన్ని.

– గులాబీల మల్లారెడ్డి

## మల్‌దాదా చారిత్రక నవల




**గులాబీల మల్లారెడ్డి**

**వెల : 200/- పేజీలు: 179**


**ప్రతులకు : 9440041351**

ఇది 100 సంవత్సరాల క్రితమే మల్‌దాదా అనే ఒక అగ్రవర్ణ హాలికుడు తోటి మానవుల కోసం ముఖ్యంగా గిరిజన, దళిత, బహుజనుల కోసం స్వేచ్ఛ కోసం, సమానత కోసం పోరాడిన యోధుడి కథ. ఇదీ ఒక అల్లూరి సీతారామ రాజు, కొమురం భీం లాంటి వీరుడి పోరాట గాథనే.

– గులాబీల మల్లారెడ్డి

## నివాళి

# గూడ అంజయ్య కన్నుమూత



ప్రముఖ కవి, ప్రజాగాయకుడు గూడ అంజయ్య(61) జూన్ 21న రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలం రాగన్నగూడెంలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన 1955లో జన్మించారు. అంజయ్య స్వగ్రామం ఆదిలాబాద్ జిల్లాలోని దండెపల్లి మండలం లింగాపురం. అంజయ్యకు భార్య హేమనళిని, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. నలభై ఏళ్లుగా కవిగా, రచయితగా అంజయ్య ఎన్నో కథలు, పాటలు రాశారు. అంటరానితనం, వెనుకబాటుతనాన్ని, బానిసత్వాన్ని పారద్రోలేందుకు తన రచనల ద్వారా కృషి చేశారు. 'నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు' అనే పాట ప్రజాదరణ పొందింది. ఆయన వ్రాసిన 'ఊరు మనదిరా' పాట 16 భాషలలో అనువాదమైంది.తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలంగా పాల్గొన్నారు. తన పాటల ద్వారా అభ్యుదయ, ప్రగతిశీల భావజాలాన్ని ప్రచారం చేశారు. "రక్తంతో నడుపుతాను రిక్షాను.. నా రక్తమే నా రిక్షకు పెట్రోలు " వంటి పాట సహా.. 20పైచిలుకు సినీగీతాలను అందించారు. దండోర, ఎర్రసైన్యం, ఒసేయ్ రాములమ్మ, చీమలదండు, రైతురాజ్యం, అడవిలో అన్న, వీర తెలంగాణ, పోరు తెలంగాణ తదితర చిత్రాలకు పాటలు రాశారు. దళిత కథలు సంపుటితోపాటు కవితలూ రాశారు. తెలంగాణ సాంస్కృతిక సంఘ నాయకుడిగా పనిచేశారు. ఎమర్జన్సీ రోజుల నాటి పరిస్థితుల ఇతివృత్తంగా "పొలిమేర" నవల రాశారు. "గిరిజన మహిళ మేలుకో" నాటిక ఆలోచింపచేసింది. ప్రజాకవి రచయిత గూడ అంజయ్యకు సాహిత్య ప్రస్థానం నివాళి అర్పిస్తున్నది.

**సాహిత్య ప్రస్థానం చిరునామా మారింది**

రచనలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు ఈ చిరునామాకు పంపగలరు

**సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002,**


**ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**

ఇ-మెయిల్ : **ssprasthanam@gmail.com, www.prasthanam.com**

**సాహిత్య ప్రస్థానం పత్రిక చందా వివరాలు**

**1 సంవత్సర చందా రూ. 120/-, 5 సంవత్సరాల చందా రూ.500 /-, 10 సంవత్సరాల చందా రూ. 1000/-.** చెక్కులు, డిడిలు, చెక్‌లపై **PRASTHANAM** అని రాయగలరు.


**అపురూపమైన 11వ ముద్రణ**




- ఇందులోని ప్రతి కవితా నన్ను విపరీతంగా ఆకర్షించింది. ఇక ఈ కవిని నేనంటాను - 'జనాకర్షణ మహర్షి' అని.

  \- వేటూరి సుందరరామ్మూర్తి

- ఈ పుస్తకం చదివిన కొంతకాలం తర్వాత, ప్రజలు రాసింది ఫలానా వాడా అని మరిచిపోతారు. రాతల్ని తమవే అనుకున్నంత సొంతం చేసుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పుస్తకంలోని చాలా కవితలు సామెతలయ్యేంత యోగ్యత ఉంది.

  \- సిరివెన్నెల సీతారామశాస్త్రి

- వేమన అంత సులభమైన శైలిలో వేదాంతం చెప్పిన కవి మరిలేడు. వెన్నముద్దల్లో వేదాంతం ఆ స్థాయిలో లేకపోయినా 'వేదన' మాత్రం ఉంది. కొన్నేమో గుండెమీద నెమలిఈకతో రాసినట్టుగా ఉంటే... కొన్ని పుండుమీద కారం రాసినట్టుంటాయ్. అంచేత ఇవి వొట్టి వెన్నముద్దలే కావు. కొన్ని తీపి ముద్దులు. కొన్ని పిడిగుద్దులు.

  \- తనికెళ్ళ భరణి

- ప్రతి పేజీ చెక్కగా, అందులోని ప్రతి కవితా చాలా చిక్కగా, కొన్ని మరీ చక్కగా, మరికొన్ని మనసుని రక్కగా...

  \- యండమూరి వీరేంద్రనాథ్

ప్రతులకు :

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

**Ph: 9848065658, 9848506964, 8885446222.**

## డైరీ

# 'మబ్బులు వాలని నేల' ఆవిష్కరణ




కడపలో సిపి బ్రౌన్ గ్రంథాలయంలో జూన్ 12న జరిగిన 'మబ్బులు వాలని నేల' పుస్తకావిష్కరణ సభ. చిత్రంలో పుస్తక రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి, మస్తాన్ వలి, మల్లికార్జునరెడ్డి, సింగమనేని నారాయణ ఉన్నారు.

అస్తిత్వ ఆవిష్కరణకు సాహిత్యమే ఆయుధమని ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణ అన్నారు. కడప పట్టణంలోని సిపి బ్రౌన్ గ్రంథాలయంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 12న జరిగిన 'మబ్బులు వాలని నేల' పుస్తకావిష్కరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాయలసీమ అస్తిత్వ ఆవేదన నుంచి పుట్టుకొచ్చిన సామాజిక జీవన స్రవంతికి 'మబ్బులు వాలని నేల' అద్దం పడుతుందని ఆయన అన్నారు. ప్రాంతీయ చరిత్రలో కథలు రాస్తున్న వ్యక్తి సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి అని నవలా రచయితను ప్రశంసించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కేతు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మధ్య నివసించే వారిని ఉద్యమాలు ఆకర్షిస్తాయని అన్నారు. రాయలసీమలో నేల, నీరు, నీడ, గాలిని రచయితలు పరిచయం చేయడాన్ని ప్రశంసించారు. రైతు సంఘం నాయకులు లింగమూర్తి మాట్లాడుతూ రాయలసీమలో సాగునీటి వాటాలు తేలకపోవడంతో సీమవాసులు కేరళ వంటి రాష్ట్రాల్లో రోడ్డుపై జీవనం సాగించాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి మాట్లాడుతూ నవల గ్రామీణ ఇతివృత్తాన్ని ప్రధానంగా ప్రస్తావించిందన్నారు. కడప జిల్లా కవులను గౌరవించాల్సిన అవసరం ఉందని అన్నారు. సిపిఎం పార్టీ 21వ మహాసభ రచనల పోటీలలో ద్వితీయ బహుమతి పొందిన 'మబ్బులు వాలని నేల' నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డిని సభా నిర్వాహకులు సత్కరించారు. సాహితీస్రవంతి కడప జిల్లా కన్వీనర్ మస్తాన్ వలీ అధ్యక్షత వహించిన ఈ సభలో జెవివి జిల్లా అధ్యక్షులు సునీత, రచయితలు డాక్టర్ తవ్వా సురేష్‌రెడ్డి, మల్లి కార్జున రెడ్డి, ఈశ్వర రెడ్డి, పాలగిరి విశ్వప్రసాద్, సిపియం నాయకులు రవిశంకర్ రెడ్డి, ఓ. శంకర్, సాహితీప్రియులు పాల్గొన్నారు.

# కాకినాడలో 'కడలి కల్లోలం' ఆవిష్కరణ

కాకినాడలో రోటరీక్లబ్‌లో జూన్ 12న గనారా నవల 'కడలి కల్లోలం' ఆవిష్కరణ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ సిపిఎం నిర్వహించిన జాతీయస్థాయి నవలా పోటీల్లో కాకతాళీయంగానే పారిశ్రామిక, వ్యవసాయక, సముద్రతీర ప్రాంతాల్లో జరిగిన కల్లోలాలను వివరించే మూడు నవలల్లో 'కడలి కల్లోలం' ఒకటిగా ఎంపిక కావడం హర్షణీయమన్నారు. పంచభూతాల్ని గుప్పిట్లో పెట్టుకోవాలని భావించే భయంకర భూతాల్ని గురించి, అవి సృష్టించే కల్లోలాల గురంచి పాత్రల చిత్రణతో నవలలో చర్చించిన తీరు బాగుందన్నారు. సాహితీస్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొరప్రసాద్ మాట్లాడుతూ వాస్తవిక చిత్రణతో కూడిన నవలలను పాఠకులు ఎప్పటికీ ఆదరిస్తారని, కడలికల్లోలం ఆ వరవడిలో సాగిన మంచి నవల అని అన్నారు. వాడ్రేవు వీరలక్ష్మీదేవి నవలను సమీక్షిస్తూ ఏదైనా ఒక ఉత్పాతాన్ని ఎదుర్కొన్న వాళ్ళు ప్రకృతితో బాగా సాన్నిహిత్య సంబంధం ఉన్నవాళ్ళే అయి ఉంటారన్నారు. సముద్రతీర ప్రాంతంలో మత్స్యకారులు అవసరమైతే ఎలా తిరగబడతారో ఈ నవల్లో గనారా చెప్పారన్నారు. వుయ్యపు హనుమంతరావు సభాధ్యక్షత వహించగా అవధానుల మణిబాబు అతిథులను ఆహ్వానించారు. జోశ్యుల కృష్ణబాబు, గడల శివప్రసాద్, జి. సుబ్బారావు అభినందన ప్రసంగం చేశారు. గనారా స్పందిస్తూ అద్దేపల్లి సహచర నేపథ్యం ఈ నవలా రచనకు ప్రేరణగా పేర్కొన్నారు. జరుగుతున్న విధ్వంసాన్ని ప్రజల ముందుంచాలన్న ఆలోచనే ఈ నవలా రచనకు పురికొల్పిందన్నారు. గనారాను పలువురు రచయితలు, స్నేహితులు సన్మానించారు. సిపిఎం 21వ మహాసభ పోటీలలో బహుమతి పొందిన ర్యాలీ ప్రసాద్, దాట్ల దేవదానం రాజులను ఈ సందర్భంగా సత్కరించారు. పద్మజా వాణి వందన సమర్పణతో సభ ముగిసింది. ప్రజాశక్తి బుక్‌హౌస్ కాకినాడ బ్రాంచి వారు ఈ సభలో పుస్తకాల స్టాల్‌ను ఏర్పాటుచేశారు.



కాకినాడలో జూన్12న జరిగిన 'కడలి కల్లోలం' ఆవిష్కరణ సభ. చిత్రంలో పుస్తక రచయిత గనారా, వొరప్రసాద్, తెలకపల్లి రవి, వుయ్యపు హనుమంతరావు, వాడ్రేవు వీరలక్ష్మీదేవి ఉన్నారు.



విశాఖపట్నంలో జూన్ 15న శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని సాహితీస్రవంతి, శ్రీశ్రీ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో రామకృష్ణ బీచ్‌లో ఉన్న శ్రీశ్రీ విగ్రహం వద్ద జరిగిన నివాళి కార్యక్రమం. ప్రముఖ కవి పి. అనంతరావు, శ్రీశ్రీ విజ్ఞానకేంద్రం, సాహితీస్రవంతి కార్యకర్తలు




విజయనగరంలో జూన్ 15న శ్రీశ్రీ వర్ధంతిని పురస్కరించుకుని సాహితీస్రవంతి ఆధ్వర్యంలో 'పొట్టుపొయ్యి' కవితా సంకలనం, కవిత 2014' పరిచయ కార్యక్రమం. చిత్రంలో విజయేశ్వరరావు, చీకటి దివాకర్, శేషారావు, పిక్కి రవీంధ్రనాథ్ ఉన్నారు.



కర్నూల్ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో సింద్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో జూన్ 15న శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా జరిగిన నివాళి కార్యక్రమంలో శ్రీశ్రీ ఫొటోకు పూలమాల వేస్తున్న సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, శిక్షణా సంస్థ డైరెక్టర్ డా. రాధశ్రీ



ఖమ్మంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం. చిత్రంలో రౌతురవి, మువ్వా శ్రీనివాసరావు, కపిల్ రాంకుమార్ తదితరులు.




కళాసాహితి ఆధ్వర్యంలో మే 8న తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో జరిగిన కవి సమ్మేళనం సభలో జి. సుబ్బారావు కవితా సంపుటి 'గుండెను కడిగే కవితలు' ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో కళాసాహితి వ్యవస్థాపకులు జి. సుబ్బారావు, ఆవిష్కర్త రెంటాల వెంకటేశ్వరరావు, ఎస్.ఆర్. పృథ్వీ తదితరులు



కడపలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 15న శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రం. చిత్రంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఎంపిడిఒ. సాహితీస్రవంతి కన్వీనర్ మస్తాన్‌వలి, సిద్దయ్య, నారాయణ, పద్మ, బాలకృష్ణ, ముని స్వామి, నూర్‌బాషా, నాగార్జున, దుర్గాప్రసాద్, రవికుమార్, ప్రతాప్, నరేంద్ర, మహావీర, ప్రదీప్

## డైరీ

# విశాఖ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో కాలుష్యంపై కవితా భేరి




**విశాఖపట్నంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా జూన్ 19న జరిగిన విశాఖ కాలుష్యంపై కవితాభేరి కార్యక్రమం. చిత్రంలో విశాఖ సాహితీస్రవంతి ప్రధాన కార్యదర్శి నూనెల శ్రీనివాసరావు,సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యాజీ, శాసనమండలి సభ్యులు ఎం.వి.ఎస్. శర్మ, ప్రముఖ కవి మాటూరి శ్రీనివాస్, విశాఖ సాహితీస్రవంతి అధ్యక్షులు ఎ.వి. రమణారావు**

మహాకవి శ్రీశ్రీ 33వ వర్ధంతి సందర్భంగా జూన్ 19న విశాఖపట్నంలోని పౌరగ్రంథాలయంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో కాలుష్యంపై కవితా భేరి కార్యక్రమం జరిగింది. సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు ఎ.వి. రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు ఎం.వి.ఎస్. శర్మ, విశాఖ హరిత సేన కన్వీనర్ ఎం.వి. రత్నం, ప్రముఖ కవి మాటూరి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.వి.ఎస్. శర్మ మాట్లాడుతూ కాలుష్యంపై పోరాటానికి ప్రజలంతా సైనికుల్లా తరలి వచ్చేలా కవితలు రాయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విశాఖ సముద్ర ఘోషతో పాటు ఊపిరితిత్తుల ఘోషను ఉదహరించాలన్నారు. అనంతరం కవులు కాలుష్యంపై వివిధ కోణాలలో తమ స్వీయ కవితలు చదివారు. ప్రముఖ కవి మాటూరి శ్రీనివాస్, సాహితీస్రవంతి రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యాజీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి కవితలను ఎంపిక చేశారు. విరియాల గౌతమ్ 'నగరం' కవితకు ప్రథమ బహుమతి, మోకా రత్నరాజు 'సముద్రానికే కదా' కవితకు ద్వితీయ బహుమతి, పరిమళ 'ఇక్కడే ఉన్నాను' కవితకు తృతీయ బహుమతి దక్కాయి. ప్రోత్సాహక బహుమతులు చొక్కర తాతారావు (పొగ చూరిన విశాఖ), ప్రనాలే ( ఈ సుందరి), శ్రీవైష్ణవి (వాడిన విశాఖ), సిహెచ్. చిన సూర్యనారాయణ (ఆత్మ వ్యధ), పి. నాగభూషణం (మా ఊరు మరో సింగపూర్), డి. సహదేవరావు (మూడు కోతులు) అందుకున్నారు. విశాఖ సాహితీస్రవంతి కార్యదర్శి నూనెల శ్రీనివాసరావు, సుజాతా మూర్తి, ఎస్. నాగరాజు కార్యక్రమాన్ని నిర్వహించారు.




**అనంతపురం జిల్లా రాయదుర్గంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూన్15న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభ. చిత్రంలో సాహితీస్రవంతి రాయదుర్గం కన్వీనర్ జి. శివకుమార్, రాజారామ్, రాయదుర్గం ఎం.ఇ.ఓ. నాగమణి, వెంకటేష్, హేమాద్రయ్య, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు**



***విజయనగరంలోని జిల్లా పరిషత్ హాలులో జూన్ 19న సాహితీస్రవంతి, యువస్పందన ఆధ్వర్యంలో జరిగిన రత్నాల బాలకృష్ణ పుస్తకం 'తరవాణి నానీలు' ఆవిష్కరణ కార్యక్రమం. చిత్రంలో మానేపురం రాజా చంద్రశేఖర్, రత్నాల బాలకృష్ణ, చాగంటి తులసి, చీకటి దివాకర్, చింతకింది శ్రీనివాసరావు, ఆర్.సి.ఎం. చౌదరి ఉన్నారు.***




**కర్నూలులో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో మే 31న జరిగిన నాగప్పగారి సుందరరాజు 48వ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు. చిత్రంలో కెంగార మోహన్**




అనంతపురంలో జూన్ 15న కెఎస్ఎస్ఆర్ కళాశాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభ. చిత్రంలో ప్రసంగిస్తున్న డా॥ రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి. డా॥ ఎం. ప్రగతి, రవిచంద్ర తదితరులు.




పెద్దాపురం సాహితీస్రవంతి, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జూన్ 19న జరిగిన ప్రముఖ రచయిత యాసలపు సూర్యారావు నాల్గవ వర్ధంతి సభ. చిత్రంలో గనారా, డా॥ జోశ్యుల కృష్ణబాబు,అద్దేపల్లి ప్రభు తదితరులు



పెద్దాపురం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జూన్ 15న జరిగిన శ్రీశ్రీ 33వ వర్ధంతి కార్యక్రమం. చిత్రంలో డా॥ జోశ్యుల కృష్ణబాబు, చల్లా విశ్వనాథం, శివ, లీల,పలివెల వీరబాబు, అనంతరావు, దారపురెడ్డి తదితరులు

## కృష్ణా పుష్కరాల ప్రత్యేక సంచికకు రచనల ఆహ్వానం

*'రమ్యభారతి సాహిత్య త్రైమాసిక పత్రిక' కృష్ణా పుష్కరాల ప్రత్యేక సంచిక వెలువరిస్తున్నట్లు సంపాదకుడు చలపాక ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సంచిక కోసం కథలు, కవితలు, వ్యాసాలు పంపించవలసిందిగా విజ్ఞప్తి చేసారు. రచనలను 'రమ్యభారతి సాహిత్య త్రైమాసిక పత్రిక, పి.బి. నెం. 5, డోర్ నెం. 11-57-1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ - 520 001 చిరునామాకు పంపాలి. ఇతర వివరాలకు 9247475975 ద్వారా సంప్రదించవచ్చును.*

## *గుంటూరు జిల్లా రచయితల సంఘం సాహిత్య పురస్కారాల విజేతలు*

*గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతియేటా నిర్వహిస్తున్న సాహిత్య పురస్కారాలు ఈ యేడాది కవితా పురస్కారానికి ఎం.వి. రామిరెడ్డి 'అజరామరం' కవితా సంపుటి, కథా పురస్కారానికి 'పి.వి. సునీల్ కుమార్ 'నీలవేణి' కథా సంపుటి ఎంపికైనట్టు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో గుంటూరులో జరిగే సభలో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.*

## స్పందన

సంపాదకులకు నమస్కారం..

నేను స్వర్ణలత కర్నూల్ నగరం నుండి...చాలా నెలల క్రితం ప్రస్థానం పత్రిక మిత్రుడి ఇంట్లో చూసా ..వావ్...నేను చాలా మిస్ అయ్యా ఇన్నిరోజులు అనుకున్నా... మళ్ళీ ఈ రోజు ప్రజాశక్తి బుక్ డిపోలో ప్రస్థానాన్ని చూసి.. గభాల్న కొనేశా..పాకుడురాళ్ళు..పుస్తకంపై రివ్యూ చదివాక వెంటనే మీతో సంబరాన్ని పంచుకోవాలనిపించి ఇలా వచ్చా ... కవితలు..మిగిలిన కథలు రాత్రి చదివేస్తా...

**- కళ్యాణదుర్గం స్వర్ణలత**

సంపాదకులకు నమస్కారం

జూన్ సంచిక క్షుణ్ణంగా చదివేను. కవితల సంఖ్య ఎక్కువగా వున్నా అన్నీ చాలా బాగున్నాయి. కథల్లో నాకు బాగా నచ్చిన 'చారాణా' చక్కని కథా వస్తువు, మంచి కథనం, అందమైన హృదయానికి హత్తుకునే ముగింపుతో కథ బాగా రాశారు. కవితల్లో అన్నీ చాలా బాగున్నాయి. నాకు బాగా నచ్చిన కవిత 'ఈ పల్లెకు రావొద్దండి. ఇహ వ్యాస పరంపరలో 'స్త్రీ జీవన చిత్రణ' రావూరి భరద్వాజ గారి 'పాకుడురాళ్ళు', పోతులూరి వీరబ్రహ్మం గారి మానవతా విలువలు', తెలుగు కథ- చాకలి చైతన్యం', 'వాడిని జయించాలి' అద్భుతమైన వ్యాసాలు. మొత్తం మీద జూన్ ప్రస్థానం అమూల్యమైన సంచికగా భావిస్తున్నాను. సంపాదకవర్గాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

**- డి.వి. రమణమూర్తి, 9849088748**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# కొమర్రాజు లక్ష్మణరావు

**18.05.1877 - 12.07.1923**



బాల్యంలోనే మరాఠీలో సాహిత్య వ్యాసంగం కొనసాగించారు. మెరోపంత్ రచించినభారతంలోని కర్ణపర్వాన్ని పరిశోధించి ప్రకటించారు. హైదరాబాద్‌లో 1901లో 'శ్రీకృష్ణదేవరాయ భాషానిలయం' గ్రంథాలయాన్ని స్థాపించారు.

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/16-18
Date of Posting : 02.07.2016 ▪ Date of Publication: 28.06.2016

# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




**ప్రజాశక్తి బుక్‌హౌస్, డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి, గవర్నరుపేట, రాఘవయ్య పార్కు వద్ద, విజయవాడ - 520 002, ఫోన్ : 9490099202**

If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059